


సమాజ హితం – మా అభిమతం
www.arunaprabha.com

# అరుణ ప్రభ

ARUNAPRABHA TELUGU DAILY
తెలుగు దినపత్రిక
RNI NO. TEL TEL/2023/89778




రంగారెడ్డి - హైదరాబాద్ సంపుటి : 04 సంచిక : 193 పేజీలు : 12, వెల రూ. 5/- శుక్రవారం, సెప్టెంబరు 4, 2026

PUBLISHED FROM RANGAREDDY, HYDERABAD. CIRCULATED BY : RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD, CHITTOOR, VISAKHAPATNAM, SRIKAKULAM, ELURU, ONGOLE, VIJAYAWADA, SPSR NELLORE, PRAKASHAM, GUNTUR, KURNOOL, KADAPA

# సురేఖపై వేటు



## మంత్రివర్గం నుంచి కొండా సురేఖ తొలగింపు

- సీఎం రేవంత్‌రెడ్డి సిఫార్సుకు గవర్నర్ ఆమోదం
- ప్రణాళికా సంఘం ఉపాధ్యక్ష పదవి నుంచి చిన్నారెడ్డి తొలగింపు
- పార్టీ క్రమశిక్షణ ఉల్లంఘనపై అధిష్ఠానం కఠిన నిర్ణయం
- ముగ్గురు బీసీ మహిళలకు కీలక పదవులు
- ఇటీవలి పరిణామాలపై విస్తృత చర్చల అనంతరం చర్యలు
- రెండేళ్ల 9 నెలలుగా మంత్రిగా కొనసాగిన సురేఖ

### నా బర్తరఫ్ కోసం అధిష్ఠానాన్ని రేవంత్ బ్లాక్‌మెయిల్ చేశారు: కొండా సురేఖ

- క్యాబినెట్ నుంచి బర్తరఫ్‌ను ధ్రువీకరించిన కొండా సురేఖ
- రేవంత్‌పై సురేఖ సంచలన ఆరోపణలు
- తన వివరణ తీసుకోలేదన్న సురేఖ
- నలుగురు నేతలపై కుట్ర ఆరోపణలు
- కూతురు వ్యాఖ్యలను ఆయుధంగా మార్చారని ఆరోపణ

హైదరాబాద్: తెలంగాణ రాజకీయాల్లో కొంతకాలంగా కొనసాగుతున్న ఉత్కంఠకు తెరపడింది. కొండా సురేఖపై కాంగ్రెస్ అధిష్ఠానం, రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సిఫార్సు మేరకు కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ గవర్నర్ శివప్రతాప్ శుక్లా గురువారం నిర్ణయం తీసుకున్నారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించినందుకు సురేఖపై చర్యలు తీసుకోవాలన్న ముఖ్యమంత్రి, పీసీసీ చేసిన సిఫార్సులపై అధిష్ఠానం విస్తృతంగా చర్చించిన అనంతరం ఈ నిర్ణయానికి వచ్చింది. దీంతో గత కొన్నిరోజులుగా కొనసాగుతున్న రాజకీయ ఉత్కంఠకు ముగింపు లభించింది. సురేఖ రెండేళ్ల తొమ్మిది నెలల పాటు మంత్రిగా కొనసాగారు. మరోవైపు వనపర్తి ఎమ్మెల్యే టికెట్ విషయంలో పార్టీపై విమర్శలు చేసిన ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిని కూడా పదవి నుంచి తొలగిస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. కొండా సురేఖపై చర్య నిర్ణయం వెలువడిన వెంటనే ప్రభుత్వం ముగ్గురు బీసీ మహిళలను కీలక పదవుల్లో నియమించడం రాజకీయంగా

(మిగతా 2వ పేజీలో)



# బెదిరింపులకు భయపడను

- నాపై ఎలాంటి ఒత్తిడి లేదు.. బాధ్యతతో ముఖ్యమంత్రిగా పనిచేస్తున్నా
- ఎవరూ నన్ను ఒత్తిడి చేయలేరు.. దోస్తీకి మాత్రం గులామునే
- అసద్, అక్బర్‌ల దేశభక్తి మోదీ, అమిత్‌షాలకు ఏమాత్రం తక్కువ కాదు
- పాతబస్తీ అభివృద్ధికి అవసరమైనన్ని నిధులు కేటాయిస్తా
- మెట్రో పనులు వేగవంతం.. త్వరలో కొత్త కారిడార్‌కు శ్రీకారం
- మైనారిటీలు అధికంగా ఉన్న మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాం
- సైదాబాద్ స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్

హైదరాబాద్ : బెదిరింపులు, ఒత్తిళ్లతో తనను ఎవరూ భయపెట్టలేరని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి పదవికి ఉన్న పరిమితులను అర్థం చేసుకుని బాధ్యతాయుతంగా పనిచేస్తున్నానని తెలిపారు. తనపై ఎలాంటి ఒత్తిడి లేదని, ఎవరూ తనను ఒత్తిడి చేయలేరని పేర్కొన్నారు. అయితే స్నేహంతో మాత్రం తనను గెలుచుకోవచ్చని, దోస్తీకి తాను గులామునని వ్యాఖ్యానించారు. చంచల్‌గూడ నుంచి ఐఎస్ సదన్ కూడలి అవతలి వరకు 3.3 కి.మీ. పొడవునా నాలుగు లైన్ల వెడల్పుతో రూ.620 కోట్ల వ్యయంతో నిర్మించిన స్టీల్ బ్రిడ్జిని గురువారం చంచల్‌గూడ వద్ద సీఎం ప్రారంభించారు. అనంతరం చంచల్‌గూడ డిగ్రీ కళాశాల మైదానంలో నిర్వహించిన సభలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి పులిలా ఉండేవారని, దిల్లీ నుంచి వచ్చి బ్రిడ్జి ప్రారంభోత్సవంలో సంతోషంగా పాల్గొన్నప్పటికీ వేదికపై ముభావంగా కనిపిస్తున్నారని వ్యాఖ్యానించారు. వీహెచ్ అన్నా.. సీఎంను మీరేమైనా అన్నారా? అంటూ సరదాగా ప్రశ్నించారు. దీనికి స్పందించిన సీఎం రేవంత్‌రెడ్డి బెదిరింపులతో తనను ఎవరూ భయపెట్టలేరని పేర్కొన్నారు. అసదుద్దీన్, అక్బరుద్దీన్‌లకు దేశభక్తి లేదని కొందరు విమర్శిస్తుంటారని, అయితే దేశభక్తిలో వారు ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు ఏమాత్రం తీసిపోరని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆపరేషన్ సిందూర్ సమయంలో సైన్యానికి మద్దతుగా

(మిగతా 2వ పేజీలో)



### కొండా సురేఖ బర్తరఫ్ రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

- తెలంగాణ కేబినెట్ నుంచి మంత్రి కొండా సురేఖ తొలగింపు
- సీఎం రేవంత్ రెడ్డిని శపించిన సురేఖ కుమార్తె కొండా సుస్మిత
- పరకాల నుంచి పోటీ చేయాలంటూ ముఖ్యమంత్రికి సవాల్
- తన తల్లికి అన్యాయం జరిగిందని సుస్మిత ఆవేదన



### కొండా సురేఖ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే అంతిమం :: రాజగోపాల్ రెడ్డి

- కొండా సురేఖ చేసిన తప్పుల రికార్డు హైకమాండ్ వద్ద ఉందని వ్యాఖ్య
- పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలని సూచన

### 'ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు'.. కొండా మురళి ఘాటు వ్యాఖ్యలు!

- కొండా సురేఖ బర్తరఫ్‌పై మురళి స్పందన
- ఎక్స్‌లో ఘాటు వ్యాఖ్యలు చేసిన సీనియర్ నేత
- రాజకీయ కుట్రలపై పరోక్ష హెచ్చరికలు
- పదవులు లేకపోయినా గౌరవం ఉంటుందన్న మురళి
- వెనక్కి తగ్గేది లేదని స్పష్టమైన సంకేతాలు



### నల్సార్ విద్యార్థులకు భారీ ఊరట.. బీసీఐకి సుప్రీంకోర్టు మొట్టికాయలు



- న్యాయ విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసిన సుప్రీంకోర్టు
- నల్సార్ స్నాతకోత్సవానికి సీజేఐని ఆహ్వానించడాన్ని వ్యతిరేకించిన విద్యార్థులు
- నల్సార్ 2026 బ్యాచ్ విద్యార్థులను ఎన్‌రోల్ చేయవద్దని బీసీఐ చైర్మన్ ఆదేశం
- బీసీఐ అధికారాలు న్యాయవాదులకే వర్తిస్తాయని, విద్యార్థులకు కాదని తీర్పు



### 36 వేల కి.మీ ఎత్తు నుంచి భారత్‌పై నిఘా.. ఈఓఎస్-05తో ఇస్రో భారీ ప్రయోగం!

- సెప్టెంబర్ 4న ఈఓఎస్-05 ప్రయోగం
- తెల్లవారుజామున 2.55 గంటలకు లాంచ్
- జీఎస్ఎల్వీ-ఎఫ్17తో ఉపగ్రహ ప్రయోగం
- దాదాపు 36 వేల కి.మీ. ఎత్తులో నిఘా
- సరిహద్దులు, తీరాలపై నిఘాకు ఉపయోగం

# పది రోజుల్లో సాగర్ నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలి

- సెప్టెంబరు 13లోగా సాగర్ నీటి షెడ్యూల్ ప్రకటించాలి
- ఎడమకాల్వ ఆయకట్టుకు సమృద్ధిగా నీటిని అందించాలి
- లేకుంటే కోదాడ నుంచి హాలియా వరకు పాదయాత్ర
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు
- సాగర్‌లో నీళ్లున్నా ఎడమకాల్వకు ఎందుకు ఇవ్వడం లేదు?
- శాసనసభ సమావేశాల్లో రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తాం
- మిర్యాలగూడ రైతు మహాధర్నాలో కేటీఆర్ హెచ్చరిక



నల్గొండ : నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడికాల్వ ద్వారా ఆంధ్రప్రదేశ్‌కు నీరు తరలివెళ్తున్నా తెలంగాణ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని భారాస కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రైతుల సమస్యలను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. సెప్టెంబరు 13లోగా సాగర్ ఎడమకాల్వ పరిధిలోని ఉమ్మడి నల్గొండ, ఖమ్మం జిల్లాలకు నీటి విడుదల

(మిగతా 2వ పేజీలో)

# సురేఖపై వేటు



ప్రాధాన్యం సంతరించుకుంది. సెప్టెంబరు 1 నుంచి కాంగ్రెస్ అధిష్ఠానంతో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి పలు దఫాలుగా చర్చలు జరిపారు. ముఖ్యమంత్రిపై నేరుగా విమర్శలు చేయడాన్ని అధిష్ఠానం తీవ్రంగా పరిగణించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. పార్టీలోనూ, ప్రభుత్వంలోనూ క్రమశిక్షణ విషయంలో రాజీ పడకూడదనే ఉద్దేశంతో సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యలకు అంగీకారం కుదిరిందని కాంగ్రెస్‌కు చెందిన ఓ సీనియర్ నాయకుడు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి కూడా ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదనే నిర్ణయానికి వచ్చినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది. సినీనటుడు నాగార్జున కుటుంబంపై సురేఖ చేసిన వ్యాఖ్యల అంశాన్ని కూడా అధిష్ఠానం గతంలో తీవ్రంగా పరిగణించింది. అయితే అప్పట్లో ముఖ్యమంత్రి జోక్యం చేసుకుని పరిస్థితిని సర్దిచెప్పినట్లు పార్టీ వర్గాల్లో ప్రచారం జరిగింది. ఓఎస్డీని తొలగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న సమయంలో సురేఖ కుమార్తె చేసిన విమర్శల విషయంలోనూ కొందరు సీనియర్ నాయకులు జోక్యం చేసుకోవడం, కొండా దంపతులు కలిసి మాట్లాడటంతో అప్పట్లో పరిస్థితి సద్దుమణిగింది. కానీ తాజా పరిణామాల నేపథ్యంలో మాత్రం చర్య తప్పదనే నిర్ణయానికి సీఎం రేవంత్‌రెడ్డి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మేరకు అధిష్ఠానాన్ని ఒప్పించి సురేఖ, చిన్నారెడ్డిపై చర్యలు తీసుకునేలా చేసినట్లు పార్టీ వర్గాల్లో అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొంతకాలంగా కొండా సురేఖ వ్యవహారంపై ముఖ్యమంత్రి అసంతృప్తితో ఉన్నప్పటికీ, గత నెల 16న ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటనలో చోటుచేసుకున్న పరిణామాలు పరిస్థితిని మరింత తీవ్రం చేశాయి. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మేడారం, ములుగు, పరకాలలో పర్యటించిన సమయంలో అదే జిల్లాకు చెందిన, పైగా దేవాదాయశాఖ మంత్రిగా ఉన్న కొండా సురేఖ గైర్హాజరయ్యారు. అనంతరం పరకాలలో నిర్వహించిన బహిరంగ సభలో మాట్లాడిన సీఎం వచ్చే ఎన్నికల్లో సిటింగ్ ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను పిలుపునిచ్చారు. దీనికి రెండు రోజుల తర్వాత అదే నియోజకవర్గంలో జరిగిన ఓ సభలో సురేఖ కుమార్తె ముఖ్యమంత్రి, ఆయన కుటుంబ సభ్యులు, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రిపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. ఈ వ్యాఖ్యలపై మంత్రిగా ఉన్న సురేఖ స్పందించకపోవడం, వాటిని ఖండించకపోవడం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహానికి కారణమైనట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ వ్యవహారంపై పీసీసీ అధ్యక్షుడు, పీసీసీ క్రమశిక్షణ కమిటీ కూడా కఠిన చర్యలు అవసరమని అభిప్రాయపడినట్లు తెలిసింది. గతంలో తాను సర్దిచెప్పగలిగానని, ఈసారి మాత్రం ఏమీ చేయలేనని పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించడం కూడా చర్చనీయాంశమైంది. మరోవైపు కాంగ్రెస్ అధిష్ఠానంలో కీలక నేత అయిన ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (ఆర్గనైజేషన్) కేసీ వేణుగోపాల్ విదేశాల్లో ఉండటం, దాదాపు పది రోజులపాటు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంతో సురేఖపై వేటు ఉండకపోవచ్చనే ప్రచారం జరిగింది. రాఖీ పండగ రోజున సురేఖ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలవడం, ఒకరిద్దరు మంత్రులు కూడా చర్యలు తీసుకోవద్దనే అభిప్రాయం వ్యక్తం చేసినట్లు ప్రచారం జరగడంతో ఈ అంశంపై పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉన్నాయనే చర్చ సాగింది. అయితే కేసీ వేణుగోపాల్ సెప్టెంబరు 1న విదేశాల నుంచి తిరిగి వచ్చిన తర్వాత పరిణామాలు వేగం పుంజుకున్నాయి. అదే రోజు సీఎం రేవంత్‌రెడ్డి దిల్లీ వెళ్లి కేసీ వేణుగోపాల్‌ను కలిశారు. సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం, చర్యలు తీసుకోకపోతే పార్టీకి, ప్రభుత్వానికి ఎదురయ్యే పరిణామాలపై ఆయనతో చర్చించినట్లు తెలిసింది. అనంతరం కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గేతోనూ సీఎం సమావేశమై ఈ అంశంపై చర్చించారు. పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతోనూ కేసీ వేణుగోపాల్, ఖర్గేలు మాట్లాడినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. మరోవైపు సురేఖ కూడా దిల్లీ వెళ్లి ఖర్గేను మాత్రమే కలిశారు. బుధవారం మధ్యాహ్నమే సురేఖ, చిన్నారెడ్డిలపై చర్యలు తీసుకుంటూ నిర్ణయం వెలువడుతుందనే ప్రచారం సాగింది. అధిష్ఠానం ముఖ్యమంత్రి అభిప్రాయంతో ఏకీభవించిందని, పీసీసీ అధ్యక్షుడు, రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జ్ కూడా ఇదే అభిప్రాయాన్ని బలపరిచారని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. అయితే బుధవారం రాత్రి వరకు అధికారికంగా ఎలాంటి నిర్ణయం వెలువడకపోవడంతో అధిష్ఠానం ఇంకా తర్జనభర్జన పడుతోందనే అభిప్రాయం వ్యక్తమయ్యాయి. చివరకు కేసీ వేణుగోపాల్ గురువారం మధ్యాహ్నం సోనియాగాంధీని కూడా కలిసి చర్చించిన అనంతరం తుది నిర్ణయం తీసుకున్నట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. అనంతరం ముఖ్యమంత్రి సిఫార్సుకు అనుగుణంగా గవర్నర్ సురేఖను మంత్రివర్గం నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దీంతో తెలంగాణ కాంగ్రెస్‌లో గత కొద్దిరోజులుగా కొనసాగుతున్న ఈ వ్యవహారం కీలక మలుపు తిరిగింది.

# బెదిరింపులకు భయపడను

ర్యాలీ నిర్వహించారని, పాకిస్థాన్ కుట్రలను విదేశాల్లోనూ ఎండగట్టారని ఒవైసీ సోదరులను సీఎం అభినందించారు. హైదరాబాద్ అంటేనే పాతబస్తీ అని, ఇదే అసలైన నగరమని రేవంత్‌రెడ్డి అన్నారు. చుడీబజార్, పత్తర్‌గట్టీ, మొజాంజాహీ మార్కెట్, కబూతర్‌ఖానా, ఏక్‌మినార్, చార్మినార్ ప్రాంతాల్లోని మార్కెట్లకు ప్రపంచంలోనే ప్రత్యేక ఉందని పేర్కొన్నారు. 400 ఏళ్ల కిందట నిజాం నవాబులు ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. తాను మలక్‌పేట అల్లుడినని, మూసారాంబాగ్, శాలివాహననగర్‌కు చెందిన అమ్మాయిని వివాహం చేసుకున్నానని తెలిపారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఎంపీ అసదుద్దీన్, ఎమ్మెల్యే అక్బరుద్దీన్ తనను కలసి పాతబస్తీ అభివృద్ధికి సంబంధించిన పనుల జాబితాను అందజేశారని సీఎం చెప్పారు. బలాల కాలేజీ అభివృద్ధికి రూ.20 కోట్లు కావాలని ఎమ్మెల్యే కోరగా, తాను రూ.25 కోట్లు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. తాను సీఎం అయిన తర్వాత పాతబస్తీకి మెట్రో రైలు కావాలని అసదుద్దీన్ కోరారని, వెంటనే ఆమోదం తెలిపానని వివరించారు. ఎంజీబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు మెట్రో పనులు కొనసాగుతున్నాయని రేవంత్‌రెడ్డి తెలిపారు. త్వరలోనే పాతబస్తీ మీదుగా నాగోలును, విమానాశ్రయాన్ని అనుసంధానించే మెట్రో కారిడార్ పనులను కూడా ప్రారంభిస్తామని చెప్పారు. దుర్గంచెరువు తీగల వంతెనకు దీటుగా మీరాలం చెరువుపై 3 కిలోమీటర్ల పొడవైన కేబుల్ బ్రిడ్జిని నిర్మిస్తున్నామని వెల్లడించారు. యాఖుత్‌పుర, చార్మినార్ నియోజకవర్గాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూములు కేటాయిస్తామని సీఎం హామీ ఇచ్చారు. మైనారిటీ ప్రజలు అధికంగా నివసించే మూసీ పరివాహక ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తామని తెలిపారు. తమ ప్రభుత్వానికి హిందూ, ముస్లిం అనే తేడా లేదని, అందరూ కలిసినప్పుడే దేశం బలంగా ఉంటుందని అన్నారు. మలక్‌పేట తన అత్తారిల్లని, ఇక్కడికి వచ్చి బిర్యానీ తినకుండా వెళ్తున్నానని, రాబోయే ఎన్నికల్లోపు ఇతర అభివృద్ధి పనులను పూర్తిచేసి వాటి ప్రారంభోత్సవానికి వచ్చినప్పుడు బిర్యానీ తిని వెళ్తానంటూ సీఎం తన ప్రసంగాన్ని ముగించారు. ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ.. తమ మద్దతు సీఎం రేవంత్‌రెడ్డికే తప్ప కాంగ్రెస్ పార్టీకి కాదని స్పష్టం చేశారు. చంచల్‌గూడ వంతెన నిర్మాణానికి గత పాలకులు శిలాఫలకం వేశారే తప్ప నిధులు మంజూరు చేయలేదని తెలిపారు. రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత తాము కలిసి వంతెన నిర్మించాలని కోరగా రూ.600 కోట్లు మంజూరు చేసి ప్రాజెక్టును పూర్తి చేశారని వివరించారు. రేవంత్‌రెడ్డి ఫలక్‌నుమా వచ్చిన సమయంలో వచ్చే ఎన్నికలకు ముందే ఫలక్‌నుమా వరకు మెట్రోలో ప్రయాణిస్తామని హామీ ఇచ్చారని ఒవైసీ గుర్తుచేశారు. ప్రస్తుతం మెట్రో పనులకు సంబంధించి 95 శాతం భూసేకరణ పూర్తయిందని తెలిపారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎంపీలు వేం నరేందర్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, రఘువీర్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారు వీహెచ్, ఎమ్మెల్యేలు బలాల, దానం నాగేందర్, నవీన్‌యాదవ్, జాఫర్ హుస్సేన్, ఎమ్మెల్సీ మీర్జా రియాజ్, జీహెచ్‌ఎంసీ కమిషనర్ కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

# 36వేల కి.మీ ఎత్తు నుంచి భారత్‌పై నిఘా.. ఈఓఎస్-05తో ఇస్రో భారీ ప్రయోగం!



దాదాపు ఎనిమిది నెలల విరామం తర్వాత ఇస్రో మరో కీలక ప్రయోగానికి సిద్ధమైంది. వరుసగా రెండు పీఎస్ఎల్వీ ప్రయోగాలు విఫలమైన నేపథ్యంలో.. ఈసారి జీఎస్ఎల్వీ-ఎఫ్17తో ప్రతిష్ఠాత్మక మిషన్‌ను చేపట్టనుంది. సెప్టెంబర్ 4న తెల్లవారుజామున 2.55 గంటలకు శ్రీహరికోటలోని సతీశ్ ధవన్ స్పేస్ సెంటర్ నుంచి రాకెట్ నింగిలోకి దూసుకెళ్లనుంది. ఈ మిషన్‌లో ఈఓఎస్-05 ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్‌ను అంతరిక్షంలోకి పంపనున్నారు. భూమికి దాదాపు 36 వేల కిలోమీటర్ల ఎత్తులో పనిచేసే ఈ ఉపగ్రహం.. భారత్‌కు ఆకాశం నుంచి నిరంతర నిఘా సామర్థ్యాన్ని అందించనుంది. దేశ భూభాగం, తీరప్రాంతాలు, వాతావరణ వ్యవస్థలు, విపత్తులకు గురయ్యే ప్రాంతాలను ఎప్పటికప్పుడు గమనించేందుకు ఇది ఉపయోగపడుతుంది. హై రిజల్యూషన్ కెమెరా ద్వారా సరిహద్దుల భద్రతకు కూడా తోడ్పడనుంది. ఈఓఎస్-05ను సబ్-జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టేలా మిషన్‌ను రూపొందించారు. జియోసింక్రోనస్ ఆర్బిట్ నుంచి పనిచేసే తొలి భారతీయ ఇమేజింగ్ శాటిలైట్‌గా ఈఓఎస్-05 ప్రత్యేకత సాధించనుంది. దీని ప్రయోగ బరువు సుమారు 2,367 కిలోలు. ఈ ప్రయోగానికి ఉపయోగిస్తున్న జీఎస్ఎల్వీ-ఎఫ్17 రాకెట్ 51.7 మీటర్ల ఎత్తు ఉంటుంది. లిఫ్టాఫ్ సమయంలో దాని బరువు 420.5 టన్నులు. మూడు దశలతో రూపొందిన ఈ రాకెట్‌లో 4 మీటర్ల వ్యాసం ఉన్న పేలోడ్ ఫెయిరింగ్ ఉంటుంది. మొదటి దశలో భారీ ఎస్-139 ఘన ఇంధన మోటార్‌తో పాటు నాలుగు ద్రవ ఇంధన బూస్టర్లు పనిచేస్తాయి. ఎస్-139లోనే 138 టన్నుల ఘన ఇంధనం ఉంటుంది. నాలుగు బూస్టర్లలో కలిపి సుమారు 170 టన్నుల యూహెచ్25, నైట్రోజన్ టెట్రాక్సైడ్ ఇంధనాలు ఉంటాయి. రెండో దశలో ద్రవ ఇంధన సాంకేతికతను ఉపయోగించారు. ఇందులో 42 టన్నుల యూహెచ్25, డైనైట్రోజన్ టెట్రాక్సైడ్ ఉంటాయి. చివరి దశలో భారతీయ క్రయోజెనిక్ అప్పర్ స్టేజ్ సీయూఎస్-5 కీలక పాత్ర పోషిస్తుంది. ఇందులో లిక్విడ్ హైడ్రోజన్, లిక్విడ్ ఆక్సిజన్‌తో కలిపి 15 టన్నుల క్రయోజెనిక్ ఇంధనం ఉంటుంది. చివరి దశ తన పని పూర్తిచేసిన తర్వాత ఈఓఎస్-05 ఉపగ్రహాన్ని నిర్దేశిత కక్ష్యలోకి ప్రవేశపెడుతుంది. ఆ తర్వాత భూమిపైకి నిరంతర నిఘా అందించే ఈ 'హాక్ ఐ' తన అసలు పని మొదలుపెట్టనుంది.

## 'ఏ దేశమూ ఇరాన్‌కు సహాయం చేయకూడదు'

### ఇరాన్‌తో వాణిజ్యంపై భారత్‌కు అమెరికా పరోక్ష హెచ్చరిక!

ఇరాన్‌తో భారత్ వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోబోతోందన్న వార్తలను అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో కొట్టిపారేశారు. అయితే, అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సహకరించినా, ఆ దేశం కూడా తీవ్రమైన ఆంక్షలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన గట్టిగా హెచ్చరించారు. కిర్గిజ్‌స్థాన్‌లోని బిష్కెక్‌లో జరిగిన 26వ షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సులో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఇరాన్ అధ్యక్షుడు మసౌద్ పెజెష్కియాన్‌తో భేటీ అయిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "భారత్, ఇరాన్ మధ్య వాణిజ్య ఒప్పందం ఉందని నేను అనుకోవడం లేదు" అని రూబియో ఓ ఇంటర్వ్యూలో స్పష్టం చేశారు. అయితే, ప్రపంచంలోని చాలా దేశాలు తమ విదేశాంగ విధానాలను స్వతంత్రంగా రూపొందించుకుంటాయని, ఇరాన్‌తో సంప్రదింపులు జరుపుతాయని ఆయన అంగీకరించారు. అవసరమైనప్పుడు ఇరాన్ ప్రభుత్వ ప్రతినిధులతో తాము కూడా చర్చలు జరిపినట్లు ఆయన గుర్తుచేశారు. అదే సమయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో చేసిన హెచ్చరికను రూబియో పునరుద్ఘాటించారు. "అమెరికా ఆంక్షలను తప్పించుకోవడానికి ఇరాన్‌కు ఏ దేశం సాయం చేయకూడదు. ఉగ్రవాదాన్ని ప్రోత్సహించడానికి, అణ్వాయుధాన్ని నిర్మించడానికి అవసరమైన ఆదాయాన్ని సమకూర్చుకునే మార్గాలను ఇరాన్‌కు కల్పించకూడదు. ఒకవేళ ఏవైనా దేశాలు అలా చేస్తే, వాటిపై కూడా మేము ఆంక్షలు విధించాల్సి వస్తుంది" అని రూబియో హెచ్చరించారు. ట్రంప్ యంత్రాంగం ప్రధాన లక్ష్యం ఇరాన్‌ను అణ్వాయుధ శక్తిగా మారకుండా నిరోధించడమేనని రూబియో స్పష్టం చేశారు. "అధ్యక్షుడిగా ట్రంప్ ఉన్నంత కాలం ఇరాన్‌ను అణ్వస్త్ర దేశంగా మారేందుకు ఎప్పటికీ అనుమతించం" అని ఆయన అన్నారు. ఇరాన్‌పై ఒత్తిడి తెచ్చేందుకు ప్రాథమికంగా ఆర్థిక ఆంక్షలను ఉపయోగిస్తామని, అయితే అవసరమైతే సైనిక చర్యకు కూడా వెనుకాడబోమని ఆయన తెలిపారు. ఇరాన్ తన ఆర్థిక వనరులను దేశ ప్రజల సంక్షేమానికి కాకుండా ఉగ్రవాదం, అణ్వాయుధాల కోసమే ఖర్చు చేస్తోందని రూబియో ఆరోపించారు. గత ఆరు నెలలుగా పశ్చిమాసియాలో అమెరికా, ఇరాన్ మధ్య తీవ్ర ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఇటీవలి వారాల్లో ఇరు దేశాల మధ్య ఘర్షణలు పెరిగాయి. ఇరాన్ లక్ష్యాలపై రాత్రికి రాత్రే భారీ దాడులు చేశామని, అవసరమైతే మరోసారి దాడికి సిద్ధంగా ఉన్నామని అధ్యక్షుడు ట్రంప్ ప్రకటించారు. మరోవైపు, ఇరాన్ కూడా వెనక్కి తగ్గడం లేదు. తమ దేశం యుద్ధరంగంలో, దౌత్యపరంగా, ఆర్థిక దిగ్బంధనాన్ని ఎదుర్కోవడంలో కొత్త వ్యూహాన్ని అవలంబించిందని ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ సెక్రటరీ మొహసెన్ రెజాయీ హెచ్చరించారు. తమ కొత్త వ్యూహం అమెరికా పునాదులను కదిలిస్తుందని ఆయన వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం

# 'గంజా క్వీన్' నీతూ బాయిపై ఈడీ రైడ్స్

### హైదరాబాద్ గంజాయి కింగ్‌పిన్ నీతూ బాయిపై ఈడీ దాడులు

గంజాయి అక్రమ రవాణా కేసుల్లో కీలక నిందితురాలిగా ఉన్న నీతూ బాయి అలియాస్ 'గంజా క్వీన్'కు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) గట్టి షాక్ ఇచ్చింది. మనీలాండరింగ్ ఆరోపణల నేపథ్యంలో గురువారం హైదరాబాద్‌లోని 9 ప్రాంతాల్లో ఏకకాలంలో సోదాలు నిర్వహించింది. నీతూ బాయి, ఆమె అనుచరులతో సంబంధం ఉన్న నివాసాలు, కార్యాలయాల్లో ఈడీ అధికారులు తనిఖీలు చేపట్టారు. ఈ దాడులు నగరంలో కలకలం రేపాయి. తెలంగాణ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక విభాగం 'ఈగల్' (ఎలైట్ యాక్షన్ గ్రూప్ ఫర్ డ్రగ్ లా ఎన్‌ఫోర్స్‌మెంట్), ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ గతంలో నీతూ బాయి, ఆమె ముఠాపై నమోదు చేసిన కేసుల ఆధారంగా ఈడీ ఈ మనీలాండరింగ్ విచారణను ప్రారంభించింది. దేశవ్యాప్తంగా 'నశా ముక్త్ భారత్' ప్రచారంలో భాగంగా మాదకద్రవ్యాల కేసులపై కేంద్ర ఏజెన్సీలు తీసుకుంటున్న చర్యల్లో భాగంగానే ఈ సోదాలు జరుగుతున్నట్టు తెలుస్తోంది. సైబరాబాద్ నార్కోటిక్స్ పోలీస్ స్టేషన్, ఎక్సైజ్ శాఖ నమోదు చేసిన పలు కేసుల్లో నీతూ బాయి పరారీలో ఉన్నట్టు రికార్డులు చెబుతున్నాయి. ఈగల్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ల ఆధారంగా ప్రివెన్షన్ ఆఫ్ మనీలాండరింగ్ యాక్ట్ (పీఎంఎల్ఏ) కింద కేసు నమోదు చేసిన ఈడీ, గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన అక్రమ ఆదాయం, దానిని ఎలా మళ్లించారనే దానిపై దృష్టి సారించింది. ముఖ్యంగా ఈ అక్రమ వ్యాపారం ద్వారా సంపాదించిన కోట్లాది రూపాయలను హవాలా మార్గాల్లో తరలించినట్లు ఈడీ బలంగా అనుమానిస్తోంది. గంజాయి అమ్మకాల ద్వారా వచ్చిన డబ్బుతో అక్రమంగా ఆస్తులు కూడబెట్టారనే ఆరోపణలపై ఈడీ లోతుగా దర్యాప్తు చేస్తోంది. ఈ సోదాల్లో భాగంగా అక్రమ ఆర్జనలకు సంబంధించిన ఆధారాలు, ఆస్తి పత్రాలు, బ్యాంకు ఖాతాలు, ఇతర రికార్డులను అధికారులు క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. గంజాయి వ్యాపారం ద్వారా వచ్చిన డబ్బును కుటుంబ సభ్యులు లేదా బినామీల పేర్లతో స్థిరాస్తులు, ఇతర ఆస్తులలో పెట్టుబడిగా పెట్టారా అనే కోణంలో కూడా విచారణ జరుపుతున్నారు. నానక్‌రామ్‌గూడలోని లోథా బస్తీలో ఉన్న నీతూ బాయి నివాసం, గంజాయి రిటైల్ అమ్మకాలకు అడ్డాగా మారిందని అధికారులు అనుమానిస్తున్నారు. ఆమె భర్త మున్నా సింగ్, కుమారులు గౌతమ్, గోవింద్, కుమార్తె ఈ వ్యాపారంలో పాలుపంచుకుంటూ గంజాయి ప్యాకింగ్, అమ్మకాలలో సహాయం చేస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. గతంలో ఈగల్ అధికారులు జరిపిన దాడుల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లతో సహా పలువురు బానిసలు ఆమె ఇంటి నుంచి గంజాయి కొనుగోలు చేస్తున్నట్లు గుర్తించారు. అయితే, పలు కేసుల్లో నిందితురాలిగా ఉన్నప్పటికీ నీతూ బాయి అధికారులకు చిక్కకుండా తప్పించుకు తిరుగుతోంది. 2024లో సైబరాబాద్ స్పెషల్ ఆపరేషన్ టీమ్ (ఎస్ఓటీ) ఆమె నివాసంపై దాడి చేసి 20 కిలోల గంజాయి, రూ. 20 లక్షల నగదును స్వాధీనం చేసుకుంది. సోదాలు ముగిసిన తర్వాత ఈ దర్యాప్తునకు సంబంధించిన పూర్తి వివరాలను ఈడీ వెల్లడించే అవకాశం ఉంది.

## 'ఉన్నది ఉన్నట్టు మాట్లాడితే ఎవరూ తట్టుకోలేరు': కొండా మురళి

కొండా సురేఖను మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేసిన నేపథ్యంలో ఆమె భర్త, సీనియర్ నేత కొండా మురళి చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. సురేఖ బర్తరఫ్ తర్వాత తొలిసారి స్పందించిన ఆయన.. ఎక్స్ వేదికగా భావోద్వేగంతో పాటు ఘాటు వ్యాఖ్యలు చేశారు. "ఉన్నది ఉన్నట్లు మాట్లాడితే ఇక్కడ ఎవరూ తట్టుకోరు" అంటూ కొండా మురళి చేసిన వ్యాఖ్యలు రాజకీయ వర్గాల్లో ఆసక్తి రేపుతున్నాయి. తాము ప్రస్తుతం ఎదుర్కొంటున్న పరిస్థితులు రేపు ఇంకెవరికి ఎదురవుతాయో అంటూ ఆయన పరోక్షంగా హెచ్చరికలు జారీ చేశారు. పదవులు ఉన్నా లేకపోయినా తమ గౌరవం తమకు ఎప్పుడూ ఉంటుందని కొండా మురళి పేర్కొన్నారు. ప్రతి విషయానికీ వెంటనే స్పందించకపోవచ్చని.. కానీ జరుగుతున్న ప్రతి పరిణామాన్ని లోతుగా గమనిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. తమపై అన్ని దరిద్రాలు ఒక్కటై కుట్రపూరితంగా రాజకీయ దాడులు చేశాయని మురళి ఆరోపించారు. అయితే తాము దేనికీ భయపడబోమని చెప్పారు. ఎంతటి కష్టాలు ఎదురైనా దృఢంగా నిలబడి తట్టుకుంటామని.. మొండిగా ఎదురువెళ్తామని పేర్కొన్నారు. కొండా సురేఖ మంత్రి పదవి కోల్పోయిన వెంటనే కొండా మురళి చేసిన ఈ వ్యాఖ్యలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో కొత్త చర్చకు తెరలేపాయి. తమపై జరిగిన రాజకీయ కుట్రలను తిప్పికొడతామన్న సంకేతాలను ఆయన తన పోస్టు ద్వారా ఇచ్చారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో కొండా దంపతుల తదుపరి రాజకీయ అడుగులపై ఆసక్తి నెలకొంది. మరోవైపు మధ్యాహ్నం సురేఖ బర్తరఫ్ వార్తలు బయటకు రాగానే మురళి తన నివాసం వద్ద తనదైన శైలిలో రియాక్షన్ ఇచ్చారు. బయటకు వచ్చి విలేకరులను చూస్తూ మీసం మేలేశారు. తాము ఏమాత్రం చింతించడం లేదన్నట్లుగా సంకేతాలు ఇచ్చారు. ఎవరూ అధైర్యపడొద్దని.. భరోసాతో ఉండాలని పరోక్షంగా కార్యకర్తలకు సూచించారు.

## పది రోజుల్లో సాగర్ నీటి విడుదలపై స్పష్టత ఇవ్వాలి

షెడ్యూల్ ప్రకటించి, రైతులకు సమృద్ధిగా తడులు అందించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కోదాడ నుంచి హాలియా వరకు బాధిత రైతులతో కలిసి పాదయాత్ర చేపడతామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పీ క్యాంపు కార్యాలయంలో గురువారం నిర్వహించిన రైతు మహాధర్నాలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. ధర్నా నిర్వహిస్తామని ప్రకటించగానే ప్రభుత్వంలో కదలిక వచ్చిందని కేటీఆర్ వ్యాఖ్యానించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఉమ్మడి నల్గొండ జిల్లా పరిధిలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు ద్వారా మూడు పంటలకు సాగునీరు అందించామని తెలిపారు. రైతుబంధు సొమ్మును సకాలంలో రైతుల ఖాతాల్లో జమ చేశామని, నిరంతర విద్యుత్ సరఫరా అందించామని పేర్కొన్నారు. అయితే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో సాగర్ పరివాహక ప్రాంతాల్లో సాగునీటి కొరత ఏర్పడిందని ఆరోపించారు. మూడు విడతలుగా రైతుబంధు సొమ్మును ప్రభుత్వం ఎగ్గొట్టిందని, కౌలు రైతులకు రైతుభరోసా అందడం లేదని కేటీఆర్ విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో మిర్యాలగూడ 'రైస్‌బౌల్ ఆఫ్ తెలంగాణ'గా గుర్తింపు పొందిందని, ప్రస్తుతం సాగు చేసేందుకు అవసరమైన నీటి నిల్వలు లేక రైతులు మహాధర్నా చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఎన్నికల సమయంలో రాహుల్‌గాంధీ రైతు డిక్లరేషన్ పేరుతో 33 హామీలు ఇచ్చారని, కానీ వాటిని అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. రైతుబంధు, రుణమాఫీ విషయంలోనూ రైతులకు అన్యాయం జరిగిందని అన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 537 అడుగుల నీటి మట్టం ఉన్నప్పటికీ నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా రైతుల సమస్యలపై బాధ్యతాయుతంగా స్పందించడం లేదని ఆరోపించారు. సాగర్‌లో 180 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నప్పటికీ ఎడమకాల్వ ఆయకట్టుకు ఎందుకు నీరు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు.

## కొండా సురేఖ బర్తరఫ్..
## రేవంత్ రెడ్డిని శపించిన ఆమె కుమార్తె సుస్మిత

తెలంగాణ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బర్తరఫ్ చేయడం రాజకీయంగా పెను సంచలనం సృష్టించింది. ఈ నిర్ణయంపై సురేఖ కుమార్తె సుస్మిత తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. తన తల్లికి అన్యాయం జరిగిందని ఆవేదన వ్యక్తం చేస్తూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆమె శాపనార్థాలు పెట్టారు. తల్లి బర్తరఫ్‌పై స్పందించిన సుస్మిత "నా తల్లికి అన్యాయం జరిగింది. ఆమె పట్ల అనుసరించిన తీరు నన్ను తీవ్రంగా బాధించింది. మా అమ్మ గొంతును ఎవరూ నొక్కలేరు. నేను రేవంత్ రెడ్డిని శపిస్తున్నాను" అని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, "నా తల్లి ప్రాతినిధ్యం వహిస్తున్న పరకాల నియోజకవర్గం నుంచి పోటీ చేయాలని రేవంత్ రెడ్డికి సవాల్ విసురుతున్నాను" అని పేర్కొన్నారు. గతంలో తాను చేసిన వ్యాఖ్యలు కేవలం వ్యక్తిగత హోదాలో ఒక వ్యక్తిని ఉద్దేశించినవే తప్ప, ఏ పార్టీకి వ్యతిరేకం కాదని ఆమె స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోదరుడికి సంబంధించిన ఓ షెల్ కంపెనీకి తక్కువ ధరకు విలువైన భూములను కేటాయించారని సుస్మిత చేసిన ఆరోపణలతో ఈ వివాదం మొదలైంది. దీనికి తోడు, టికెట్ల కేటాయింపులో నగదు ప్రమేయం ఉందంటూ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు జి. చిన్నారెడ్డి చేసిన వ్యాఖ్యలు ఈ దుమారాన్ని మరింత పెంచాయి. ఈ పరిణామాల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్ఠానం జోక్యం చేసుకుని, కొండా సురేఖ తొలగింపునకు ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కొండా సురేఖను మంత్రివర్గం నుంచి తొలగించడంతో పాటు, చిన్నారెడ్డి నియామకాన్ని కూడా రద్దు చేశారు. ఈ మేరకు గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాకు సిఫార్సులు పంపారు. తన కుమార్తె చేసిన వ్యాఖ్యలతో తనకు ఎటువంటి సంబంధం లేదని కొండా సురేఖ గతంలోనే ప్రకటించినప్పటికీ, ఆమెపై వేటు తప్పలేదు.

## కొండా సురేఖ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానం నిర్ణయమే అంతిమం : రాజగోపాల్‌రెడ్డి

మునుగోడు: తెలంగాణ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారిన మంత్రి కొండా సురేఖ వ్యవహారంపై మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి స్పందించారు. ఈ విషయంలో పార్టీ అధిష్ఠానం తీసుకునే నిర్ణయమే అంతిమమని, దానికి అందరూ కట్టుబడి ఉండాలని స్పష్టం చేశారు. మునుగోడులో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న అనంతరం రాజగోపాల్ రెడ్డి మీడియాతో మాట్లాడారు. "కొండా సురేఖకు సంబంధించిన పూర్తి నివేదిక హైకమాండ్ వద్ద ఉంది. పార్టీ తీసుకునే నిర్ణయానికి ఆమె కట్టుబడి ఉండాలి" అని ఆయన వ్యాఖ్యానించారు. తెలంగాణలో మంత్రివర్గ విస్తరణ, పునర్వ్యవస్థీకరణ వంటి అంశాలను కాంగ్రెస్ అధిష్ఠానమే పర్యవేక్షిస్తుందని తెలిపారు. గత పదేళ్లుగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా పోరాడిన కాంగ్రెస్ కార్యకర్తలకు న్యాయం చేయడమే తన ప్రధాన కర్తవ్యమని రాజగోపాల్ రెడ్డి ఈ సందర్భంగా పునరుద్ఘాటించారు. తన పూర్తి దృష్టి కార్యకర్తల సంక్షేమంపైనే ఉందని పేర్కొన్నారు. మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తొలగించాలని కోరుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గవర్నర్‌కు లేఖ రాశారన్న వార్తల నేపథ్యంలో ఈ రాజకీయ పరిణామాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

## నల్సార్ విద్యార్థులకు భారీ ఊరట.. బీసీఐకి సుప్రీంకోర్టు మొట్టికాయలు

న్యాయ విద్యార్థులపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే చట్టపరమైన అధికారం భారత బార్ కౌన్సిల్ (బీసీఐ)కు లేదని సుప్రీంకోర్టు గురువారం స్పష్టం చేసింది. ఈ మేరకు నల్సార్ యూనివర్సిటీ విద్యార్థులకు భారీ ఊరటనిస్తూ కీలక తీర్పు వెలువరించింది. బీసీఐ అధికార పరిధి కేవలం న్యాయవాదులుగా నమోదైన వారికి మాత్రమే పరిమితమని, విద్యార్థి దశలో ఉన్నవారికి ఇది వర్తించదని ధర్మాసనం తేల్చి చెప్పింది. నల్సార్ యూనివర్సిటీ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్‌ను ఆహ్వానించడాన్ని వ్యతిరేకిస్తూ కొందరు విద్యార్థులు లేఖ రాశారు. ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించిన బీసీఐ ఛైర్మన్ మనన్ కుమార్ మిశ్రా, మూడు రోజుల్లోగా నివేదిక సమర్పించాలని నల్సార్ వైస్-ఛాన్సలర్‌ను ఆదేశించారు. అంతటితో ఆగకుండా, నల్సార్ 2026 బ్యాచ్‌కు చెందిన ఏ విద్యార్థినీ న్యాయవాదిగా నమోదు చేసుకోవద్దని దేశంలోని అన్ని రాష్ట్రాల బార్ కౌన్సిళ్లకు సర్క్యులర్ జారీ చేశారు. ఈ నిర్ణయంపై సర్వత్రా విమర్శలు రావడంతో మనన్ కుమార్ మిశ్రా ఆ ఉత్తర్వులను ఉపసంహరించుకున్నారు. అయినప్పటికీ, ఈ అంశాన్ని సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించి విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా బీసీఐ వైఖరిని తీవ్రంగా తప్పుబట్టిన ధర్మాసనం, విద్యార్థులపై చర్యలు తీసుకునే అధికారం బీసీఐకి లేదని స్పష్టం చేసింది. ఈ తీర్పుతో నల్సార్ విద్యార్థులకు పెద్ద ఉపశమనం లభించింది.

# 22ఏ భూసమస్యకు శాశ్వత పరిష్కారం ఎప్పుడు?



తెలంగాణలో ఇప్పుడు ఎక్కడ చూసినా భూముల చుట్టూనే చర్చ జరుగుతోంది. ఒకప్పుడు భూమి ఉంటే భరోసా ఉండేది. ఆస్తి ఉంటే భవిష్యత్తుకు అండగా ఉంటుందనే నమ్మకం ఉండేది. కానీ నేడు అదే భూమి నిషేధిత జాబితాలో ఉందన్న ఒక్క మాట యజమానులను ఆందోళనకు గురిచేస్తోంది. తమ పేరుతో పట్టా ఉంది.. పన్నులు చెల్లిస్తున్నారు.. ఏళ్ల తరబడి ఆ భూమిని అనుభవిస్తున్నారు.. అవసరమైతే అమ్ముకోవచ్చని, బ్యాంకులో తనఖా పెట్టి రుణం తీసుకోవచ్చని భావించిన సమయంలో రిజిస్ట్రేషన్ కార్యాలయంలో ఆస్తి నిషేధిత జాబితాలో ఉందన్న సమాధానం వస్తోంది. దీంతో ఒక్కసారిగా ఆస్తి విలువ ఉన్నప్పటికీ దాన్ని ఉపయోగించుకోలేని పరిస్థితి ఏర్పడుతోంది. తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల వ్యవహారం ఇటీవలి కాలంలో ఇంతటి తీవ్ర చర్చకు కారణం కావడానికి ఇదే ప్రధాన కారణం. రిజిస్ట్రేషన్ల చట్టంలోని 22ఏ నిబంధన ఉద్దేశం తప్పు కాదు. ప్రభుత్వ భూములు, అసైన్డ్ భూములు, వక్ఫ్, దేవాదాయ భూములు, ప్రభుత్వ సంస్థలకు చెందిన భూములు, న్యాయస్థానాల్లో వివాదంలో ఉన్న భూములు వంటి నిర్దిష్ట వర్గాల ఆస్తులను అక్రమంగా అమ్మకుండా, కొనకుండా కాపాడటం అవసరమే. ప్రభుత్వ ఆస్తులు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లకుండా చూడటం పాలకుల బాధ్యత. ప్రజా ఆస్తుల రక్షణలో ఇలాంటి నిబంధనలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే ఒక మంచి నిబంధన అమలులో పొరపాటు జరిగితే అదే నిబంధన సామాన్యుడికి శాపంగా మారే ప్రమాదం ఉంటుంది. ప్రస్తుతం తెలంగాణలో కనిపిస్తున్న సమస్యకు మూలం ఇదే. పాత భూ రికార్డులు, కొత్త రికార్డులు, సర్వే సంఖ్యలు, ఉపవిభాగాలు, భూ వినియోగ మార్పులు, క్రమబద్ధీకరణలు, లేఅవుట్ అనుమతులు వంటి అనేక అంశాలు పరస్పరం కలిసిపోవడంతో కొన్ని ప్రైవేటు భూములు కూడా నిషేధిత జాబితాలోకి వెళ్లినట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ముఖ్యంగా హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో ఈ సమస్యపై పెద్ద సంఖ్యలో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొన్ని సందర్భాల్లో మూల సర్వే సంఖ్య ఆధారంగా మొత్తం భూమిని నిషేధితంగా చూపించడం వల్ల అందులోని చట్టబద్ధమైన ప్రైవేటు స్థలాల యజమానులు కూడా ఇబ్బందులు పడుతున్నారని వార్తలు వెలువడ్డాయి. ఇక్కడే ప్రభుత్వానికి అసలు పరీక్ష మొదలవుతుంది. ప్రభుత్వ భూమిని కాపాడటం ఎంత ముఖ్యమో, నిజమైన పట్టాదారుడి ఆస్తి హక్కును కాపాడటం కూడా అంతే ముఖ్యం. ఒక వైపు అక్రమ భూ ఆక్రమణలు, అక్రమ రిజిస్ట్రేషన్లు జరగకుండా కఠినంగా వ్యవహరించాలి. మరోవైపు ఎలాంటి తప్పు చేయని వ్యక్తి తన ఆస్తిని అమ్ముకోలేని, తనఖా పెట్టుకోలేని, పిల్లలకు పంచలేని పరిస్థితి రాకుండా చూడాలి. ఈ రెండింటి మధ్య సమతుల్యత సాధించడమే పరిపాలనకు అసలు సవాలు.

ఒక కుటుంబం జీవితకాల పొదుపుతో స్థలం కొనుగోలు చేసిందనుకుందాం. ఆ స్థలానికి సంబంధించి పత్రాలు ఉన్నాయి. క్రమంగా పన్నులు చెల్లిస్తోంది. ఇంటిని నిర్మించుకోవాలని లేదా పిల్లల చదువుల కోసం రుణం తీసుకోవాలని భావించింది. కానీ రిజిస్ట్రేషన్ సమయంలో ఆ స్థలం నిషేధిత జాబితాలో ఉందని తెలిసింది. అప్పుడు ఆ కుటుంబం ఎదుర్కొనే పరిస్థితిని కేవలం ఒక ప్రభుత్వ ప్రక్రియలోని సాంకేతిక సమస్యగా చూడలేం. అది వారి జీవితానికి సంబంధించిన సమస్య. ఆస్తి విలువ కోట్లలో ఉండొచ్చు. కానీ దాన్ని చట్టబద్ధంగా ఉపయోగించుకోలేని పరిస్థితిలో ఆ విలువ కాగితంపైనే మిగిలిపోతుంది.

ఇలాంటి సమస్యలు పెరిగితే ప్రజల్లో ప్రభుత్వ రికార్డులపై నమ్మకం దెబ్బతింటుంది. ఒక రోజు చట్టబద్ధంగా ఉన్న భూమి మరుసటి రోజు నిషేధిత జాబితాలో కనిపిస్తే సామాన్యుడు ఎవరిని నమ్మాలి? రిజిస్ట్రేషన్ సమయంలో పత్రాలను పరిశీలించిన అధికారులను నమ్మాలా? రెవెన్యూ రికార్డులను నమ్మాలా? ధరణి లేదా భూభారతి వంటి భూ సమాచార వ్యవస్థల్లో ఉన్న వివరాలను నమ్మాలా? పాత పహాణీలను నమ్మాలా? కోర్టు తీర్పులను నమ్మాలా? ఈ ప్రశ్నలకు స్పష్టమైన సమాధానం ఉండాలి.

ప్రభుత్వం ఇప్పటికే నిజమైన సమస్యలను గుర్తించి పరిష్కరిస్తామని చెబుతోంది. రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కూడా ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హత ఉన్న కేసులను వేగంగా పరిష్కరిస్తామని ప్రకటించారు. ఫిర్యాదుల కోసం ఏర్పాటు చేసిన సహాయ కేంద్రానికి వచ్చిన దరఖాస్తుల్లో అనేక నిజమైన సమస్యలను గుర్తించినట్లు కూడా ప్రభుత్వం తెలిపింది. కొన్ని కేసులను తక్కువ సమయంలోనే పరిష్కరిస్తున్నామని అధికారులు చెబుతున్నారు.

అయితే ఇక్కడ ఒక ప్రశ్న తప్పనిసరిగా ఎదురవుతుంది. తప్పుగా నిషేధిత జాబితాలో చేర్చిన భూమిని తొలగించడం మాత్రమే పరిష్కారమా? కాదు. పొరపాటు ఎలా జరిగింది అనే ప్రశ్నకు కూడా సమాధానం కావాలి. ఒక సర్వే సంఖ్యలో ప్రైవేటు భూమి ఉన్న విషయం రికార్డుల్లో స్పష్టంగా ఉన్నప్పటికీ దాన్ని ప్రభుత్వ భూమిగా ఎలా చూపించారు? పాత రికార్డులను పరిశీలించకుండా కొత్త జాబితా ఎలా రూపొందింది? ఒకే సర్వే సంఖ్యలో ప్రభుత్వ భూమి, ప్రైవేటు భూమి రెండూ ఉంటే వాటిని వేరు చేయకుండా మొత్తం భూమిని నిషేధితంగా చూపించడానికి కారణం ఏమిటి? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా కేవలం దరఖాస్తులు స్వీకరించి ఒక్కొక్కటిగా తొలగించడం వల్ల భవిష్యత్తులో సమస్య మళ్లీ తలెత్తే అవకాశం ఉంటుంది.

భూమి రికార్డుల విషయంలో చిన్న పొరపాటు కూడా పెద్ద సమస్యగా మారుతుంది. ఒక అంకె తప్పుగా నమోదు కావచ్చు. ఒక సర్వే సంఖ్యకు చెందిన ఉపవిభాగం మరో వర్గంలో చేరవచ్చు. పాత రికార్డులో ఉన్న ప్రభుత్వ భూమి, తరువాతి కాలంలో చట్టబద్ధంగా మారిన ప్రైవేటు భూమి మధ్య తేడా గుర్తించకపోవచ్చు. ఒక భూమికి సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులు, క్రమబద్ధీకరణ పత్రాలు, లేఅవుట్ అనుమతులు వంటి ఆధారాలు ఉన్నా అవి సంబంధిత రికార్డుల్లో చేరకపోవచ్చు. ఫలితంగా కంప్యూటర్‌లో కనిపించే ఒక వివరమే తుది నిజంగా మారిపోతుంది. సాంకేతికత తప్పు కాదు. కానీ తప్పు సమాచారం సాంకేతిక వ్యవస్థలోకి వెళ్లినప్పుడు దాని ప్రభావం మాత్రం భారీగా ఉంటుంది.

అందుకే 22ఏ సమస్యకు పరిష్కారం కేవలం కొత్త జాబితా తయారు చేయడం కాదు. ప్రతి సర్వే సంఖ్యను సమగ్రంగా పరిశీలించే విధానం అవసరం. పాత రికార్డులు, ప్రస్తుత రికార్డులు, పట్టా పత్రాలు, అమ్మకపు పత్రాలు, ప్రభుత్వ ఉత్తర్వులు, భూమి వినియోగ మార్పులు, క్రమబద్ధీకరణ పత్రాలు, న్యాయస్థానాల తీర్పులు వంటి అన్ని ఆధారాలను ఒకే చోట పరిశీలించే వ్యవస్థ ఉండాలి. ఒక భూమిని నిషేధిత జాబితాలో చేర్చే ముందు దాని వెనుక ఉన్న కారణం స్పష్టంగా నమోదు చేయాలి. అదే విధంగా ఒక భూమిని జాబితా నుంచి తొలగించినప్పుడు ఏ ఆధారాల ఆధారంగా తొలగించారో కూడా రికార్డులో ఉండాలి.

ప్రజలకు కూడా తమ ఆస్తి ఎందుకు నిషేధిత జాబితాలో ఉందో తెలుసుకునే హక్కు ఉండాలి. కేవలం 'నిషేధిత భూమి' అని చూపించడం సరిపోదు. ఏ కారణంతో నిషేధించారు? ఏ శాఖకు చెందిన భూమిగా గుర్తించారు? ఏ సర్వే రికార్డు ఆధారంగా ఆ నిర్ణయం తీసుకున్నారు? ఏ ఉత్తర్వు ప్రకారం ఆ జాబితాలో చేర్చారు? అనే వివరాలు స్పష్టంగా కనిపించాలి. ఈ సమాచారం అందుబాటులో ఉంటే ప్రజలు తమ దగ్గరున్న ఆధారాలతో సరైన అధికారిని సంప్రదించగలరు. ప్రస్తుతం ప్రజలను ఎక్కువగా ఇబ్బంది పెడుతున్న అంశాల్లో ఒకటి సమాచారం స్పష్టంగా లేకపోవడమే.

అదే సమయంలో రాజకీయ ఆరోపణలకూ ఒక పరిమితి ఉండాలి. ఈ వ్యవహారంపై ప్రతిపక్షాలు ప్రభుత్వంపై తీవ్ర ఆరోపణలు చేస్తున్నాయి. విచారణ జరపాలని, శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్లు చేస్తున్నాయి. ప్రభుత్వం మాత్రం ప్రభుత్వ భూములను రక్షించడమే తమ ఉద్దేశమని, నిజమైన భూ యజమానులకు అన్యాయం జరగదని చెబుతోంది.

ప్రజాస్వామ్యంలో ఆరోపణలు, ప్రత్యారోపణలు సహజమే. కానీ చివరకు నష్టపోయేది రాజకీయ పార్టీ కాదు.. సాధారణ భూ యజమాని. అందువల్ల ఈ సమస్యను రాజకీయ కళ్లద్దాలతో కాకుండా పరిపాలనా దృష్టితో చూడాల్సిన అవసరం ఉంది.

ఎవరైనా తప్పు చేసి ఉంటే విచారణ జరగాలి. ఉద్దేశపూర్వకంగా ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టే ప్రయత్నం జరిగితే కఠిన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో అధికారుల నిర్లక్ష్యం వల్ల నిజమైన ప్రైవేటు భూమి నిషేధిత జాబితాలో చేరితే బాధ్యులపై కూడా చర్యలు ఉండాలి. ప్రజలకు కలిగిన నష్టం గురించి ప్రభుత్వం ఆలోచించాలి. ఎందుకంటే ఒక కుటుంబం రిజిస్ట్రేషన్ కోసం నెలల తరబడి తిరగడం, బ్యాంకు రుణం ఆగిపోవడం, అమ్మకం ఒప్పందం రద్దవడం, ముందస్తు డబ్బు వివాదంలో పడటం వంటి సమస్యలకు పరిపాలనా పొరపాటు ప్రత్యక్ష కారణమవుతుంది.

ఈ నేపథ్యంలో ప్రత్యేక పరిష్కార బృందాలను ఏర్పాటు చేయడం అవసరం. ప్రతి జిల్లాలో రెవెన్యూ, రిజిస్ట్రేషన్, సర్వే శాఖల అధికారులు కలిసి పనిచేసే విధానం ఉండాలి. ఒక దరఖాస్తు ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి తిరుగుతూ నెలల తరబడి పెండింగ్‌లో ఉండకూడదు. ఒకే చోట దరఖాస్తు స్వీకరించి, సంబంధిత శాఖల నుంచి సమాచారం సేకరించి, నిర్ణీత గడువులో పరిష్కారం ఇవ్వాలి. నిజమైన కేసులకు వేగంగా పరిష్కారం ఇవ్వడం ఎంత ముఖ్యమో, తిరస్కరించిన కేసులకు కారణం చెప్పడం కూడా అంతే ముఖ్యం.

ముఖ్యంగా భూమిని నిషేధిత జాబితాలో చేర్చే ముందు యజమానికి సమాచారం ఇవ్వడం, తన వాదన వినిపించే అవకాశం కల్పించడం వంటి సహజ న్యాయ సూత్రాలను బలోపేతం చేయాలి. అత్యవసర పరిస్థితుల్లో తాత్కాలికంగా నిషేధం విధించినా, ఆ తరువాత యజమాని ఆధారాలు సమర్పించే అవకాశం ఉండాలి. నిర్ణయం తీసుకున్న అధికారి ఎవరో, నిర్ణయానికి కారణం ఏమిటో రికార్డులో ఉండాలి. అప్పీల్ చేసుకునే అవకాశం కూడా స్పష్టంగా ఉండాలి. ఇలా చేస్తే అధికారులపై కూడా బాధ్యత పెరుగుతుంది.

భూమి అనేది కేవలం ఆస్తి కాదు. తెలంగాణలో అది కుటుంబ గౌరవం, భవిష్యత్తు భద్రత, పిల్లల విద్య, వివాహాలు, వ్యాపార పెట్టుబడులు, వృద్ధాప్య జీవితం వంటి అనేక అంశాలతో ముడిపడి ఉంటుంది. ఒక రైతు భూమి అమ్మకపోయినా అది అతని జీవనాధారం. ఒక మధ్యతరగతి కుటుంబానికి ఒక స్థలం జీవితకాల పొదుపు. ఒక చిన్న వ్యాపారికి ఆస్తి బ్యాంకు రుణానికి ఆధారం. అందువల్ల భూమి రికార్డుల్లో జరిగే ప్రతి మార్పును అత్యంత జాగ్రత్తగా నిర్వహించాలి.

ప్రస్తుతం ప్రభుత్వం చేపడుతున్న వేగవంతమైన పరిష్కార ప్రక్రియను శాశ్వత సంస్కరణల దిశగా తీసుకెళ్లాలి. కొన్ని వేల కేసులు పరిష్కరించినంత మాత్రాన సమస్య పూర్తయినట్లు భావించకూడదు. ఏ కారణాల వల్ల ఇంత పెద్ద స్థాయిలో ఫిర్యాదులు వచ్చాయో అధ్యయనం చేయాలి. ఏ జిల్లాల్లో సమస్య ఎక్కువగా ఉంది? ఏ రకమైన భూముల్లో ఎక్కువ పొరపాట్లు జరిగాయి? పాత సర్వే రికార్డుల వల్లనా? ఉపవిభాగాల వల్లనా? క్రమబద్ధీకరణ పత్రాలు నమోదు కాకపోవడం వల్లనా? శాఖల మధ్య సమాచార మార్పిడి లోపం వల్లనా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కనుగొనాలి.

భూమి రికార్డుల ఆధునికీకరణ జరుగుతున్న సమయంలో ఈ అవకాశం మరింత కీలకం. పాత రికార్డులను కేవలం కంప్యూటర్లలోకి ఎక్కించడం మాత్రమే ఆధునికీకరణ కాదు. తప్పులున్న పాత రికార్డులను అలాగే డిజిటల్ రూపంలోకి మార్చితే పాత తప్పే కొత్త వ్యవస్థలో శాశ్వతంగా మారుతుంది. అందుకే రికార్డుల శుద్ధి, భౌతిక పరిశీలన, సర్వే, హద్దుల నిర్ధారణ, పత్రాల సరిపోల్చడం వంటి ప్రక్రియలు సమాంతరంగా జరగాలి.

ప్రజలకు కూడా కొన్ని బాధ్యతలు ఉన్నాయి. భూమి కొనుగోలు చేసే ముందు కేవలం అమ్మకందారు చెప్పిన మాటలను నమ్మకూడదు. సంబంధిత రికార్డులు పరిశీలించాలి. సర్వే సంఖ్య, ఉపవిభాగం, పట్టా వివరాలు, నిషేధిత జాబితా, న్యాయ వివాదాలు వంటి అంశాలను ముందుగానే తెలుసుకోవాలి. భవిష్యత్తులో ఇబ్బందులు రాకుండా అన్ని పత్రాలను న్యాయ నిపుణుల సలహాతో పరిశీలించడం మంచిది. అయితే ప్రజలపై మాత్రమే బాధ్యత నెట్టివేయడం కూడా సరైంది కాదు. ప్రభుత్వం నిర్వహించే భూ రికార్డులు స్పష్టంగా, విశ్వసనీయంగా ఉండాలి.

ప్రభుత్వం ప్రకటించిన గడువులు కాగితాలపై కాకుండా ప్రజల జీవితాల్లో కనిపించాలి. ఒక సమస్యను ఇరవై నాలుగు నుంచి ముప్పై ఆరు గంటల్లో పరిష్కరిస్తామని ప్రకటించడం మంచి విషయం. కానీ అది అన్ని ప్రాంతాల్లో, అన్ని అర్హత ఉన్న కేసుల్లో సమర్థంగా అమలైతేనే ప్రజలకు నమ్మకం వస్తుంది.

అధికారులు కూడా ప్రజలతో మాట్లాడే విధానం మార్చుకోవాలి. భూమి సమస్యతో వచ్చిన వ్యక్తిని అనవసరంగా ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి పంపకుండా, అతని సమస్యను పరిష్కరించే బాధ్యతను ఒక అధికారి తీసుకోవాలి.

ఈ సమస్యలో మరో ముఖ్యమైన అంశం పారదర్శకత. నిషేధిత జాబితా ప్రజలకు అందుబాటులో ఉండాలి. దానిలో మార్పులు జరిగితే వాటి వివరాలు కూడా కనిపించాలి. ఒక భూమిని జాబితాలో చేర్చిన తేదీ, తొలగించిన తేదీ, కారణం, సంబంధిత ఉత్తర్వు వంటి వివరాలు అందుబాటులో ఉంటే అనుమానాలకు తావు తగ్గుతుంది. ప్రభుత్వ వ్యవస్థపై నమ్మకం పెరుగుతుంది. సమాచారాన్ని దాచడం వల్ల సమస్యలు తగ్గవు. మరింత అనుమానం పెరుగుతుంది.

అలాగే 22ఏ పేరుతో జరుగుతున్న అక్రమాలకు కూడా అడ్డుకట్ట వేయాలి. ఒకరి భూమి నిషేధిత జాబితాలో ఉందని చెప్పి మధ్యవర్తులు, దళారులు డబ్బులు డిమాండ్ చేసే పరిస్థితి రాకూడదు. సమస్య పరిష్కారానికి అధికారిక మార్గం స్పష్టంగా ఉంటే ప్రజలు అనధికార మార్గాలను ఆశ్రయించరు. అందుకే ప్రభుత్వం అధికారిక దరఖాస్తు విధానం, పరిశీలన దశలు, నిర్ణయం తీసుకునే అధికారి, అప్పీల్ విధానం వంటి అంశాలను ప్రజలకు సులభమైన భాషలో తెలియజేయాలి.

22ఏ నిబంధనను పూర్తిగా తొలగించాలన్న డిమాండ్ కూడా సరైన పరిష్కారం కాదు. ప్రభుత్వ భూములు, ప్రజా ఆస్తులు, వివాదాస్పద భూములను రక్షించడానికి నిషేధిత జాబితా అవసరం. కానీ ఆ జాబితా తప్పుల్లేకుండా ఉండటం మరింత అవసరం. అందువల్ల సమస్య నిబంధనలో ఉందా? లేక దాని అమలులో ఉందా? అన్నది ప్రభుత్వం లోతుగా పరిశీలించాలి. నిబంధనను బలహీనపరచకుండా, దాని అమలును పారదర్శకంగా, బాధ్యతాయుతంగా మార్చడమే సరైన మార్గం.

తెలంగాణ ప్రభుత్వం ఇప్పుడు ఒక కీలకమైన అవకాశాన్ని ఎదుర్కొంటోంది. 22ఏ సమస్యను తాత్కాలికంగా పరిష్కరించే కార్యక్రమంగా కాకుండా, రాష్ట్ర భూ పరిపాలనలో ఒక పెద్ద సంస్కరణకు ఆరంభంగా చూడాలి. ప్రతి భూ యజమానికి తన ఆస్తి స్థితి స్పష్టంగా తెలిసేలా చేయాలి. ప్రతి సర్వే సంఖ్యకు సంబంధించిన సమాచారం ఒకే చోట అందుబాటులో ఉండాలి. వివిధ శాఖల రికార్డుల మధ్య వ్యత్యాసాలు ఉంటే వాటిని సరిచేయాలి. ప్రభుత్వ భూమి ప్రభుత్వానిదే అని నిర్ధారించాలి. ప్రైవేటు భూమి ప్రైవేటు యజమాని హక్కుగా రక్షించాలి. వివాదాస్పద భూములకు న్యాయస్థానాల నిర్ణయాల ప్రకారం వ్యవహరించాలి.

అంతిమంగా ఈ సమస్య ఒక రాజకీయ వివాదం మాత్రమే కాదు. ఇది పాలనపై ప్రజల నమ్మకానికి సంబంధించిన అంశం. భూమి రికార్డులో ఒక తప్పు అంటే కాగితంపై ఒక తప్పు కాదు. అది ఒక కుటుంబం జీవితంపై ప్రభావం చూపే నిర్ణయం. అందుకే ప్రతి అధికారిక నమోదు వెనుక ఒక మనిషి జీవితం ఉందన్న విషయాన్ని పాలకులు, అధికారులు గుర్తుంచుకోవాలి.

ప్రభుత్వ భూములను కాపాడటం ప్రభుత్వ ధర్మం. అదే సమయంలో నిజమైన భూ యజమానుల హక్కులను కాపాడటం కూడా ప్రభుత్వ బాధ్యతే. ఈ రెండింటిలో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాల్సిన అవసరం లేదు. రెండింటినీ సమర్థంగా సాధించగల వ్యవస్థను నిర్మించాలి. తప్పుగా నిషేధిత జాబితాలో చేరిన భూములకు త్వరిత పరిష్కారం ఇవ్వాలి. భవిష్యత్తులో ఇలాంటి తప్పులు జరగకుండా రికార్డులను శుద్ధి చేయాలి. బాధ్యులైన అధికారులపై అవసరమైన చర్యలు తీసుకోవాలి. ప్రజలకు పూర్తి సమాచారం అందించాలి. అప్పీల్‌కు అవకాశం కల్పించాలి. ప్రతి నిర్ణయానికి కారణం ఉండాలి.

అప్పుడే 22ఏ నిబంధన ప్రజలకు భయపెట్టే పదంగా కాకుండా, ప్రజా ఆస్తులను కాపాడే విశ్వసనీయ వ్యవస్థగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ ఎదుర్కొంటున్న ఈ భూసమస్యను ప్రభుత్వం ఎంత వేగంగా పరిష్కరిస్తుందన్నదే కాదు.. ఎంత న్యాయంగా, పారదర్శకంగా, శాశ్వతంగా పరిష్కరిస్తుందన్నదే అసలు ప్రశ్న. భూమి మీద హక్కు కేవలం ఒక పత్రం కాదు. అది ఒక కుటుంబం నమ్మకం. ఆ నమ్మకాన్ని కాపాడినప్పుడే భూ పరిపాలనకు నిజమైన అర్థం వస్తుంది.



గుర్రం పాపిరెడ్డి.
ఎడిటర్

## మధుసూదన్‌శర్మ ఉద్యోగ విరమణ సభలో ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి

జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మునిగడపలో తెలుగు ఉపాధ్యాయులుగా పని చేస్తూ ఉద్యోగ విరమణ పొందిన ఆదరాజుపల్లి మధుసూదన్ శర్మ ఉద్యోగ విరమణ అభినందన సభకు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి తో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని వచ్చిన ఆరు నెలల లోపు మెరుగైన పిఆర్సి అమలు చేస్తామని సిపిఎస్ రద్దు చేస్తామని ఈ ప్రభుత్వం మేనిఫెస్టోలో వాగ్దానం చేసిందని ఉద్యోగులకు ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను మాత్రమే నిలబెట్టుకోవాలని మేము అడుగుతున్నామని నెంబర్ 1 నాడు యాభై వేల మందితో ఇందిరా పార్కులో ధర్నా నిర్వహించామని త్వరలోనే మంచి పిఆర్సి ఇచ్చి సిపిఎస్ రద్దు చేయకుంటే ఉద్యమాన్ని ఇంకా ఉధృత పరుస్తామని అన్నారు. సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుడు తెలుగు పండితుడు మధుసూదన్ శర్మ నేటి ఉపాధ్యాయులకు ఆదర్శమని పాఠశాలలో 16 సంవత్సరాలు పనిచేసి ఈ ప్రాంత విద్యార్థుల అభివృద్ధికి కృషి చేశాడని ఇంత పెద్ద ఎత్తున పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమానికి రావడం మధుసూదన శర్మ సేవలు సూచిస్తున్నాయని ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి అన్నారు.. విశిష్ట అతిథిగా విచ్చేసిన పి ఆర్ టి యు టి ఎస్ అధికార ప్రతినిధి వంగా మహేందర్ రెడ్డి మాట్లాడుతూ దశాబ్దాలకు పైగా సమాజానికి విద్యారంగం ద్వారా విశేష సేవలు అందించిన మధుసూదన శర్మ సేవలు అభినందనీయమని ఉద్యోగుల బెనిఫిట్స్ అన్ని నెల రోజుల లోపల చెల్లించాలని ప్రభుత్వాన్ని వంగ మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఆర్టీయు అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి రాష్ట్ర పెన్షనర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు పేరి వెంకటరెడ్డి పిఆర్టియు రాష్ట్ర ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాసరెడ్డి పిఆర్టియు సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదరాసు పల్లి శశిధర్ పత్రిక



సంపాదక వర్గ సభ్యులు పిన్నింటి రామకృష్ణారెడ్డి మండల విద్యాధికారి సైదులు పిఆర్టియు జగదేవపూర్ మండల శాఖ అధ్యక్షులు చిలుకూరు వెంకటరామిరెడ్డి మండల ప్రధాన కార్యదర్శి బొద్దు నాయక్ అసోసియేట్ అధ్యక్షులు వంగ శ్రీనివాసరెడ్డి కే ప్రభాకర్ ప్రధానోపాధ్యాయులు ఎండి రహీం సుగుణాకర్ ఉపాధ్యాయులు బంధువులు పాల్గొన్నరు

## బాలిక మిస్సింగ్ కేసు..
## గుంటూరు పోలీసులపై హైకోర్టు తీవ్ర ఆగ్రహం




పదో తరగతి విద్యార్థిని అదృశ్యమైన కేసులో గుంటూరు జిల్లా పోలీసుల తీరుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. పోలీసుల నిర్లక్ష్యంపై మండిపడిన ధర్మాసనం, "గుంటూరు జిల్లా పోలీసులు చాలా గ్రేట్" అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించింది. కేసు వివరాల్లోకి వెళ్తే.. గుంటూరు పట్టాభిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో గత జూన్ నెలలో ఓ బాలిక ట్యూషన్‌కు వెళ్లి అదృశ్యమైంది. దీనిపై బాధితురాలి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే, మూడు నెలలు గడిచినా బాలిక ఆచూకీ లభించకపోవడంతో, ఆయన హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. బుధవారం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం, పోలీసుల పనితీరుపై తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఆధునిక సాంకేతికత అందుబాటులో ఉన్నప్పటికీ ఒక బాలికను కనిపెట్టలేకపోవడం సిగ్గుచేటని అభిప్రాయపడింది. గతంలో సమాచార హక్కు చట్టం చీఫ్ కమిషనర్‌ను పోలీస్ స్టేషన్‌కు రాకుండా అడ్డుకున్న ఘటనను గుర్తుచేస్తూ, ఇలాంటి పోలీసులు ఉండటం ప్రభుత్వానికే సిగ్గుచేటని ఘాటు వ్యాఖ్యలు చేసింది. కేసు విచారణలో పోలీసులు సరైన స్ఫూర్తితో పనిచేయడం లేదని పేర్కొన్న కోర్టు, గురువారం నాటికల్లా బాలికను తమ ముందు హాజరుపరచాలని ఏపీ డీజీపీ హరీశ్ కుమార్ గుప్తాను ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది.

# కేసీఆర్ రాజీనామా చేయాలని కాంగ్రెస్ భారీ ర్యాలీ

**బీఆర్ఎస్‌ది ఫామ్‌హౌస్ పాలన..**

**కాంగ్రెస్‌ది ప్రజా పాలన: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్**



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3 (అరుణప్రభ న్యూస్): రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అధినేత, ప్రతిపక్ష నేత కేసీఆర్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సుమారు 500 మీటర్ల మేర నిర్వహించిన ర్యాలీలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను ప్రదర్శించారు. కాంగ్రెస్ శ్రేణులు పెద్ద ఎత్తున తరలిరావడంతో వేములవాడలో రాజకీయ సందడి నెలకొంది. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో ప్రజా సమస్యలను పట్టించుకోలేదని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు ఓర్వలేకపోతున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రజలకు కల్వకుంట్ల కుటుంబం బాకీ ఉందని, ప్రజా సమస్యలపై అసెంబ్లీలో మాట్లాడని కేసీఆర్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని ఆది శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాష్ట్రవ్యాప్తంగా వస్తున్న ప్రజా ఆదరణను చూసి బావ, బామ్మర్దులు భయపడుతున్నారని వ్యాఖ్యానించారు. "బీఆర్ఎస్‌ది ఫామ్‌హౌస్ పాలన.. కాంగ్రెస్‌ది ప్రజా పాలన" అని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తూ, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. రాబోయే రోజుల్లోనూ ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను మరింత ముందుకు తీసుకెళ్తామని తెలిపారు. ర్యాలీలో కాంగ్రెస్ పార్టీకి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, యువజన, మహిళా విభాగాల నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ నిరసన

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3 (అరుణప్రభ న్యూస్): కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో గురువారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం భవనం ఎదుట నిర్వహించిన ఈ నిరసనలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తవుతున్నప్పటికీ ప్రజలకు ఇచ్చిన అనేక హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి, ఎన్నికల హామీలను నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట మండల బీఆర్ఎస్ శాఖ అధ్యక్షుడు వరస కృష్ణహరి, జిల్లా రెడ్డి సంఘం అధ్యక్షుడు, పీఏసీఎస్ చైర్మన్ గుండారపు కృష్ణారెడ్డి, సర్పంచులు ఎలగందుల నరసింహులు, అందె సుభాష్, ఇల్లందుల శ్రీనివాస్, ఉప సర్పంచ్ బంధారపు బాల్‌రెడ్డి, ఎల్లారెడ్డిపేట టౌన్ ప్రెసిడెంట్ ఎడ్ల సందీప్, పందిర్ల పరిశ్రమలు, ఆకుల మురళి, హసన్ భాయ్, దూస శీను తదితర బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం

**సొంత ఇంటి కలను సాకారం చేయడమే ప్రభుత్వ లక్ష్యం**

**ఇంటి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేసుకోవాలి**

**ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**



అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట ప్రతినిధి, సెప్టెంబర్ 03: అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసి పేదల సొంత ఇంటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేసుకోవాలని ఆయన సూచించారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని సాయి మణికంఠ ఫంక్షన్ హాల్‌లో తెలంగాణ గృహ నిర్మాణ సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మొదటి విడతలో మంజూరైన ఇళ్లను నిర్ణీత సమయంలో నిర్మించుకున్న లబ్ధిదారుల స్థానంలో నూతనంగా ఎంపికైన 710 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు ధ్రువపత్రాలను ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ కలిసి అందజేశారు. సిరిసిల్ల, వేములవాడ మున్సిపాలిటీలతో పాటు ఆయా మండలాలకు చెందిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. లబ్ధిదారుల సౌకర్యార్థం ఆయా మండలాల వారీగా ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసి అధికారులు ధ్రువపత్రాలను అందజేశారు. స్టాళ్ల వద్ద జరుగుతున్న పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పరిశీలించారు.

### పేదల సొంత ఇంటి కలను నెరవేరుస్తున్నాం

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆదేశాల మేరకు అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. పేదవాడి సొంత ఇంటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో కేవలం లబ్ధిదారులకు సొంత ఇల్లు సమకూరడమే కాకుండా గ్రామాలు, మున్సిపాలిటీల్లో స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతున్నాయని చెప్పారు. కూలీలకు పని లభించడంతో పాటు వివిధ వృత్తుల వారికి ఉపాధి, నిర్మాణ సామగ్రి దుకాణదారులకు వ్యాపార లావాదేవీలు పెరుగుతున్నాయని వివరించారు. జిల్లాలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయని తెలిపారు.

### సంక్షేమ పథకాలు వేగంగా అమలు

రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం వేగంగా అమలు చేస్తోందని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత ఆర్టీసీ ప్రయాణం వంటి పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేశామని, నూతన రేషన్ కార్డులు జారీ చేస్తున్నామని చెప్పారు. దేశంలో ఎక్కడా లేని విధంగా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని, నూతన పెన్షన్ల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నామని తెలిపారు. అన్ని వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందన్నారు. జిల్లాలో ధార్మిక, కార్మిక రంగాల అభివృద్ధికి పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం కల్పించిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసుకోవాలని కోరారు.

### ప్రభుత్వం అందించే రూ.5 లక్షలతో ఇల్లు పూర్తి చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ సొంత ఇల్లు నిర్మించుకోవడం ప్రతి కుటుంబం కల అని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు పొందిన లబ్ధిదారులు ప్రభుత్వం నిర్ణయించిన విస్తీర్ణంలో ఇంటి నిర్మాణాన్ని ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రతి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మోడల్ హౌస్‌లను లబ్ధిదారులు తప్పనిసరిగా సందర్శించి, వాటి నిర్మాణ విధానాన్ని పరిశీలించాలని సూచించారు. ప్రభుత్వం అందించే మొత్తం రూ.5 లక్షల ఆర్థిక సహాయంతో ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేసుకోవాలని తెలిపారు. రెండో విడతలో ప్రతి నియోజకవర్గానికి 2,000 ఇందిరమ్మ ఇళ్లు చొప్పున మంజూరు చేసినట్లు కలెక్టర్ తెలిపారు. ఇంటి నిర్మాణానికి సంబంధించిన ఆర్థిక సహాయం నాలుగు దశల్లో లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో జమ అవుతుందని వివరించారు. పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ అధికారులు లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లి నిర్మాణం ఏ దశలో ఉందో పరిశీలించి ఫొటోలు తీస్తారని చెప్పారు. లబ్ధిదారులు నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేసి గృహప్రవేశాలు నిర్వహించుకుని ఆనందంగా జీవించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.

### పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు

కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, సిరిసిల్ల మున్సిపల్ చైర్మన్ జిందం కళ, వేములవాడ మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్లు తిరుపతి, ఎల్లయ్య, రాజు, స్వరూప, సబేరా బేగం, రాణి, రాములు నాయక్, విజయ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు, సిరిసిల్ల ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్, కౌన్సిలర్లు, సర్పంచులు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, అధికారులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



# యూరియా సంచితో షర్ట్.. కాంగ్రెస్ పాలనపై వినూత్న నిరసన

**రైతులకు యూరియా కొరతపై**

**బీఆర్ఎస్ నేత కుంభాల మల్లారెడ్డి ఆగ్రహం**

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనను నిరసిస్తూ బీఆర్ఎస్ నేత, మాజీ సెస్ డైరెక్టర్ కుంభాల మల్లారెడ్డి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. యూరియా సంచిని షర్ట్ ఆకారంలో కుట్టించుకుని దానిని ధరించి తన నిరసనను వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడుతూ.. రైతు లేనిదే రాజ్యం లేదని, రైతులకు అవసరమైనంత యూరియాను ప్రభుత్వం అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. రైతులకు సరిపడా యూరియా ఇస్తే దానిని వంట చేసుకుని తినరని, పంటలకు వినియోగించుకుంటారని ఆయన ఎద్దేవా చేశారు. యూరియా కోసం రైతులు ఇబ్బందులు పడుతున్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనలో రైతుల సమస్యలు పరిష్కారం కాలేదని ఆరోపించారు. రైతులకు తక్షణమే సరిపడా యూరియాను అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. యూరియా సంచితో షర్ట్ ధరించి మల్లారెడ్డి చేపట్టిన వినూత్న నిరసన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది.



# ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

**ఇళ్ల నిర్మాణాన్ని త్వరితగతిన**

**పూర్తి చేసుకోవాలి: సర్పంచ్ ఎనుగందుల నరసింహులు**

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: సిరిసిల్లలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులకు ఓసీడీ ప్రొసీడింగ్ పత్రాలను ఎల్లారెడ్డిపేట సర్పంచ్ ఎనుగందుల నరసింహులు, సర్పంచ్ ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నరసన్న కలిసి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మంజూరైన ఇళ్ల నిర్మాణ పనులను ఆలస్యం చేయకుండా త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: ఎల్లారెడ్డిపేట మండలంలోనీ గొల్లపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద మంజూరైన లబ్ధిదారులకు ఓసీడీ ప్రొసీడింగ్ పత్రాలను సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ కొండ రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకుని, ఇళ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో, హౌసింగ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.ం



## బొప్పాపూర్ బీసీ కాలనీ పాఠశాలలో యూనిఫామ్స్ పంపిణీ

**విద్యార్థులకు ఉచితంగా స్కూల్**

**యూనిఫామ్స్ అందజేసిన సర్పంచ్ గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి**

అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: ఎల్లారెడ్డిపేట మండలం బొప్పాపూర్ బీసీ కాలనీలోని ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ ఇల్లందుల గీతాంజలి శ్రీనివాస్ రెడ్డి విద్యార్థులకు యూనిఫామ్స్ అందజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణతో విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు తనవంతు సహకారం అందిస్తామని తెలిపారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని సూచించారు. పాఠశాల విద్యార్థులకు యూనిఫామ్స్ అందడంతో వారు ఆనందం వ్యక్తం చేశారు. విద్యార్థుల అవసరాలను గుర్తించి యూనిఫామ్స్ పంపిణీ చేసిన సర్పంచ్‌కు ఉపాధ్యాయులు, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ గాలిపల్లి కృష్ణహరి, ఉపాధ్యాయురాలు పద్మజ, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకర గుంత వద్ద స్టాపర్ ఏర్పాటు చేసిన పోలీసులు

**స్థానికుల ఫిర్యాదుపై తక్షణమే స్పందించిన ఎల్లారెడ్డిపేట పోలీసులు**



అరుణప్రభ న్యూస్ -- ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: సిరిసిల్ల--కామారెడ్డి ప్రధాన రహదారిపై రాగట్లపల్లి సమీపంలో ఏర్పడిన ప్రమాదకర గుంత వద్ద పోలీసులు స్టాపర్ బోర్డును ఏర్పాటు చేశారు. రహదారిపై గుంత కారణంగా వాహనదారులకు ప్రమాదం జరిగే అవకాశం ఉందని గుర్తించిన పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. స్థానిక కాంగ్రెస్ నాయకుడు మందాటి లక్ష్మణ్ యాదవ్ రహదారిపై ఏర్పడిన గుంత విషయాన్ని ఆర్అండ్‌బీ అధికారులు, పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న ఎల్లారెడ్డిపేట సీఐ వెంకటేష్, ఎస్సై రమేష్ ఆదేశాల మేరకు గ్రామ పోలీసు అధికారి షబ్బీర్ గుంత వద్ద స్టాపర్ బోర్డును ఏర్పాటు చేశారు. రాత్రి వేళల్లో గుంత స్పష్టంగా కనిపించకపోవడంతో వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉండటంతో, ముందస్తు జాగ్రత్తగా స్టాపర్ ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. దీంతో వాహనదారులు అప్రమత్తంగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది. అయితే గుంతకు తాత్కాలికంగా స్టాపర్ ఏర్పాటు చేయడంతో పాటు సంబంధిత ఆర్అండ్‌బీ అధికారులు గుంతను శాశ్వతంగా పూడ్చి రహదారిని మరమ్మతు చేయాలని స్థానికులు కోరుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లిన స్థానిక నాయకుడు మందాటి లక్ష్మణ్ యాదవ్‌కు, వెంటనే స్పందించి స్టాపర్ ఏర్పాటు చేసిన పోలీసు శాఖకు రాగట్లపల్లి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

# వాంగ్దల్ - గైరాన్ తండా రోడ్డు పనులను స్వయంగా పరిశీలించిన గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి





నారాయణఖేడ్ నియోజకవర్గం : దశాబ్దాలుగా సరైన రహదారి సౌకర్యం లేక అల్లాడిన వాంగ్దల్ – గైరాన్ తండా ప్రజల కష్టాలు తీరాయి. రాళ్లు, రప్పలు, ముళ్లపొదలతో నడవడానికే భయపడే ఆ మార్గంలో ఇప్పుడు సరికొత్త తారు రోడ్డు రూపుదిద్దుకుంది. నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవ రెడ్డి ప్రత్యేక చొరవతో ప్రభుత్వం నుంచి మంజూరైన రూ. 1.90 కోట్ల నిధులతో నిర్మించిన ఈ రోడ్డు పనులను ఎమ్మెల్యే ఈరోజు స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవ రెడ్డి కొత్తగా వేసిన రోడ్డుపై తన వాహనంలో ప్రయాణించి పనుల నాణ్యతను తనిఖీ చేశారు. నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. అనంతరం ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ... నియోజకవర్గంలోని మారుమూల తండాలు, గ్రామాలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించడమే తమ ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేర్కొన్నారు.ఎన్నో ఏళ్ల తరబడి ఎదురు చూస్తున్న గైరాన్ తండాకు శాశ్వత రోడ్డు సౌకర్యం కల్పించడం సంతోషంగా ఉందన్నారు. తండాల సమగ్రాభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకొచ్చి మౌలిక సదుపాయాలు మెరుగుపరుస్తామని హామీ ఇచ్చారు.

తమ చిరకాల స్వప్నమైన పక్కా రహదారిని అందుబాటులోకి తెచ్చినందుకు గైరాన్ తండా ప్రజలు, ప్రజాప్రతినిధులు ఎమ్మెల్యే సంజీవ రెడ్డికి ఘనస్వాగతం పలికి, ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, జైపాల్ నాయక్ .రాజు అధికారులు, గ్రామస్తులు తండా వాసులు తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ, ఎస్టీ కులాల అభివృద్ధికి అధిక ప్రాధాన్యత, అర్హత కలిగిన వారికి బెస్ట్ అవైలబుల్, ఉన్నత విద్య అమలు

**జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్**

**ఎస్సీ,ఎస్టీల కేసుల పరిష్కారంలో వేగవంతంగా చర్యలు**

**జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్**



అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం గురువారం కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో కమిటీ చైర్పర్సన్, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు, జిల్లా అధికారులు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం (పి ఓ ఎ యాక్ట్ ) కింద నమోదైన కేసుల పురోగతి, బాధితులకు అందాల్సిన పరిహారం, కేసుల దర్యాప్తుపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,బాధితులకు తక్షణ సహాయం: ఎస్సీ, ఎస్టీ చట్టం కింద నమోదైన కేసుల్లో బాధితులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అందాల్సిన నష్టపరిహారం, పెన్షన్ , ఇతర సంక్షేమ ఫలాలను ఆలస్యం లేకుండా వెంటనే అందించాలని,రెవెన్యూ, పోలీస్, సాంఘిక సంక్షేమ శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేసి కేసుల పరిష్కార వేగాన్ని పెంచాలని ,క్షేత్రస్థాయిలో ఎస్సీ, ఎస్టీ వర్గాలు, ఇతర అన్ని వర్గాల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా, వారికి ప్రభుత్వం అందిస్తున్న చట్టపరమైన రక్షణలపై అవగాహన సదస్సులు నిర్వహించాలనీ, జిల్లాలో 51% ఎస్సీ ఎస్టీలు ల జనాభా ఉందని జనాభా ప్రాతిపదికన వారికి అందాల్సిన అభివృద్ధి సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు, కొత్తగా నోటిఫికేషన్లు జారీ చేసిన అంగన్వాడీ పోస్టులు, తదితర విభాగాలలో ఆర్ఓఆర్ రోస్టర్ పాయింట్ కచ్చితంగా అమలు చేయాలని, కార్యాలయాలలో వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు, ఎస్సీ, ఎస్టీ వసతి గృహాలతో పాటు అన్ని వసతి గృహాలలో కచ్చితంగా పక్కా డైట్ మెనూ పాటించాలని, హాస్టల్ వెల్ఫేర్ అధికారులకు కేటాయించిన వసతి గృహాలలో తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు, భూ సమస్యలు, అంబేద్కర్ ఓవర్సీస్ స్టడీ, బెస్ట్ అవైలబుల్ స్కీమ్స్, కార్పొరేట్ ఇంటర్ విద్య తదితర పథకాలలో అర్హులైన వారికి కచ్చితంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు, జిల్లాలో ప్రజావాణి కార్యక్రమాలలో ప్రత్యేకంగా న్యాయ సేవల కోసం కౌంటర్ ను ఏర్పాటు చేయడం జరిగిందని తద్వారా కూడా ఎస్సీ ఎస్టీ, అన్ని వర్గాల ప్రజలు ఈ సేవలను వినియోగించుకోవాలని తెలిపారు, కొత్తగా నియామకమైన కమిటీ సభ్యులు క్షేత్రస్థాయిలో అన్ని పరిస్థితులను గమనిస్తూ ఉండాలని ఏమైనా సమస్యలు ఉంటే కమిటీ దృష్టికి తీసుకువచ్చి వెంటనే పరిష్కరించే విధంగా ముందుకు సాగాలని సూచించారు, అందరూ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలని తెలిపారు జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వేగవంతమైన నమోదైన కేసుల్లో ఎస్డీపివో/డిఎస్పీ స్థాయి అధికారులు దర్యాప్తును నిర్దేశిత గడువులోగా పూర్తి చేసి, సంబంధిత న్యాయస్థానాల్లో సకాలంలో ఛార్జిషీట్ దాఖలు చేయాలని, నిష్పక్షపాత విచారణ: ప్రతి కేసులోనూ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా విచారణ జరిపి బాధితులకు చట్టపరంగా తగిన న్యాయం జరిగేలా చూడాలనీ,ముందస్తు చర్యలు: సమస్యాత్మక గ్రామాలు, ప్రాంతాలను గుర్తించి, అక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని, ప్రతి మాసం జరిగే క్రైమ్ మీటింగ్లో ప్రత్యేకంగా ఎస్సీ ఎస్టీ కేసుల గురించి చర్చించి వేగవంతంగా చర్యలు తీసుకుంటామన్నారు ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రెవెన్యూ కె. అనిల్ కుమార్, ఇన్చార్జి అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు హౌసింగ్ పీడీ పురుషోత్తం, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు, కమిటీ సభ్యులు, గుగులోతు కిషన్ నాయక్, పంజా కల్పన, గొల్లపల్లి రజనీకాంత్, పులుసం పుష్పలత, గూగులోత్ దేశీ రామ్ నాయక్, పి.రాజేంద్రప్రసాద్, రజిత, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు

# ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం విధులు నిర్వహించాలి

అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : గురువారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ మహబూబాబాద్ పట్టణంలోనీ హనుమంతుని గడ్డ, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ భవన్, పద్మశాలి భవన్, పోలింగ్ కేంద్రాలలో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఇప్పటివరకు నోటీసులు అందించడం కొనసాగుతుందని, అందించిన నోటీసులకు సంబంధించి (11) రకాల గుర్తింపు కార్డులను సంబంధిత బూతు లెవల్ అధికారులకు అందజేసి తమ ఓటును పరిరక్షించుకోవాలని కలెక్టర్ కోరారు జిల్లా వ్యాప్తంగా రాష్ట్ర ఎన్నికల సంఘం సూచించిన షెడ్యూల్ ప్రకారం సంబంధిత సిబ్బంది విధులు నిర్వహించాలని ప్రతిరోజు ఆన్లైన్లో నివేదికలను అప్లోడ్ చేయాలని, ఇంకా రాని నోటీస్ అందుకున్న ఓటరు కు స్వయంగా కానీ ఫోన్ ద్వారా కానీ సమాచారం అందించి అవగాహన కల్పించాలని కలెక్టర్ సంబంధిత బూతు లెవల్ అధికారులను ఆదేశించారు ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ రెవెన్యూ డివిజనల్ అధికారి రాజేశ్వరి, మున్సిపల్ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఉపేందర్, ఉప తాహసిల్దార్ నాగరాజు, రాజు, తదితరులు ఉన్నారు



# విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో ఘనంగా శ్రీకృష్ణాష్టమి వేడుకలు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3 (అరుణప్రభ): ఎల్లారెడ్డిపేటలోని విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్‌లో శ్రీకృష్ణాష్టమి వేడుకలను విద్యార్థులు, ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం ఉత్సాహంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని జన్మదినాన్ని పురస్కరించుకొని పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు శ్రీకృష్ణుడు, రాధ తదితర వేషధారణలతో అలరించారు. శ్రీకృష్ణుని బాల్య జీవితంలోని ఘట్టాలను ప్రతిబింబించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ఆటలు, ప్రదర్శనలు నిర్వహించారు. చిన్నారులు సంప్రదాయ దుస్తుల్లో ముస్తాబై కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొనడంతో పాఠశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది. విద్యార్థుల ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్లు మొహమ్మద్ లతీఫ్, నైమున్నిసా, ప్రిన్సిపాల్ శరత్, సంతోష్, మొహమ్మద్ అశ్రఫ్తో పాటు ఉపాధ్యాయులు, పీఈటీలు పాల్గొన్నారు. విద్యార్థుల వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించిన వారు చిన్నారులను అభినందించారు. పండుగల ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించి, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన కల్పించారు.



**విలువలతో కూడిన విద్యే లక్ష్యం**

ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవితం విద్యార్థులకు అనేక గొప్ప విలువలను నేర్పుతుందని పేర్కొన్నారు. ధైర్యం, జ్ఞానం, కర్తవ్యనిష్ఠ, స్నేహభావం, ఆత్మవిశ్వాసం, నైతిక విలువలను శ్రీకృష్ణుని జీవితం ద్వారా పిల్లలు తెలుసుకోవచ్చన్నారు. విద్యార్థులకు కేవలం పాఠ్యపుస్తకాలకే పరిమితమైన విద్య కాకుండా మన సంస్కృతి, సంప్రదాయాలు, పండుగల విశిష్టత, నైతిక విలువలపై అవగాహన కల్పించడం ద్వారా వారి సమగ్ర వ్యక్తిత్వ వికాసానికి పునాది వేయవచ్చని తెలిపారు. పండుగలను పాఠశాల స్థాయిలో నిర్వహించడం ద్వారా విద్యార్థుల్లో ఐక్యత, సృజనాత్మకత, ఆత్మవిశ్వాసం, సామాజిక బాధ్యత వంటి లక్షణాలు పెంపొందుతాయని పేర్కొన్నారు. నేటి పిల్లలే రేపటి దేశ భవిష్యత్తు అని పేర్కొన్న యాజమాన్యం.. వారికి నాణ్యమైన విద్యతో పాటు మంచి ఆలోచనలు, క్రమశిక్షణ, మానవతా విలువలు, బాధ్యతాయుతమైన ప్రవర్తనను అలవర్చాల్సిన అవసరం ఉందన్నారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు చదువుతో పాటు సాంస్కృతిక, సృజనాత్మక కార్యక్రమాలకు కూడా ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. శ్రీకృష్ణాష్టమి వేడుకల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనడం పట్ల పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు.




## మండల స్థాయి ఆటల పోటీల్లో విజ్ఞాన్ విద్యార్థుల ప్రతిభ కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ పోటీల్లో పలు బహుమతులు కైవసం

అరుణప్రభ న్యూస్ - ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3: ఎల్లారెడ్డిపేట మండలంలోని వెంకటాపూర్ గ్రామంలో నిర్వహించిన మండల స్థాయి ఆటల పోటీల్లో ఎల్లారెడ్డిపేట విజ్ఞాన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచి పలు బహుమతులను సాధించారు. క్రీడల్లో సత్తా చాటి పాఠశాలకు మంచి పేరు తీసుకువచ్చారని పాఠశాల కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ తెలిపారు. అండర్--14 బాలుర విభాగంలో కబడ్డీ పోటీల్లో విజ్ఞాన్ పాఠశాల విద్యార్థులు మొదటి స్థానాన్ని కైవసం చేసుకున్నారు. అదే విధంగా వాలీబాల్‌లో రెండో స్థానం సాధించారు. బాలికల విభాగంలో అండర్--14 ఖోఖో పోటీల్లో మొదటి స్థానం, వాలీబాల్‌లో రెండో స్థానం, కబడ్డీలో మొదటి స్థానం సాధించి సత్తా చాటారు. అలాగే అండర్--14 బాలుర విభాగంలోని ఖోఖో పోటీల్లోనూ విద్యార్థులు మొదటి స్థానాన్ని సాధించారు. వివిధ క్రీడా విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరచడం పట్ల పాఠశాల యాజమాన్యం హర్షం వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్ మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లోనూ ప్రోత్సాహం, శిక్షణ అందిస్తున్నామని తెలిపారు. క్రీడల్లో ప్రతిభను పెంపొందించేందుకు పీఈటీలు చేస్తున్న కృషిని అభినందించారు. మండల స్థాయి పోటీల్లో విజయం సాధించిన విద్యార్థులు భవిష్యత్తులో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లోనూ రాణించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు క్రీడల్లో శిక్షణ అందించిన పీఈటీలు భరత్ కుమార్, రాకేష్, దివ్యను కరస్పాండెంట్ మహ్మద్ లతీఫ్‌తో పాటు పాఠశాల డైరెక్టర్లు నయిమా, అశ్రఫ్, ప్రధానోపాధ్యాయులు శరత్ కుమార్, సంతోష్ కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.



## ప్రభుత్వ పథకాలు ప్రజలందరికీ అందేలా చూడాలి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి.

నారాయణఖేడ్ నియోజకవర్గం : కాంగ్టి మండల పరిషత్ కార్యాలయంలో ఈరోజు కాంగ్టి మండల సర్వసభ్య సమావేశంలో గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి గారు పాల్గొని, మండలంలోని గ్రామాల అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై సంబంధిత అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమీక్ష నిర్వహించారు. కాంగ్టి మండలంలో నీటి సమస్య ఎక్కువగా ఉండేదని, కానీ మా ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆ సమస్య అధికారుల సమన్వయం తో నీటి సమస్య తీరిందని ఇక ముందు కూడా తాండా/గ్రామాల్లో తాగునీటి కొరత లేకుండా చూడాలని ఎమ్మెల్యే నీటి శాఖ అధికారులకు సూచించారు. మిషన్ భగీరథ అమలు, పైప్‌లైన్/ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్వహణ, కనెక్షన్ల పెండింగ్‌ను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. గ్రామాల్లో స్థిరమైన విద్యుత్ సరఫరా, లో–వోల్టేజ్ సమస్యలు, బిల్లింగ్/కనెక్షన్ అంశాలపై విద్యుత్ శాఖ అధికారులు తక్షణం స్పందించాలని సూచించారు. మండలంలోని అంతర్గత రోడ్లు, గ్రామాల అనుసంధానం, పనుల నాణ్యతపై ఇంజినీరింగ్/పంచాయతీ రాజ్ శాఖ అధికారులు పర్యవేక్షణ పెంచాలని ఎమ్మెల్యే కోరారు. పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, ఉపాధ్యాయ కొరత, ఆరోగ్య కేంద్రాల్లో సిబ్బంది/మందుల కొరత తదితర అంశాలను సంబంధిత శాఖల అధికారులు ప్రాధాన్యంగా పరిష్కరించాలని దిశానిర్దేశం ఇచ్చారు. అర్హులైన కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్ల మంజూరు, నిర్మాణ పురోగతి, పెండింగ్ ఇళ్ల జాబితా సిద్ధం చేసి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని హౌసింగ్/రెవెన్యూ అధికారులకు సూచించారు. అవసరమైనచోట గ్రామస్థాయిలో అర్హత జాబితాలు, పారదర్శకత పాటించాలని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులే గ్రామాల అభివృద్ధికి ముందడుగు వేయాలని, అధికారులతో సమన్వయం చేసుకుని సమస్యలను త్వరితంగా పరిష్కరించాలని ఎమ్మెల్యే కోరారు గ్రామాల్లోని సమస్యలను సర్పంచులు నేరుగా అధికారుల దృష్టికి, అవసరమైనచోట ఎమ్మెల్యే కార్యాలయ దృష్టికి తీసుకురావాలని, తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని డా. సంజీవరెడ్డి హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులను ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గారితో పాటు ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి గారు, మండలం ఉన్నతాధికారులు మరియు పంచాయతీ కార్యదర్శులు సర్పంచ్లు ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు



## మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేసిన నారాయణఖేడ్ శాసనసభ్యులు డా. పట్లోళ్ల సంజీవరెడ్డి

నారాయణఖేడ్ నియోజకవర్గం : మైనారిటీ వర్గాల సంక్షేమం, సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతనిస్తోందని గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన కంగ్టిలో స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్స్ (రాణఖీ) నిధులతో మంజూరైన అత్యాధునిక మైనారిటీ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు ఆయన స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులతో కలిసి ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి గారు మాట్లాడుతూ... పేద, మధ్యతరగతి మైనారిటీ కుటుంబాలు తమ శుభకార్యాలు, సామాజిక కార్యక్రమాలను తక్కువ ఖర్చుతో గౌరవప్రదంగా జరుపుకోవాలనే సదుద్దేశంతో ఈ భవన నిర్మాణాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండలానికి సంబంధించిన సర్పంచులు,స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల స్థాయి నాయకులు, మైనారిటీ సంఘాల ప్రతినిధులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ధర్మవరం మున్సిపల్ ఎన్నికలు.. ప్రజల అజెండా

# నిధులు.. పనులు.. లెక్కలు!

### మున్సిపల్ వెబ్‌సైట్‌లో సమాచారం మాత్రమే కాదు.. పూర్తి పారదర్శకత అవసరం






**ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్)**

ధర్మవరం మున్సిపాలిటీకి వివిధ ఆర్థిక సంఘాలు, ప్రభుత్వ పథకాల ద్వారా నిధులు మంజూరు, విడుదలవుతున్న నేపథ్యంలో.. ఆ నిధులతో చేపడుతున్న పనులపై ప్రజలకు పూర్తి సమాచారం అందుబాటులో ఉండటం పారదర్శక పాలనకు కీలకం.

మున్సిపల్ వెబ్‌సైట్‌లో పథకం పేరు, నిధుల కేటాయింపు వంటి వివరాలతో పాటు.. **మంజూరైన మొత్తం, విడుదలైన మొత్తం, అంచనా వ్యయం, టెండర్, వర్క్‌ఆర్డర్, పని ప్రారంభ తేదీ, పురోగతి, పూర్తయిన తేదీ, చెల్లించిన బిల్లులు** వంటి వివరాలు అందుబాటులో ఉంటే ప్రజలు పనుల స్థితిని స్వయంగా తెలుసుకునే అవకాశం ఉంటుంది.

ధర్మవరం మున్సిపాలిటీ అధికారిక సమాచార హ్యాండ్‌బుక్‌లో 14వ ఆర్థిక సంఘం కింద గత సంవత్సరంలో రూ.3.71 కోట్లు విడుదల కాగా రూ.3.10 కోట్లు ఖర్చయినట్లు నమోదైంది. ప్రస్తుత సంవత్సరానికి రూ.5.90 కోట్ల బడ్జెట్ కేటాయింపుతో పాటు అంతే మొత్తం విడుదలైనట్లు రికార్డులో పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద గత సంవత్సరంలో రూ.1.74 కోట్లు విడుదల కాగా రూ.1.41 కోట్లు ఖర్చయినట్లు కూడా నమోదైంది. అయితే నిధులు మంజూరు కావడం, విడుదల కావడం, టెండర్ కావడం, పని ప్రారంభం కావడం, పని పూర్తవడం, బిల్లు చెల్లించడం.. ఇవన్నీ ఒకే విషయం కాదు. ప్రతి దశకు సంబంధించిన సమాచారం స్పష్టంగా ఉంటేనే ప్రజలకు వాస్తవ పరిస్థితి తెలుస్తుంది.

**పథకాల లబ్ధిదారుల వివరాలూ ప్రజలకు తెలియాలి**

పారదర్శకత అనేది కేవలం మున్సిపల్ అభివృద్ధి పనులకే పరిమితం కాకూడదు. ప్రభుత్వ పథకాల ద్వారా ప్రజలకు ఆర్థిక ప్రయోజనం అందుతున్నప్పుడు.. **ఎవరెవరికి లబ్ధి చేకూరింది? ఎంతమందికి అందింది?** అనే వివరాలు కూడా ప్రజలకు అందుబాటులో ఉండాలి. ఇటీవల నేతన్న సేవ పథకం కింద చేనేత కార్మికులకు ఒక్కొక్కరికి రూ.25 వేల చొప్పున ఆర్థిక సాయం అందించిన నేపథ్యంలో.. ధర్మవరంలో లబ్ధిదారుల ఎంపికపై ఆరోపణలు, ఆందోళనలు చోటుచేసుకున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారుల జాబితా ప్రజలకు అందుబాటులో ఉండటం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రభుత్వ నిబంధనల ప్రకారం లబ్ధిదారుల జాబితాలను గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రదర్శించాల్సి ఉన్న నేపథ్యంలో.. ధర్మవరం మున్సిపాలిటీ పరిధిలోని వార్డు సచివాలయాల్లో నేతన్న సేవ లబ్ధిదారుల జాబితా ప్రదర్శించారా? అన్నది కూడా ప్రజలకు తెలియాల్సిన అంశమే. అదే సమయంలో.. మున్సిపాలిటీ పరిధిలో అమలైన పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల వివరాలు అధికారిక మున్సిపల్ వెబ్‌సైట్‌లో కూడా ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంటే మరింత పారదర్శకతకు అవకాశం ఉంటుంది.

**ప్రజలకు సమాచారం కావాలంటే కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి కాకుండా.. అధికారిక వెబ్‌సైట్‌లోనే పూర్తి వివరాలు కనిపించే వ్యవస్థ ఉండాలి.**

**సమాచారం ఉండటం మాత్రమే కాదు.. కనిపించేలా ఉండాలి**

వెబ్‌సైట్‌లో సమాచారం ఉండటం మాత్రమే పారదర్శకతకు పూర్తి అర్థం కాదు. ఆ సమాచారం తాజాదిగా, పూర్తిగా, సులభంగా అర్థమయ్యే విధంగా ఉండాలి. పని ప్రారంభం కాలేదా, కొనసాగుతోందా, పూర్తయ్యిందా అనే స్థితిని కూడా ఎప్పటికప్పుడు నవీకరించడం అవసరం.

ప్రజల డబ్బుతో జరిగే మున్సిపల్ పనులపై ప్రజలకే పూర్తి సమాచారం అందుబాటులో ఉండటం వారి హక్కు. అదే సమయంలో ఆ సమాచారం ఆధారంగా గత పాలనలో జరిగిన పనులు, ప్రస్తుత పనుల పరిస్థితి, భవిష్యత్తు అవసరాలను అంచనా వేయడం కూడా సాధ్యమవుతుంది.

**అరుణ ప్రభ విశ్లేషణ**

వెబ్‌సైట్ ఒక సమాచార పేజీగా కాకుండా.. ప్రజలకు మున్సిపల్ పాలనను పరిశీలించే కిటికీగా మారాలి. **నిధి నుంచి పని పూర్తివరకు.. పథకం నుంచి లబ్ధిదారుడి వరకు ప్రతి దశ ప్రజలకు కనిపించినప్పుడే పారదర్శకతకు అర్థం ఉంటుంది.**

**రేపటి కథనంలో..**

**నీరు.. డ్రైనేజీ.. రోడ్లు.. చెత్త!**

ధర్మవరం పట్టణానికి నిత్య జీవితంలో ఎదురయ్యే **ప్రధాన మౌలిక సమస్యలు.. వాటి పరిష్కారానికి అవసరమైన శాశ్వత ప్రణాళిక.. ఎన్నికల హామీలకు మించి పరిష్కార మార్గాలపై** "అరుణ ప్రభ" విశ్లేషణ.



## ప్రజల పట్టా భూములను 22Aలో చేర్చి హక్కులు హరిస్తారా?: మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి

### కాంగ్రెస్ ప్రభుత్వం ల్యాండ్ మాఫియాగా తయారైంది

సెప్టెంబర్ 3, అరుణ ప్రభ : ప్రజల కష్టార్జితంతో కొనుగోలు చేసిన పట్టా భూములు, ప్రైవేట్ ప్లాట్లను 22–ఏ (రిజిస్ట్రేషన్ నిషేధిత) జాబితాలో చేర్చడంపై బీఆర్ఎస్ పార్టీ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో మండిపడింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయిన సందర్భంగా చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా పీర్జాదిగూడలోని మేడిపల్లి ఎంఆర్ఓ కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల భూములను 22–ఏ జాబితాలో చేర్చి వారి ఆస్తి హక్కులను హరించే అధికారం ప్రభుత్వానికి ఎవరు ఇచ్చారని ప్రశ్నించారు. ఏళ్ల తరబడి కష్టపడి సంపాదించిన డబ్బుతో భూములు కొనుగోలు చేసిన రైతులు, మధ్యతరగతి కుటుంబాలు ఇప్పుడు రిజిస్ట్రేషన్లు, భూ లావాదేవీలు, బ్యాంకు రుణాల విషయంలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ప్రజల అభ్యంతరాలను, భూ యజమానుల పత్రాలను పరిశీలించకుండా అర్హతలేని భూములను 22–ఏ జాబితాలో చేర్చడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు. ప్రజల భూములను కాపాడాల్సిన ప్రభుత్వం, వాటినే వివాదాస్పదంగా మార్చడం దుర్మార్గమైన చర్య అని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వం, ఇప్పుడు ప్రజల ఆస్తులపై కూడా అనాలోచిత నిర్ణయాలు తీసుకుంటోందని ఆరోపించారు. 22–ఏ జాబితా పేరుతో ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పడం, వారి హక్కులను నిలిపివేయడం వెంటనే ఆపాలని డిమాండ్ చేశారు. అర్హతలేని భూములను తక్షణమే 22–ఏ జాబితా నుంచి తొలగించి, భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించాలి. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తాం అని జక్క వెంకట్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల భూములు, ఆస్తుల పరిరక్షణ కోసం బీఆర్ఎస్ పార్టీ చివరి వరకు పోరాడుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఏడవల్లి రఘువర్ధన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు దొంతిరి హరిశంకర్ రెడ్డి, కొల్తూరి మహేష్, లేతాకుల మాధవి, రఘుపతి రెడ్డి, మధుసూదన్ రెడ్డి, కౌడే పోచయ్య, మహిళా అధ్యక్షురాలు నిర్మల, యూత్ అధ్యక్షుడు ప్రభు, సీనియర్ నాయకులు ఆకుల మధుకర్, యూబీఏ అధ్యక్షుడు ఆకుల సత్యనారాయణ, రమేష్, సతీష్ రెడ్డి, మురళి, రాజేష్ రెడ్డి, నరసింహ రెడ్డి, కోటగిరి శ్రీకాంత్, జగన్ రెడ్డి, శశిధర్ రెడ్డి, యాసారం శ్రీనివాస్, మునికుంట్ల కిరణ్ గౌడ్, బుల్లెట్ శంకర్, అశోక్, సతీష్, కిరణ్ నాయక్, పాశం నరేందర్ రెడ్డి, అక్షిత్, వెంకట్, అమర్ పటేల్‌తో పాటు డివిజన్ అధ్యక్షులు, సీనియర్ నాయకులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మేడిపల్లిలో ఘనంగా కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీ

**పేదల పక్షపాతి పార్టీ కాంగ్రెస్**

**ఉప్పల్ డిపో వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం**

**ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

**1000 రోజుల కాంగ్రెస్ పరిపాలన అభివృద్ధికి, పేదల సంక్షేమానికి సాక్ష్యం**

**అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ బిఆర్ఎస్**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని విమర్శించే నైతిక హక్కు బిఆర్ఎస్ నేతలకు లేదు**

**బిఆర్ఎస్ నిరసన ధర్నాలపై వజ్రేష్ యాదవ్ ఫైర్**



సెప్టెంబర్ 3, అరుణ ప్రభ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పరిపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి ఆధ్వర్యంలో విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. సాయి ప్రియ కాలనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఉప్పల్ డిపో వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఉప్పల్ డిపో వద్ద బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 50 అడుగుల భారీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ చేసిన అప్పుల ఊబి నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, కొత్త పెన్షన్లు వంటి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రికార్డింగ్ డాన్స్ వేసి చూపించడం తప్ప ప్రజలకు మల్లారెడ్డి చేసింది ఏమీ లేదని, చిత్తశుద్ధి ఉంటే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బహిరంగ చర్చకు సిద్ధమని ఉద్దేశం యాదవ్ సవాల్ విసిరారు. అనంతరం తుంగతుర్తి రవి మాట్లాడుతూ అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రెస్ గా మారిన కేసీఆర్ ప్రభుత్వం, బి ఆర్ ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, పదేళ్ల తమ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప బిఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని తుంగతుర్తి మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అజయ్ యాదవ్,డీసీసీ ప్రధాన కార్యదర్శి జలెందర్ రెడ్డి,బోడుప్పల్ సర్కిల్ డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు, బొమ్మక్ కళ్యాణ్, పోగుల దిలీప్ రెడ్డి,వంగేటి ప్రభాకర్ రెడ్డి మరియు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఈనెల 10 వరకు సర్ పొడిగింపు

### గూడూరు ఆర్డీవో అరుణ కుమారి



గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): ఎస్ ఐ ఆర్ ఓటర్ వెరిఫికేషన్ ను ఎన్నికల సంఘం అక్టోబర్ 10 వ తేదీ వరకు పొడిగించిందని ఓట్లు లేని వారు సంబంధిత పోలీస్ స్టేషన్ లో బిఎల్ఓ లను సంప్రదించి ఫామ్ 6,7,8 ద్వారా వారి క్లెయిమ్స్ ను అక్టోబర్ 9వ తేదీ సాయంకాలం లోపు అందజేయాలని గూడూరు ఆర్డీవో అరుణకుమారి సూచించారు.



## ఓటరు జాబితాపై అవగాహన

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు మండల పరిధిలోని నేర్నూరూ గ్రామపంచాయతీలో ఎస్సీ ఎస్టీ, బీసీ ఓటర్స్ వాల్యుయేషన్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ ఎంపీడీవో మోహన్ మాట్లాడుతూ గ్రామంలో ఓటరు జాబితా పై అవగాహన కల్పించామన్నారు. ఎవరికైన అభ్యంతరాలు ఉంటే ఈనెల 9 వ తేదీ లోపు తెలపాలన్నారు.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను వేగవంతం చేయాలి



మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లా, సెప్టెంబర్ 3: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ--2026 నోటీసుల విచారణ, పరిష్కార ప్రక్రియను వేగవంతంగా నిర్వహించి ఖచ్చితమైన ఓటర్ల జాబితాను రూపొందించేలా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి ఆదేశించారు. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు, ఓటర్ వెరిఫైయబుల్ పేపర్ ఆడిట్ ట్రయల్ యంత్రాలను భద్రపరిచిన గోదామును వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అదనపు ఎన్నికల అధికారి వాసం వెంకటేశ్వర్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ మను చౌదరితో కలిసి రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తనిఖీ చేశారు. అనంతరం ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నోటీసుల విచారణ ప్రక్రియలో భాగంగా గురువారం కీసర మండలం నర్సంపల్లి, మేడ్చల్ మండలం మునీరాబాద్, దుండిగల్ మండలం దొమ్మరపోచంపల్లి ప్రాంతాల్లో నిర్వహిస్తున్న విచారణ ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి, జిల్లా ఎన్నికల అధికారి పరిశీలించారు. ఓటును నిర్ధారించే ప్రక్రియ, ఎన్నికల సంఘం నిర్దేశించిన ధ్రువీకరణ పత్రాల సమర్పణ, క్షేత్రస్థాయి సహాయం, రికార్డుల పరిశీలన, ధ్రువీకరణ ప్రక్రియలను స్వయంగా పరిశీలించారు. జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ విచారణ ప్రక్రియను నిబంధనల మేరకు పకడ్బందీగా, పారదర్శకంగా నిర్వహించాలని సంబంధిత ఎన్నికల నమోదు అధికారులు, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, పర్యవేక్షకులు, బూత్ స్థాయి అధికారులను రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఆదేశించారు. జిల్లాలో మ్యాపింగ్ జరగకుండా ఉన్న ఓటర్లు, ఓటరు కార్డులో ఉన్న వ్యత్యాసాల కేటగిరీలకు సంబంధించిన రికార్డులు, దరఖాస్తుల ధ్రువీకరణ ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. నోటీసులు అందిన ఓటర్లు విచారణకు హాజరైనప్పుడు వారి వివరాలను నిబంధనల ప్రకారం పరిశీలించి, అవసరమైన ఆధారాలను ధ్రువీకరించిన అనంతరం మాత్రమే తదుపరి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అర్హత కలిగిన ఓటర్ల వివరాలు క్రమపద్ధతిలో నమోదయ్యేలా సంబంధిత పత్రాల పరిశీలనలో అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. నిర్దేశిత గడువులోగా ప్రక్రియను పూర్తి చేసేందుకు తగినంత సిబ్బందిని నియమించి, రోజువారీ లక్ష్యాలు, ప్రామాణిక విధానాలు, సమగ్ర కార్యాచరణ ప్రణాళికతో పనులను కొనసాగించాలని ఆదేశించారు. విచారణ నిర్వహణ, దరఖాస్తుల పరిశీలన, అభ్యంతరాల పరిష్కారం తదితర అంశాలను నిరంతరం సమీక్షిస్తూ, ప్రక్రియను నిబంధనల ప్రకారం పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవోలు వెంకటరెడ్డి, శ్యామ్‌సుందర్, సహాయ ఎన్నికల నమోదు అధికారులు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.



## సాయిబాబాకి ప్రత్యేక పూజలు

గూడూరు – (అరుణ ప్రభ న్యూస్ ): గూడూరు పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఉన్న శ్రీ శిరిడి సాయిబాబా మందిరంలో గురువారం సందర్భంగా బాబా వారికి విశ్వసభిషేకం ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు భక్తులు బాబా వారిని దర్శించి అన్నప్రసాదాలు స్వీకరించారు.

# గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి నారాయణ రెడ్డి సమీక్ష సమావేశం





రంగారెడ్డి .సెప్టెంబర్ 3 : (అరుణ ప్రభ ప్రతినిధి) : గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, ఘనంగా నిర్వహించాలి, వినాయక చవితి పండుగను పురస్కరించుకుని జిల్లాలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా శాంతియుతంగా, సురక్షితంగా ఉత్సవాలు నిర్వహించేలా అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి అధికారులకు సూచించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో గణేష్ చవితి ఉత్సవాల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, అదనపు కలెక్టర్ డా. కె. కిరణ్మయితో కలిసి డీసీపీలు, ఆర్డీఓలు, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 14వ వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభమై, 24న నిమజ్జనం జరగనున్న నేపథ్యంలో మండపాల నిర్వాహకులు భక్తిశ్రద్ధలతో పాటు భద్రతా ప్రమాణాలను పాటిస్తూ ఉత్సవాలను నిర్వహించాలని సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలన్నారు. గణేష్ శోభాయాత్ర మార్గాల్లో గుంతలు, దెబ్బతిన్న రహదారులకు ప్యాచ్‌వర్క్ చేపట్టాలని, నిమజ్జన ప్రదేశాల్లో క్రేన్లు, బారికేడింగ్, వేదికలు, మొబైల్ టాయిలెట్లు, తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్డీఓలు, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, పోలీసు అధికారులు సమన్వయంతో ప్రతి ఉత్సవ కేంద్రాన్ని ముందుగానే పరిశీలించి అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు. విద్యుత్ సరఫరా, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లు, కనెక్షన్లు తదితర అంశాలను విద్యుత్ శాఖ నిపుణుల సహకారంతో తనిఖీ చేయాలని సూచించారు. ఉత్సవ మండపాలు, విగ్రహాల ఏర్పాటు ప్రదేశాలను సురక్షితంగా ఎంపిక చేసి, అవసరమైన అనుమతులు తప్పనిసరిగా పొందాలని, మండపాల నిర్మాణం పటిష్టంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రమాదాలకు అవకాశం ఉన్న ప్రదేశాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఉత్సవాల సందర్భంగా నిరంతర విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైన ప్రాంతాల్లో అదనపు పోలీస్ బందోబస్తు, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అన్నారు. మండపాల వద్ద పరిశుభ్రత, ఫాగింగ్, పారిశుద్ధ్య చర్యలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇవ్వాలని, అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వేలాడుతున్న విద్యుత్ తీగలను సరి చేయాలని సూచించారు. విగ్రహాల ఊరేగింపు సమయంలో వాహనాల్లో యాంత్రిక సమస్యలు తలెత్తకుండా ముందస్తు తనిఖీలు చేపట్టాలని, నిమజ్జన మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలు, వంగిన చెట్లు తదితర ప్రమాదకర అంశాలను తొలగించాలని తెలిపారు. చెరువుల వద్ద అవసరమైన సంఖ్యలో క్రేన్లు, బారికేడింగ్, వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి భక్తుల భద్రతకు పటిష్ట చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మున్సిపల్, పోలీస్, రెవెన్యూ, విద్యుత్, వైద్య, ఆర్అండ్‌బీ తదితర శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేయాలని కలెక్టర్ సూచించారు. పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక బందోబస్తు, కంట్రోల్ రూమ్, వేగవంతమైన స్పందన వ్యవస్థను ఏర్పాటు చేసి, ఎక్కడైనా సమస్య తలెత్తిన వెంటనే స్పందించేలా అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పని చేసి గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, భక్తిశ్రద్ధలతో, ఎలాంటి ప్రమాదాలు లేకుండా విజయవంతంగా నిర్వహించేందుకు కృషి చేయాలని కోరారు. భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి ప్రధాన కార్యదర్శి శశిధర్ మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు, నిమజ్జన కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని, నిమజ్జన ప్రదేశాల్లో తగినన్ని క్రేన్లు, నిరంతర విద్యుత్ సరఫరా, భద్రతా ఏర్పాట్లు కల్పించాలని కలెక్టర్‌ను కోరారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ కె.కిరణ్మయి, జిల్లా రెవెన్యూ అధికారి శారదాదేవి, మహేశ్వరం డీసీపీ నారాయణ రెడ్డి, భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి స్టేట్ ఎగ్జిక్యూటివ్ రవీందర్ రెడ్డి, బాలాపూర్ గణేష్ ఉత్సవ సమితి ఛైర్మన్ కె.నిరంజన్, సెక్రెటరీ సాయికిరణ్ చారి, వైస్ ప్రెసిడెంట్ టి.ఆనంద్ గౌడ్, ఆర్డీఓలు శ్రీనివాస్ రెడ్డి, శ్రీధర్, మున్సిపల్ కమిషనర్లు, పోలీస్ అధికారులు, ఆర్అండ్‌బీ అధికారులు, గణేష్ ఉత్సవ సమితి ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాక్ టౌన్ కాలనీ 22/A, ULC సమస్యలు పరిష్కరించాలి

### మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు రాక్ టౌన్ అసోసియేషన్ వినతి



హైదరాబాద్:అరుణ ప్రభ.రాక్ టౌన్ కాలనీకి సంబంధించిన 22/A నిషేధిత జాబితా, ఖూజ సమస్యలను పూర్తిగా పరిష్కరించి కాలనీ వాసులకు ఇబ్బందులు లేకుండా చూడాలని రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ కోరింది. ఈ మేరకు రాక్ టౌన్ కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రతినిధులు గురువారం మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు శ్రీ ఈటల రాజేందర్ను కలిసి సమస్యలను వివరించారు. ప్రభుత్వం కొన్ని కాలనీలు, వ్యవసాయ భూములను 22/A కింద రిజిస్ట్రేషన్ల నిషేధిత జాబితాలో చేర్చిన నేపథ్యంలో, రాక్ టౌన్ కాలనీలోని సర్వే నంబర్లు 12, 16లో మొత్తం 39,067 గజాల భూమి 22/A నిషేధిత జాబితాలో ఉన్నట్లు ప్రభుత్వ వెబ్‌సైట్‌లో నమోదైందని అసోసియేషన్ ప్రతినిధులు ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. అయితే రాక్ టౌన్ కాలనీ 22/A పరిధిలోకి రాదని, కాబట్టి ప్రభుత్వ వెబ్‌సైట్‌లోని నిషేధిత జాబితా నుంచి కాలనీ భూములను తొలగించాలని కోరుతూ ఇప్పటికే సరూర్‌నగర్ MROతో పాటు రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు రెండుసార్లు లేఖలు సమర్పించినట్లు తెలిపారు. అదేవిధంగా, రాక్ టౌన్ కాలనీకి సంబంధించిన ఖూజ విషయంలో హైకోర్టు నుంచి ఖూజ లేదని స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, ప్రభుత్వ వెబ్‌సైట్‌లో సంబంధిత వివరాలు తొలగించకపోవడంతో రిజిస్ట్రేషన్లు, అనుమతుల కోసం వెళ్లిన సమయంలో అధికారులు ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఎంపీకి వివరించారు. 22/A, ఖూజ సమస్యలను పూర్తిగా పరిష్కరించి రాక్ టౌన్ కాలనీని ఈ సమస్యల నుంచి క్లియర్ చేసేందుకు ప్రభుత్వ స్థాయిలో అవసరమైన సహకారం అందించాలని ఎంపీ ఈటల రాజేందర్‌ను రాక్ టౌన్ అసోసియేషన్ తరపున కోరారు. కాలనీ వాసుల సమస్యను సానుకూలంగా పరిశీలించి, సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కారానికి సహకరిస్తామని ఎంపీ హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ అధ్యక్షులు ఎర్ర వినోద్ రెడ్డి తెలిపారు.

# ఇబ్రహీంపట్నం నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ నేతల సంబురాలు

### 1000రోజుల ప్రజాపాలన పూర్తి సందర్భంగా వేడుకలు...
### సీఎం, పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం..





అరుణప్రభ ఇబ్రహీంపట్నం : రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం.... శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కీలక అభివృద్ధి కార్యక్రమాలు, ఊహించనిస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాల పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకర్గ కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, ఉత్సవాలు జరిపారు. తుర్కయంజాల్ చెరువు కట్ట వద్ద, మున్సిపల్ కార్యాలయం ముందు, అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధారాంరెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు వేడుకలు నిర్వహించారు. ఆదిభట్లలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అటు, మంచాల మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. పదేళ్ల కుటుంబ, నిర్బంధ బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని గడీల పాలననకు విముక్తి లభించి వెయ్యి రోజులు గడిచిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. పోలీసుల నిర్బంధాలు, ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాకాంక్షల మేరకు ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

**మల్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గానికి అగ్రతాంబూలం ...**

మల్‌రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో ఇబ్రహీంట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. గత దశాబ్దానికి పైగా కాలంగా ఇక్కడి నుంచి గెలిచిన వారు తమ స్వార్థ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారించారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి నిధులు తెచ్చి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మల్‌రెడ్డి రంగారెడ్డి మార్చుతున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, సీనియర్ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ 'ఏ' బ్లాక్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, 'బి' బ్లాక్ ప్రెసిడెంట్ భాస్కరాచారి, మహిళా నేతలు కొత్తకుర్మ మంగమ్మ, గుండమోని జయమ్మ ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పార్టీ అధ్యక్షులు లింగం, నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం టౌన్ పార్టీ అధ్యక్షులు గౌస్‌పాష, డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య, రజినీకాంత్, యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి, అయన్‌పటేల్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాలు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.




# ఎస్సీ, ఎస్టీల హక్కుల పరిరక్షణకు ప్రాధాన్యం

ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): ఆర్డీవో కార్యాలయంలో గురువారం సబ్ డివిజన్ స్థాయి విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం ఆర్డీవో రామభూపాల్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. సమావేశానికి డీఎస్పీ బీవీ జగన్నాథరాజు హాజరయ్యారు. ఎస్సీ, ఎస్టీ వర్గాల సంక్షేమ పథకాల అమలు, ప్రభుత్వ సేవలు, హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యలపై సమీక్షించారు. సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించి, నిబంధనల మేరకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆర్డీవో ఆదేశించారు. తహసీల్దార్లు, సంబంధిత శాఖల అధికారులు, డీవీఎంసీ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.



## బాలచిత్తారినగర్ నుండి కాంగ్రెస్ విజయోత్సవ బైక్ ర్యాలీ

### ఉప్పల్ డిపో వద్ద ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం
### ముఖ్యఅతిథిగా పాల్గొన్న డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్
### 1000 రోజుల కాంగ్రెస్ పరిపాలన అభివృద్ధికి, పేదల సంక్షేమానికి సాక్ష్యం

సెప్టెంబర్ 3, అరుణ ప్రభ : కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం 1000 రోజుల పరిపాలన విజయవంతంగా కొనసాగుతున్న సందర్భంగా మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ మేడిపల్లిలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పడతాం లోకేష్ ఆధ్వర్యంలో విజయోత్సవ బైక్ ర్యాలీ బాలచిత్తారి నగర్ నుండి నిర్వహించారు. సాయి ప్రియ కాలనీ కాంగ్రెస్ పార్టీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ నుండి ఉప్పల్ డిపో వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. అనంతరం ఉప్పల్ డిపో వద్ద బోడుప్పల్ సర్కిల్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 50 అడుగుల భారీ చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా డిసిసి అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వజ్రెష్ యాదవ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో 1000 రోజుల కాంగ్రెస్ పాలనలో కెసిఆర్ చేసిన అప్పుల ఊబి నుండి రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు నడిపిస్తూ, నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, తెల్ల రేషన్ కార్డుల పంపిణీ, కొత్త పెన్షన్లు వంటి అనేక సంక్షేమ ఫలాలను అందిస్తూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని అన్నారు. ఓట్లేసి గెలిపించిన ప్రజలకు రికార్డింగ్ డాన్స్ వేసి చూపించడం తప్ప ప్రజలకు మల్లారెడ్డి చేసింది ఏమీ లేదని, చిత్తశుద్ధి ఉంటే మేడ్చల్ నియోజకవర్గ అభివృద్ధి కోసం బహిరంగ చర్చకు సిద్ధమని ఉద్దేశం యాదవ్ సవాల్ విసిరారు. అవినీతి, అక్రమాలకు కేరాఫ్ అడ్రస్ గా మారిన కేసీఆర్ ప్రభుత్వం, బిఆర్ఎస్ నాయకులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని, పదేళ్ల తమ పాలనలో పేదలకు ఒక్క రేషన్ కార్డు కూడా ఇవ్వలేదని, దోచుకోవడం, దాచుకోవడం తప్ప బిఆర్ఎస్ నేతలు ప్రజా సమస్యలను పట్టించుకోలేదని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు,జిల్లా నాయకులు మాజీ ప్రజా ప్రతినిధులు, డివిజన్ నాయకులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, ఎన్ ఎస్ యు ఐ నాయకులు, మహిళా నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



## క్షేత్రస్థాయిలో బీజేపీని బలోపేతం చేయాలి

ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం పట్టణ బీజేపీ కార్యాలయంలో గురువారం పట్టణ పదాధికారుల సమావేశం అధ్యక్షులు జింకా చంద్రశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆదేశాల మేరకు జరిగిన సమావేశానికి జిల్లా అధ్యక్షులు జి.ఎం. శేఖర్, మంత్రి కార్యాలయ నియోజకవర్గ ఇన్‌చార్జి కగ్గోలు హరీష్‌బాబు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డుల వారీగా పార్టీ కార్యక్రమాల విస్తరణ, కార్యకర్తల సమన్వయం, క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం, ప్రజలకు మరింత చేరువ కావడంపై చర్చించారు. జిల్లా ప్రధాన కార్యదర్శులు అమర్ దేవేంద్ర, సాకే ఓబులేసు, యువమోర్చా అధ్యక్షులు బిల్లు కుళ్లాయప్ప యాదవ్, మహిళా మోర్చా అధ్యక్షులు జగ్గ నాగరత్నమ్మ, ఓబీసీ మోర్చా అధ్యక్షులు గొట్లూరు అనిల్‌తో పాటు వార్డు ఇన్‌చార్జీలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## కేసీఆర్ రైతుబంధు అయితే.. రేవంత్ రాబందు!

### మంచిరెడ్డి కిషన్ రెడ్డి, మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి



అరుణప్రభ ఇబ్రహీంపట్నం 420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని చెప్పి, 1000 రోజులు గడిచినా అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటలో భాగంగా రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం యాచారం మండల కేంద్రంలో రైతు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు శ్రీ మంచిరెడ్డి కిషన్ రెడ్డి , రాష్ట్ర నాయకులు శ్రీ మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రాష్ట్రంలోని రైతులు కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో రైతుబంధు, రైతు బీమా, యూరియా, బోనస్ వంటి అంశాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ కంటతడి పెడుతున్నారని అన్నారు. అలాగే ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని రైతులను 22–ఎ సమస్యతో ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. యాచారంలో ఫార్మాసిటీని రద్దు చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అనంతరం మాట మార్చి రైతులను మోసం చేసిందని వారు విమర్శించారు ఈ కార్యక్రమంలో ఫార్మాసిటీ రైతులు, బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు...

# నూతన తహసీల్దార్ దివ్య జ్యోతిని ఘనంగా సన్మానించిన మండల సర్పంచుల ఫోరం ప్రతినిధులు

ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3 (అరుణప్రభ న్యూస్): ఎల్లారెడ్డిపేట మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన ఆడెపు దివ్య జ్యోతిని మండల సర్పంచుల ఫోరం ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు దొమ్మాటి నరసయ్య, మాజీ మండలాధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండాడి రామ్‌రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేండే శ్రీనివాస్, గంట బుచ్చగౌడ్ తదితరులు తహసీల్దార్ దివ్య జ్యోతిని శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం నూతన తహసీల్దార్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండలంలో రెవెన్యూ పరిపాలనను మరింత సమర్థవంతంగా నిర్వహిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని వారు ఆకాంక్షించారు. మండలంలోని గ్రామీణ ప్రాంతాల్లో భూ సంబంధిత సమస్యలు, పట్టాదారు పాస్‌బుక్కులు, ధరణి/భూ భారతి, రెవెన్యూ సేవలు తదితర అంశాల్లో ప్రజలకు ఇబ్బందులు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దివ్య జ్యోతి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన రెవెన్యూ సేవలు అందించేందుకు కృషి చేస్తానని, ప్రజల సమస్యలను నిబంధనల మేరకు పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.



# ధర్మవరంలో విస్తృత కార్డన్ అండ్ సెర్చ్

## 75 ద్విచక్ర వాహనాలు, 11 ఆటోలు, కారు, క్రాకర్స్ సీజ్





ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): గురువారం ధర్మవరంలోని ఎర్రగుంట్ల, లక్ష్మీ చెన్నకేశవ, మహాత్మాగాంధీ కాలనీల్లో జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ ఐపీఎస్ పర్యవేక్షణలో పోలీసులు విస్తృత కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. గణేష్ ఉత్సవాలు, మున్సిపల్, పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అనుమానాస్పద వ్యక్తులు, అక్రమ కార్యకలాపాలు, పాత నేరస్తుల కదలికలపై నిఘాలో భాగంగా తనిఖీలు చేపట్టారు. ధర్మవరం డీఎస్పీ బీవీ జగన్నాథ్‌రాజుతో పాటు ఐదుగురు సీఐలు, ఎస్ఐలు, మొత్తం 102 మంది సిబ్బంది పాల్గొన్నారు. ఇళ్లు, అనుమానాస్పద ప్రాంతాలను తనిఖీ చేసి సరైన పత్రాలు లేని 75 ద్విచక్ర వాహనాలు, 11 ఆటోలు, ఒక కారు, అక్రమంగా నిల్వ ఉంచిన క్రాకర్స్‌ను సీజ్ చేశారు. చెల్లుబాటు అయ్యే పత్రాలు సమర్పించిన వారికి నిబంధనల మేరకు వాహనాలు అప్పగిస్తామని ఎస్పీ తెలిపారు.

### రౌడీషీటర్లు, సస్పెక్ట్‌షీటర్లకు కౌన్సెలింగ్

కాలనీల్లో 13 మంది రౌడీషీటర్లు, ఆరుగురు సస్పెక్ట్‌షీటర్ల ఇళ్లను తనిఖీ చేసిన పోలీసులు.. ఎస్పీ సమక్షంలో వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. నేర కార్యకలాపాలకు దూరంగా ఉండాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మంచి ప్రవర్తనతో ఉంటే నిబంధనల మేరకు రౌడీషీట్ తొలగింపును పరిశీలిస్తామని తెలిపారు.

### అద్దెకు ఇళ్లు ఇచ్చేటప్పుడు అప్రమత్తంగా ఉండాలి

కొత్త వ్యక్తులకు ఇళ్లు అద్దెకు ఇచ్చే ముందు గుర్తింపు పత్రాలను పరిశీలించి పూర్తి వివరాలు తెలుసుకోవాలని ఎస్పీ సూచించారు. అనుమానాస్పద కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, కాలనీల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని కోరారు. వాహన చోరీల నివారణకు నంబర్ ప్లేట్లు, నేమ్‌బోర్డులు లేని వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు తెలిపారు. హిందూపురం, కదిరి ప్రాంతాల్లోనూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిర్వహించామని, పరిస్థితులకు అనుగుణంగా జిల్లాలోని ఇతర ప్రాంతాల్లోనూ తనిఖీలు కొనసాగుతాయని ఎస్పీ తెలిపారు. ప్రజలు, పోలీసులు సమన్వయంతో పనిచేస్తే నేరాల నియంత్రణతో పాటు సురక్షిత వాతావరణం సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# ప్రజాపాలనలో విఫలమైన కాంగ్రెస్ పార్టీకి పాలించే అధికారం లేదు

## కాంగ్రెస్ పార్టీ విధానాలపై భగ్గుమన్న మాజీ ఎమ్మెల్యే శంకర్ నాయక్



అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం గుండెంగా గ్రామాల్లో ఏర్పాటు చేసినటువంటి కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలనపై బీఆర్ఎస్ సమరభేరి లోని రైతు సదస్సుకార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జ్ బానోత్ శంకర్ నాయక్ ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ 1000 రోజుల పాలనను వ్యతిరేకిస్తూ గూడూరు మండలం గుండెంగా గ్రామంలోని వాగ్య తండా ఎస్ ఆర్ ఎస్ పి కెనాల్ కాలువలోకి పార్టీ కార్యకర్తలతో రైతులతో కలిసి దిగి నిరసన... కెసిఆర్ ప్రభుత్వం ఉన్నప్పుడు కాలువలన్నీ సస్యశ్యామలంగా పారేదని రైతులు సుభిక్షంగా ఉండేవారని కొని ఆడారు. ఎండిపోయిన కాలువల్లోకి వెంటనె కాళేశ్వర జలాలు విడుదల చెసి ఎండి పోతున్న పంటలకు వెంటనే నీరు అందివ్వాలి . రైతులు మొత్తము అరిగోస పడుతున్న ఈ కాంగ్రెస్ ప్రభుత్వము సోయిలేకుండ మొద్దు నిద్రలో ఉన్నారు.

రైతు బీమా పెండింగ్‌లు వెంటనే క్లియర్ చేయాలి.యూరియా బుకింగ్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి! గ్రామీణ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, వ్యవసాయానికి విద్యుత్ సరఫరా, రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రజలకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించడంతో పాటు, విద్యుత్ సమస్యలపై వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ఎండీ ఖాసీం మాజీ వైస్ ఎంపీపీ అరె వీరన్న మాజీ జనరల్ సెక్రటరీ నూకల సురేందర్ గుండెంగా సర్పంచ్ బోడ కిషన్ నాయక్ రమేష్ నరసింహ నాయక్ జిల్ల యాకన్న, కొల్లాపురం మాజీ సర్పంచ్ సుధాకర్ వివిధ గ్రామాల సర్పంచ్లు,నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# చెట్లు నాటడం సంరక్షించడం అందరి బాధ్యత

## మానుకోట ను ప్రానుకోటగా మార్చుకుందాం
## కాళోజి వాకర్స్ ఆధ్వర్యంలో వేడుకగా వనమహోత్సవం





అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ జిల్లా కేంద్రం లోని కాళోజి వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఎన్టీఆర్ స్టేడియంలో వనమహోత్సవం కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశమునకు అసోసియేషన్ అధ్యక్షులు నామిరెడ్డి వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించగా.... ముఖ్య అతిథిగా హాజరైన మహబూబాబాద్ మున్సిపల్ కమిషనర్ ఎం వినోద్ కుమార్ మాట్లాడుతూ మహబూబాబాద్ లోని ఎన్టీఆర్ స్టేడియం కేంద్రంగా చేసుకొని ఏర్పాటు చేసిన కాళోజీ వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవం నిర్వహించడం చాలా అభినందనీయమని, దాతల సహకారంతో సుమారుగా 100 మొక్కలు నాటి, వాటి సంరక్షణ బాధ్యతలు చూసుకోవడం వలన భవిష్యత్తు తరాలకు మేలు జరుగుతుందని అన్నారు. భూమిపై 33% ఉండాల్సిన అడవులు రోజురోజుకు జరిగిపోవడం వలన ప్రకృతిలో అనేక విలయాలు సంభవిస్తున్నాయని,అధిక ఉష్ణోగ్రతలు ఏర్పడడం వలన హిమానీనదాలు కరిగిపోవడం తద్వారా జలప్రళయాలు ఏర్పడుతున్నావని, దానికి ఉదాహరణ నేపాల్ దేశంలో జరిగిన వరదల వలన కలిగిన ఇబ్బందులను చూడవచ్చున్నారు. అందువలన భూమిపై అవకాశం ఉన్న ప్రతి చోట (ఇంటిలో, బయట) ప్రతి ఒక్కరు మొక్కలు నాటి, వాటిని బ్రతికించుకోవాలని అన్నారు. ఆత్మీయ అతిథులుగా పాల్గొన్న స్థానిక మున్సిపల్ కౌన్సిలర్ కాటా భాస్కర్ మాట్లాడుతూ.... ఈమధ్య కాలంలో ఎల్ నినో వలన కరువులు ఏర్పడడానికి అడవులు లేకపోవడమే కారణమని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ మొక్కలు పెంచడానికి కృషి చేయాలని అన్నారు. గురువారం నిర్వహించిన వనమహోత్సవ కార్యక్రమానికి సుమారుగా 100 మొక్కలను అందించిన గుండంరాజు పల్లి సర్పంచ్ గునిగంటి కమలాకర్ మాట్లాడుతూ ఈ స్టేడియం లో వాకింగ్ చేయడం వలన అనేక ప్రయోజనాలు ఉన్నాయని ఇక్కడ అన్ని వయసులవారు చాలా ఆనందంగా వాకింగ్ చేయవచ్చని అన్నారు. ఇక్కడ మొక్కలు పెంచడం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించిన వాళ్ళము అవుతామని అన్నారు. కాళోజీ వాకర్స్ అసోసియేషన్ పర్యావరణ పరిరక్షణ ద్యేయంగా పనిచేస్తుందని అన్నారు మహబూబాబాద్ ఎంపీడీవో రఘుపతి రెడ్డి మాట్లాడుతూ ఈ స్టేడియంలో ఇంకను అదనంగా మొక్కలు నాటాలని భావిస్తే, వాటిని అందజేయడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు ఇంకనూ ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ సలహాదారులు మైసా శ్రీనివాస్, కార్యదర్శి పట్టాభి లక్ష్మయ్య, కోశాధికారి సోమ విష్ణువర్ధన్,పెద్ది వెంకన్న, సునీత దేవి, శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెస్ రెడ్డి, మహేందర్ రెడ్డి, రవీందర్, మధుకర్, మల్లారెడ్డి,ప్రసాద్, రాంబాబు, వెంకటేశ్వర్లు,తొలేం వెంకటేశ్వర్లు, ఎస్ శ్రీనివాస్ రెడ్డి, విద్యాసాగర్, వెంకట్, రవి, సోమ రవి, జగదీష్, రమేష్, కృష్ణమూర్తి, దామోదర్, భరత్, కృష్ణమోహన్, రాధాకృష్ణ, పగడయ్య, దామోదర్ రెడ్డి, నరేష్ రెడ్డి, బూర్ల ప్రభాకర్, ఐలేష్, నాగరాజు, బందెల రాజు, శ్రీనివాస్, నేరెళ్ల రాజు, మంగీలాల్,రవి కుమార్, మధు, డాక్టర్ సాయి కిరణ్, మహిళలు పిల్లలు, యువకులు తదితరులు పాల్గొన్నారు

# సీబీఆర్ నుంచి పీఏబీఆర్‌కు 1 టీఎంసీ నీరు తరలించాలి

## బత్తలపల్లి, తాడిమర్రి నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి : మంత్రి సత్యకుమార్



ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం నియోజకవర్గంలోని బత్తలపల్లి, తాడిమర్రి మండలాల తాగు, సాగునీటి అవసరాల కోసం చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (సీబీఆర్) నుంచి 1 టీఎంసీ జీఎన్ఎస్ఎస్ వరద నీటిని పీఏబీఆర్ కుడి కాలువ చివరి ప్రాంతానికి తరలించే పథకానికి ఆమోదం ఇవ్వాలని మంత్రి సత్యకుమార్ యాదవ్ కోరారు. ఈ మేరకు జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడికి లేఖ అందజేశారు. సీబీఆర్ నుంచి నీటిని తరలిస్తే పీఏబీఆర్ కుడి కాలువ పరిధిలోని 48 చెరువులు, 24 చెక్‌డ్యామ్‌లకు నీరు అందించి భూగర్భ జలమట్టాలు పెంచే అవకాశం ఉంటుందని తెలిపారు. బత్తలపల్లి, తాడిమర్రి మండలాల్లో తాగునీటి సమస్యకు ఉపశమనం లభించడంతో పాటు వ్యవసాయం, ఉద్యానవన రంగానికి ప్రయోజనం చేకూరుతుందని పేర్కొన్నారు. పీఏబీఆర్‌లో నీటి లభ్యత తగ్గడంతో కాలువ చివరి ప్రాంతాలకు ఆశించిన స్థాయిలో నీరు అందడం లేదని, ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపేందుకు ప్రతిపాదిత పథకానికి తక్షణ అనుమతులు మంజూరు చేయాలని మంత్రి కోరారు.



## సదాశివపేట మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం

సంగారెడ్డి జిల్లా, సెప్టెంబర్ 3: సదాశివపేట మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం గురువారం ఉదయం మండల ప్రజా పరిషత్ సముదాయంలోని ఐకేపీ భవనంలో నిర్వహించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీమతి పి. అంజనిదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశానికి సీడీసీ చైర్మన్ గాడీల రాంరెడ్డి, వివిధ గ్రామాల సర్పంచులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. మండల పరిధిలో కొనసాగుతున్న వివిధ అభివృద్ధి కార్యక్రమాలపై సమావేశంలో శాఖల వారీగా సమీక్ష నిర్వహించారు. గ్రామాల్లో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతి, ప్రజలకు అందుతున్న ప్రభుత్వ సేవలు, ఆయా శాఖల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అధికారులు వివరాలు వెల్లడించారు. పంచాయతీరాజ్, రెవెన్యూ, ఉపాధి హామీ, విద్య, విద్యుత్, వైద్య, వ్యవసాయ శాఖల పనితీరుపై సమీక్షించారు. అలాగే గ్రామీణ మంచినీటి సరఫరా, ఇందిరమ్మ గృహ నిర్మాణం, మహిళా మరియు శిశు సంక్షేమం, మహిళా సమాఖ్య, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఉద్యానవన, పశుసంవర్ధక శాఖల పరిధిలో చేపడుతున్న కార్యక్రమాలపై చర్చించారు. గ్రామాల్లో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు మెరుగుపరచడం, అభివృద్ధి పనులను వేగవంతం చేయడం, ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో సూచించారు. ప్రజలకు సంబంధించిన సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులు, ప్రజాప్రతినిధులకు సూచించారు.




## ఓటు హక్కుపై యువతకు అవగాహన

ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని వివేకానంద డిగ్రీ కళాశాలలో తహసీల్దార్ దేవరాజ్ ఆధ్వర్యంలో గురువారం స్వీప్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఓటు హక్కు ప్రాధాన్యత, ఓటరు నమోదు, నైతిక ఓటింగ్, ఎన్నికల ప్రక్రియలో యువత భాగస్వామ్యంపై అవగాహన కల్పించారు. 2026 జూలై 1 నాటికి 18 ఏళ్లు పూర్తి చేసిన యువతీ, యువకులు ఓటరుగా నమోదు చేసుకోవడానికి అర్హులని తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. ఓటర్ల నుంచి క్లెయిమ్‌లు, అభ్యంతరాల స్వీకరణ గడువును సెప్టెంబరు 10 వరకు పొడిగించినట్లు, సెప్టెంబరు 5, 6 తేదీల్లో ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ తెలిపారు.

# ఎల్లారెడ్డిపేట నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి బాధ్యతల స్వీకరణ



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 3 (అరుణప్రభ): రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండల నూతన తహసీల్దార్‌గా ఆడెపు దివ్యజ్యోతి గురువారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది నూతన తహసీల్దార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యతనిస్తూ, ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా విధులు నిర్వహిస్తానని దివ్యజ్యోతి తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు, భూ సంబంధిత సమస్యలు, ధరణి/భూ భారతి తదితర రెవెన్యూ అంశాలపై ప్రజలకు సత్వర సేవలు అందించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయ సిబ్బందితో ఆమె సమావేశమై మండలంలోని రెవెన్యూ అంశాలపై వివరాలు తెలుసుకున్నారు.

అరుణ ప్రభ
ARUNAPRABHA TELUGU DAILY
శుక్రవారం, సెప్టెంబరు 4, 2026

# వైభవంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు









ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): పట్టణంలోని పలు ప్రైవేట్ పాఠశాలల్లో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను ముందస్తుగా విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల నడుమ ఘనంగా నిర్వహించారు. సాయినగర్‌లోని విశ్వ భారతి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్, సిద్ధయ్యగుట్ట సమీపంలోని లయోలా ఉన్నత పాఠశాల, కాగితాల వీధిలోని ప్రణవ సాయి స్కూల్లో వేడుకలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విశ్వ భారతి పాఠశాల చైర్మన్ రిజ్వాన్ భాషా మాట్లాడుతూ శ్రీకృష్ణుని జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించామని తెలిపారు. విద్యార్థుల శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయని పేర్కొన్నారు. లయోలా ఉన్నత పాఠశాల కరెస్పాండెంట్ శంకర్ నాయుడు ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో చిన్నారులతో నిర్వహించిన ఉట్టి కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కార్యక్రమంలో రాధా, మనీ, రజిని, తులసి, గాయత్రి, వసుంధర పాల్గొన్నారు. ప్రణవ సాయి స్కూల్ కరెస్పాండెంట్ కృష్ణ కిషోర్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణ, ఉట్టి కొట్టే కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెడ్మాస్టర్ ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# అసెంబ్లీ సమావేశాలకు సన్నద్ధం కండి

### అన్ని శాఖలు ముందస్తు సమాచారంతో సిద్ధంగా ఉండాలి
### ప్రతి శాఖలో సమావేశాల కోసం
### నోడల్ అధికారిని నియమించుకోవాలి: సీఎస్ సంజయ్ జాజు



హైదరాబాద్, సెప్టెంబర్ 3: ఈ నెల 7వ తేదీ నుంచి ప్రారంభం కానున్న రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగే ప్రశ్నలకు తగిన సమాధానాలను త్వరితగతిన అందించేందుకు అన్ని శాఖలు ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. గురువారం డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో అసెంబ్లీ సమేశాల ఏర్పాట్లపై ఉన్నతాధికారులతో జరిగిన సమీక్షా సమావేశంలో సిఎస్ మాట్లాడుతూ గౌరవ సభ్యులు ప్రస్తావించే అంశాలపై సంబంధిత శాఖలు తగిన సమాచారంతో సిద్ధంగా ఉండాలని, ప్రతి శాఖ తరఫున అసెంబ్లీలో ఒక నోడల్ అధికారిని నియమించి, ప్రశ్నలకు సమాధానాల తయారీ, సమాచార సేకరణ, సమన్వయం తదితర అంశాలను నిరంతరం పర్యవేక్షించాలని సీఎస్ ఆదేశించారు. ఉన్నతాధికారులు, విభాగాధిపతులు అవసరమైన సమాచారంతో ముందస్తుగా సిద్ధంగా ఉండాలని, శాసనసభలో ఏదైనా ప్రశ్నకు సంబంధించి అదనపు సమాచారం అవసరమైన సందర్భంలో వెంటనే సంబంధిత శాఖల నుంచి వివరాలను సేకరించి, నిర్ణీత సమయంలో సమాధానం అందించే విధంగా సమన్వయ వ్యవస్థను పటిష్టం చేయాలని, పెండింగ్‌లో ఉన్న ప్రశ్నోత్తరాలకు సంబంధించిన సమాచారాన్నిఅసెంబ్లీ అధికారులకు వెంటనే అందజేయాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు వికాస్ రాజ్, నవీన్ మిట్టల్, బిఎండి ఎక్కా, వాణి ప్రసాద్, ముఖ్య కార్యదర్శులు సందీప్ కుమార్ సుల్తానియా, యోగితా రాణా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో 20 గ్రామీణ గ్రంధాలయాల ప్రారంభం

### ఒక్కో గ్రంధాలయానికి
### 500 పుస్తకాలు ఒక ర్యాకు ,పత్రికల సంచి అందజేత



గ్రామీణ గ్రంథాలయాలు నెలకొల్పడమే లక్ష్యంగా పనిచేస్తున్నటువంటి విపంచి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈరోజు హైదరాబాదు శ్రీకృష్ణదేవరాయ తెలుగు భాషా నిలయంలో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా నూతనముగా ఎన్నుకోబడిన గ్రామపంచాయతీ సర్పంచులు ఇప్పటినుంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ పిలుపుకు స్పందించి వారి గ్రామాలలో గ్రంథాల ఏర్పాటుకు ముందుకు వచ్చారు గ్రామపంచాయతీల సర్పంచుల సహకారంతో 20 గ్రామాలలో గ్రంథాలయాలు ఏర్పాటు ప్రారంభోత్సవం జరిగినది ఈ కార్యక్రమానికి గ్రామీణ గ్రంథాలయ ఉద్యమకారులు విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుముల శ్రీనివాస్ అధ్యక్ష ప్రసంగము చేస్తూ గ్రామీణ గ్రంథాలయాల ప్రాముఖ్యత గురించి వివరించారు .ముఖ్యఅతిథిగా విచ్చేసిన రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ డాక్టర్ రియాజ్ మాట్లాడుతూ మనిషిని ప్రపంచానికి పరిచయం చేసే అక్షరాలు ఆ అక్షరాలు ఉండే పుస్తకాల ఆలయాలు గ్రంథాలయాలు భారతదేశంలో ఎక్కువ పాఠకులున్న రాష్ట్రము తెలంగాణ రాష్ట్రం ప్రైవేటు గ్రంథాలయాలు ఎక్కువ ఉన్న మొదటి జిల్లా నల్గొండ అని చెప్పారు గ్రామీణ గ్రంథాల అభివృద్ధి కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ నుండి నెలకు 3000 రూపాయలు మంజూరు చేస్తామని చెప్పారు గ్రామీణ గ్రంథాలయాల ఏర్పాటు కొరకు విపంచి ఫౌండేషన్ చైర్మన్ అనుమల శ్రీనివాస్ కృషిని ఆయన కొనియాడారు విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి మాట్లాడుతూ వేలమంది సర్పంచులలో గ్రంథాలయ ఏర్పాటుకు ముందుకు వచ్చిన 20 గ్రామల సర్పంచులు ప్రత్యేకత కలిగి ఉన్నారు 20 గ్రాముల సర్పంచులు మిగతా సర్పంచులు ఆదర్శంగా తీసుకొని తమ తమ గ్రామాల్లో గ్రంథాలయాలు నెలకులపడానికి ముందుకు రావాలని అన్నారు.తెలంగాణ గ్రంథాలయ పరిషత్ పూర్వ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ మాట్లాడుతూ గ్రంథాలయ ప్రాముఖ్యతను వివరిస్తూ నల్గొండ ప్రాంతంలో గ్రంథాల ఉద్యమం ప్రారంభం కావడం ఉద్యమకారులే గ్రంథాలయ ఉద్యమకారులు కావటం అభినందనీయమని అన్నారు జాతి చైతన్యానికి జీవంనాడు లాంటి గ్రంథాలయాలు పూర్వ ప్రారంభం కావాలని వాటి నిర్వాహన విజయవంతంగా జరగాలని అన్నారు ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం అధ్యక్షురాలు డాక్టర్ సి భవాని దేవి మాట్లాడుతూ పుస్తకాన్ని చదివితే పుస్తకము మనకు విజ్ఞానం ఇస్తుంది మనిషి నుండి పుస్తకము ప్రేమ పొందుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ బుక్ ఫెయిర్ అధ్యక్షులు కవి యాకూబ్ ఉమ్మడి నల్గొండ జిల్లా పూర్వ గ్రంథాలయం అధ్యక్షులు గాద వినోద్ రెడ్డి విపంచి ఫౌండేషన్ ముఖ్య సలహాదారులు అందోజు నాగభూషణం డాక్టర్ మందడి భరత్ రెడ్డి మొదలగు వారు పాల్గొని ప్రసంగించారు 20 గ్రామపంచాయతీ సర్పంచులు తమ గ్రామంలో గ్రంథాలయాలను పాఠకులు వచ్చి చదివే విధంగా అభివృద్ధి చేస్తామని తమ ప్రసంగాలలో తెలియజేశారు ఈ కార్యక్రమంలో విపంచి ఫౌండేషన్ సభ్యులు శివ శెట్టి ప్రసాద్ బి .గోపికృష్ణ గోపగోని శ్రీనివాస్ , కూరెళ్ళ నరసింహ చారి నకరికంటి సతీష్ తదితరులు పాల్గొని కార్యక్రమం విజయవంతం చేశారు

# 21.86 లక్షల సీఎం సహాయనిధి చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి

అరుణ ప్రభ పాలకుర్తి సెప్టెంబర్ 3 : పాలకుర్తి మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలానికి చెందిన 64 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.21,86,400 విలువైన చెక్కులను పాలకుర్తి శాసన సభ్యురాలు మామిడాల యశస్విని రెడ్డి పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్స పొందలేని పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎం సహాయనిధి ఎంతో పెద్ద అండగా నిలుస్తోందని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆరోగ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ, అర్హులైన ప్రతి కుటుంబానికి వేగంగా సహాయం అందేలా చర్యలు తీసుకుంటోందని తెలిపారు.అనారోగ్యంతో బాధపడుతున్న కుటుంబాలు ఎవరూ చికిత్సకు డబ్బుల కోసం ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం సీఎం సహాయనిధి ద్వారా లక్షల రూపాయల ఆర్థిక సాయాన్ని అందిస్తోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. నియోజకవర్గంలోని ప్రతి అర్హుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు.చెక్కులు అందుకున్న లబ్ధిదారులు సీఎం రేవంత్ రెడ్డి కి, ఎమ్మెల్యే యశస్విని రెడ్డి కి కృతజ్ఞతలు తెలియజేస్తూ, తమ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అందించిన ఆర్థిక సహాయం ఎంతో ఉపయోగపడిందని అన్నారు.ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులు, లబ్ధిదారులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సెప్టెంబరు 8, 9 తేదీల్లో నీటి సరఫరాకు అంతరాయం



ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): దిమ్మెల సర్కిల్‌లో జోన్-2 ఇంటర్ కనెక్షన్ పనుల్లో భాగంగా పబ్లిక్ హెల్త్ శాఖ మరమ్మతులు చేపడుతున్నందున సెప్టెంబరు 8, 9 తేదీల్లో రెండు రోజులపాటు పలు ప్రాంతాలకు నీటి సరఫరా నిలిచిపోనుందని మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య తెలిపారు. గుట్టకిందపల్లి, రాంనగర్, లక్ష్మీనగర్, కొత్తపేట, గిర్రాజకాలనీ, తారకరామాపురం, సుందరయ్యనగర్, దుర్గానగర్, శివరామనగర్, బాలాజీనగర్, టీచర్స్ కాలనీ, మారుతీనగర్ ప్రాంతాలకు నీటి సరఫరా ఉండదన్నారు. ప్రజలు ముందస్తుగా నీటిని నిల్వ చేసుకుని మరమ్మతు పనులకు సహకరించాలని కోరారు. పనులు పూర్తయిన అనంతరం యథావిధిగా నీటి సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.




## ధరల భారాన్ని తగ్గించాలి: కేతిరెడ్డి

ధర్మవరం, సెప్టెంబరు 3 (అరుణ ప్రభ న్యూస్): పెరుగుతున్న నిత్యావసర ధరలతో పేద, మధ్యతరగతి ప్రజలపై భారం పడుతోందని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. గురువారం ధర్మవరం పట్టణంలోని మోర్, పవిత్ర మార్టులను సందర్శించి బియ్యం, పప్పులు, నూనెలు, కూరగాయలు తదితర వస్తువుల ధరలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధరల పెరుగుదల సామాన్యులపై తీవ్ర ప్రభావం చూపుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల వల్లే నిత్యావసర ధరలు పెరుగుతున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మాజీ కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.




## జిల్లా విద్యాశాఖ అధికారి కుటుంబంలో విషాదం

### రోడ్డు ప్రమాదంలో మహబూబాబాద్ జిల్లా డీఈఓ ఏకైక కుమారుడు మృతి

### హైదరాబాద్‌లో విషాద రోడ్డు ప్రమాదం

అరుణప్రభ మహబూబాబాద్, సెప్టెంబర్ 3, : జిల్లా విద్యాశాఖ అధికారి సత్యనారాయణమూర్తి ఏకైక కుమారుడు శ్రీ వేద్ హైదరాబాద్‌లో ఈరోజు ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషాద ఘటనతో కుటుంబ సభ్యులు, బంధువులు, విద్యాశాఖ వర్గాల్లో తీవ్ర విషాదం నెలకొంది. శ్రీ వేద్ మృతి పట్ల ప్రధానోపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్షులు ఇస్లావత్ లచ్చిరాం నాయక్. అసోసియేషన్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు మందుల శ్రీరాములు మరియు జిల్లా జిల్లా అసోసియేట్ అధ్యక్షులు బానోత్ శంకర్ నాయక్. డిస్టిక్ కౌన్సిలర్ బాలాజీ నాయక్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. సత్యనారాయణమూర్తి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ విషాదాన్ని తట్టుకునే మనోధైర్యాన్ని భగవంతుడు ప్రసాదించాలని ఆకాంక్షించారు.

## నేడు గణేష్ మండపాల నిర్వాహకులతో సమన్వయ సమావేశం.

### మహబూబాబాద్ టౌన్ ఇంచార్జి సీఐ ఎన్ అంజలి



అరుణప్రభ మహబూబాబాద్ సెప్టెంబర్ 3 : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో రానున్న గణేష్ నవరాత్రుల ఉత్సవాలను ఉద్దేశించి 04-09-2026 శుక్రవారం సాయంత్రం 05 గం,లకు మహబూబాబాద్ టౌన్ పోలీస్ స్టేషన్ కాన్ఫరెన్స్ హాల్ నందు మహబూబాబాద్ పట్టణంలోని గణేష్ నవరాత్రుల మండపాల నిర్వాహకులతో ముందస్తు సమన్వయ సమావేశం ఉంటుందని మహబూబాబాద్ టౌన్ ఇంచార్జ్ సీఐ ఎన్. అంజలి తెలిపారు. కావున పట్టణ పరిధిలోని గణేష్ మండపాల నిర్వాహకులందరు తప్పక హాజరుకావాలని సీఐ కోరారు.

## వినియోగదారులకు మరింత సేవలు అందించాలి

### జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్



అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ : మహబూబాబాద్ : జిల్లాలోని వినియోగదారులకు మరింత సేవలు అందించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ అనిల్ కుమార్ సూచించారు గురువారం ఐడిఓసిలో జిల్లా వినియోగదారుల సేవా కేంద్రాన్ని వినియోగదారుల సేవా కేంద్రం చైర్మన్ వింజమూరి సుధాకర్ అధ్యక్షతన రిబ్బన్ కట్ చేసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో వినియోగదారులకు జరుగుతున్న మోసాలు, అన్యాయాలు పై న్యాయం కోరుతూ తమ ఫిర్యాదులను ఈ సేవా కేంద్రానికి అందించి వినియోగదారులు సేవలు అందుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో డి సి ఎస్ ఓ రమేష్ నాయక్, సివిల్ సప్లై డిఎం నర్సింగరావు, మైసా శ్రీనివాస్, జానీ, కల్లూరి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# మౌనం వీడుదాం మార్పు తెద్దాం

**(సెప్టెంబర్4 అంతర్జాతీయ లైంగిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా)**

**ఒక సమాజం ఎంతవరకు ప్రగతి సాధించిందో అక్కడ ఉన్న మహిళలు సాధించిన ప్రగతిని బట్టి నేను లెక్కిస్తాను : డాక్టర్ బి ఆర్ అంబేడ్కర్**

సమాజ ప్రగతిలో స్త్రీ పురుషులు సమాన భాగస్వాములు. ఒక దేశం సమగ్రాభివృద్ధిని ఆ దేశంలో ఉన్న స్త్రీ పురుష సమానత్వం నిర్దేశిస్తుంది. సమాజ ఆర్థిక రాజకీయ సాంస్కృతిక వికాసంలో స్త్రీ పురుష పాత్ర గణనీయమైన ప్రభావాన్ని కలిగి ఉన్నపటికీ పురుషులతో పోలిస్తే మహిళలు అనేక రకాల వేధింపుల విష వలయాలలో చిక్కుకుపోయారు.



**మహిళ పై లైంగిక వేధింపులు పెరుగుతున్నాయి.**

అంతర్జాతీయ లైంగిక ఆరోగ్య దినోత్సవం సెప్టెంబర్ 4వ తేదీన ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తారు. లైంగిక ఆరోగ్యం హక్కులు మరియు సురక్షితమైన లైంగిక ప్రవర్తనపై సమాజంలో అవగాహన పెంచడం దీనికి సంబంధించిన సామాజిక అపోహలను తొలగించడం ఈరోజు ప్రధాన ఉద్దేశం

చరిత్ర 2010లో వరల్డ్ అసోసియేషన్ ఫర్ సెక్స్ హెల్త్ అనే అంతర్జాతీయ సంస్థ పిలుపు మేరకు 2010 సెప్టెంబర్ 4న మొదటిసారిగా ఈరోజు నిర్వహించారు. అప్పటినుండి ప్రతి సంవత్సరం ప్రత్యేకమైన నేపథ్యంలో ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆరోగ్య సంస్థ ద్వారా భాగస్వామ్యంతో అవగాహన కార్యక్రమాలు సదస్సులు సమావేశాలను నిర్వహిస్తుంది.

**ముఖ్య ఉద్దేశం లైంగిక హక్కులు మానవ హక్కులు**

ప్రతి ఒక్కరికి తమ శరీరంపై లైంగిక ఎంపికలపై పూర్తి హక్కులు ఉంటాయని ఇది కూడా ప్రాథమిక మానవ హక్కుల్లో ఒక భాగమని గుర్తించడం. అవగాహన పెంపొందించడం లైంగికంగా సంక్రమించే వ్యాధులు (STI s/HIV) అవాంచిత గర్భధారణలను ఎలా నివారించాలో అవగాహన కల్పిస్తారు. అపోహలను తొలగించడం సమాజంలో లైంగిక ఆరోగ్యం గురించి మాట్లాడానికి ఉండే సంకోచాన్ని వివక్షను దూరం చేయడం. పరస్పర అంగీకారం లైంగిక సంబంధాలలోఇరుపక్షాల గౌరవం నమ్మకం మరియు పరిష్కార అంగీకారం యొక్కప్రాధాన్యతను గుర్తించడం.

**2026 ప్రత్యేక సంవత్సరం థీమ్ ఎవ్రీ బాడీ** (every body)

లైంగిక ఆరోగ్యం హక్కులు న్యాయం మరియు ఆనందము అనేటువంటివి మినాహాయింపులు లేకుండా ప్రతి ఒక్కరికి సమానంగా చెందుతాయి. అని థీమ్ యొక్క ముఖ్య ఉద్దేశం.

భారత దేశములో జరుగుతున్న లైంగిక వేధింపులులిమహిళలపై అత్యధిక నేరాలు నమోదు అవుతున్న రాష్ట్రాల్లో మొదటి స్థానంలో ఉత్తరప్రదేశ్ ఆ తర్వాత స్థానంలో మహారాష్ట్ర రాజస్థాన్ పశ్చిమ బెంగాల్ మధ్యప్రదేశ్ ఉన్నాయి. జనాభా పరంగా ఎక్కువ క్రైమ్ రేటు దేశములో ప్రతి లక్ష మంది జనాభాలో జరిగే నేరాల శాతం దేశ.రాజధాని డిల్లీ లో నమోదు అయింది. తర్వాత హర్యానా తెలంగాణ రాజస్థాన్ రాష్ట్రాలున్నాయి. మహా నగరాలు డిల్లీ మహిళలకు ప్రమాదకరంగా మారినట్టు సర్వేలు తెలుపుతున్నాయి. కలకత్తా సురక్షితమైన నగరంగా నిలిచింది.

**నేరాలు రకాలు**

NCRB సర్వే ప్రకారం మహిళలపై జరిగే నేరాలలో భర్త లేదా బంధువుల వేధింపులు(31.4 శాతం) మొదటి స్థానంలో ఉండగా మహిళల శీలానికి భంగం కలిగించే లైంగిక వేధింపులు దాడికి పాల్పడటం(18.7 శాతం) అత్యాచారాల((7.1 శాతం)

లైంగిక వేధింపుల నిర్మూలన చట్టాలు

కొత్త భారతీయ న్యాయ సంహిత 2023( BNS)

సెక్షన్ 74 మహిళల శీలానికి భంగం కలిగించడం

ఒక మహిళను లంగికంగా వేధించాలనే ఉద్దేశముతో ఆమె పై

బలాత్కారం చేయడం దాడి చేయడం పాల్పడితేకతిన శిక్ష ఉంటుంది.

పని ప్రదేశాలలో మహిళల పై లైంగిక వేధింపులు నిరోధక.చట్టం

ఈ చట్టం ప్రకారం ప్రతి సంస్థ పరిశ్రమ 10 మంది కంటే ఎక్కువ ఉంటే ఇంటర్నల్ కంప్లైంట్స్ కమిటీర్పాటు చేయాలి. పని చేసే చోట మహిళలు తమకు కలిగిన వేధింపులను ఈ కమిటీకి పిర్యాదు చేస్తారు. కమిటీ.విచారణ జరిపి సంబంధిత వ్యక్తిపై చర్య తీసుకొమ్మని యాజమాన్యానికి రికమెండ్ చేస్తారు .

**ఫాక్సో చట్టం 2012**

18 సంవత్సరాల వయసు లోపు ఉన్న బాల బాలికలపై జరిగే ఎలాంటి లైంగిక్.వేధింపులు దాడుల నుండి రక్షించడానికి ఈ చట్టం తీసుకొచ్చారు.ఈ నేరాలకు నాన్ బెయిల్ వారెంట్ ఇస్తారు. కేసులను సత్వరమే పరిష్కరిస్తారు. కేసులను విచారించి జైలు లేదా జీవిత ఖైదు విధిస్తారు.

**గృహ హింస నిరోధక చట్టం 2005**

వివాహ బంధంలో లేదా కుటుంబములో మహిళలు ఎదురుకునే శారీరక మానసిక లైంగిక వేధింపుల నుండి ఈ చట్టం రక్షణ కల్పిస్తుంది.

**భారత మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డి వై చంద్రచూడ్**

సమాజంలో మార్పు అనేది తరగతి గదుల నుంచే ప్రారంభం కావాలి. యువత ముఖ్యంగా విద్యార్థులు మహిళలు హక్కులను గౌరవించడం మరియు చట్టాలపై అవగాహన కలిగి ఉండడం ద్వారానే మనం ఒక సురక్షితమైన సమనత్వంతో కూడిన భారతదేశాన్ని నిర్మించగలం.

**బిజస్టిస్ డివైస్ చంద్ర గౌడ్**

న్యాయం మరియు భద్రతా కేవలం కోర్టులలోనే కాదు. సమాజంలోని ప్రతి ఒక్కరి ఆలోచనలోను ఉండాలి. వేధింపులకు వ్యతిరేకంగా గొంతే ఎత్తే ధైర్యాన్ని బాధితులు అండగాలిచే సంస్కారాన్ని విద్యార్థులు అలవర్చుకోవాలి

బిజస్టిస్ ఎస్ వి రమణ (మాజీ భారత ప్రధాన న్యాయమూర్తి)

భారత దేశ మాజీ ప్రధాన న్యాయమూర్తులు చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వాలకు కనువిప్పు కావాలి. భారత ప్రభుత్వం నూతన విద్యావిధానంలో మహిళా సాధికారిత రాజ్యాధికారం లో మహిళా వాటా పెంచటానికి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి. మహిళాభివృద్ధే మానవాభివృద్ధిగా అభివృద్ధి పథకాలు ప్రవేశ పెట్టాలి. మహిళలపై జరిగే లైంగిక వేధింపులను ఆర్టికట్టడానికి న్యాయ పరమైన చట్టపరమైన సంస్కరణలు ప్రవేశ పెట్టాలి. మహిళా సంక్షేమం మహిళా హక్కుకు భద్రత అంశాలను నూతన విద్యావిధానంలో పాఠ్యాంశంగా ప్రవేశ పెట్టాలి. పౌరసమాజం ప్రభుత్వం స్వచ్ఛంద సంస్థలు సమష్టిగా మహిళల పై జరిగే లైంగిక.వేధింపులను అరికట్టడానికి సోషల్ కౌన్సెలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలి

**మహిళాభివృద్ధే మానవాభివృద్ధి.. దిశగా సమాజం ఉద్యమించాలి.**



**నేదునూరి కనకయ్య, అధ్యక్షులు తెలంగాణ**

**ఎకనామిక్ ఫోరం రచయిత కాలమిస్ట్**

**9440245771, కరీంనగర్**



# రెడ్ల నిరసన దీక్షను విజయవంతం చేయాలని పిలుపు

## నల్లవెల్లి కరుణాకర్ రెడ్డి

## రెడ్డి సంఘాల ఐక్యవేదిక , స్టేట్ వర్కింగ్ ప్రెసిడెంట్



ఈనెల 08-2026 నాడు రెడ్డి కార్పొరేషన్ కు వెయ్యి కోట్ల నిధి తో పాటు వెంటనే పాలకవర్గం ఏర్పాటు చేయాలని వేలాదిమందితో...ఇందిరాపార్క్ హైదరాబాద్ లో జరుగబోయే " రెడ్ల నిరసన దీక్ష " కు మీ యొక్క జిల్లా నుండి పెద్ద ఎత్తున తరలిరావాలని జిల్లా నుండి ప్రతి రెడ్డి కుటుంబాన్ని శిరస్సు వంచి నమస్కరిస్తూ కోరుతున్నాము.

**మాటిచ్చి మరచి పోయిన రాష్ట్ర ప్రభుత్వానికి మరోసారి గుర్తు చేయడానికే దీక్ష**

స్వాతంత్రం వచ్చి నన్ను ఇప్పటివరకు కూడా పేరుకు రెడ్డి ముఖ్యమంత్రి ఉన్నంత మాత్రాన మా సామాజిక వర్గానికి కావచ్చు అగ్రవర్ణ పేదలకు కావచ్చు ఒరిగిందేమీ లేదు. మా సామాజిక వర్గంలోని పేద రెడ్లకు కావచ్చు అగ్రవర్ణాల పేదల కావచ్చు న్యాయం జరగాలంటే రెడ్డి సామాజిక వర్గం ముఖ్యమంత్రి కాకుండా బీసీ సామాజిక వర్గానికి చెందినవారు కావచ్చు ఎస్సి సామాజిక వర్గ చెందిన వారు కావచ్చు ముఖ్య మంత్రిగా చేయాలని మేము ఈ సందర్భంగా మా అభిప్రాయాన్ని వ్యక్తపరుస్తున్నాం. ఈ మార్పు వల్ల మా పేద రెడ్లకు కావచ్చు అగ్రవర్ణ పేదలకు న్యాయం జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాం. రెడ్డి కార్పొరేషన్ తో పాటు రైతు భీమా పథకం కొనసాగించాలి. EWS పదిశాతం రిజర్వేషన్ ను అన్ని ప్రభుత్వ విభాగాల్లో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, మన, మన పిల్లల భవిష్యత్ కోసమే చేస్తున్న దీక్ష కు మీ యొక్క జిల్లాలోని ప్రతి గ్రామంలో ఉన్న ప్రతి రెడ్డి కుటుంబం నుండి ఒకరు రావాలని కోరుతున్నాం. ఈ కార్యక్రమంలో గాదరీ సంజీవరెడ్డి సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, మహిపాల్ రెడ్డి, సుదర్శనరెడ్డి,రమేష్ రెడ్డి, ప్రవీణ్ రెడ్డితదితరులు పాల్గొన్నారు.



# జపాన్‌లో డ్రైవర్ ఉద్యోగాలకు యువతకు అవకాశం

## అర్హులైన అభ్యర్థులు ఐడీటీఆర్‌లో దరఖాస్తు చేసుకోవాలి: జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ : రాజన్న సిరిసిల్ల జిల్లాలో అర్హత కలిగిన యువతకు జపాన్‌లో డ్రైవర్ ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన యువత సద్వినియోగం చేసుకోవాలని ఆమె సూచించారు. జపాన్ సంస్థ ప్రతినిధులు, జిల్లా రవాణా శాఖ అధికారి శ్రీనివాస్, తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని ఇన్స్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ అండ్ ట్రైనింగ్ రీసెర్చ్ (ఐడీటీఆర్) ప్రిన్సిపాల్ దురై మురుగన్‌తో జిల్లా కలెక్టర్ గురువారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశానికి ముందు జపాన్ సంస్థ ప్రతినిధులు మండేపల్లిలోని ఐడీటీఆర్‌ను సందర్శించి అక్కడ అందిస్తున్న డ్రైవింగ్ శిక్షణ, మౌలిక వసతులు, ఇతర అంశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ జిల్లాలో హెవీ మోటార్ వెహికల్ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి, ఇంగ్లిష్ భాషపై పట్టు ఉండి, 25 సంవత్సరాల వయసు ఉన్న యువత ఈ శిక్షణకు అర్హులని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్న యువత మండేపల్లిలోని ఐడీటీఆర్‌ను సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని సూచించారు. జిల్లా రవాణా శాఖ అధికారి, ఐడీటీఆర్ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో జిల్లాలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, పాలిటెక్నిక్ కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించి అర్హులైన యువతను గుర్తించి ఎంపిక చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎంపికైన అభ్యర్థులకు ఐడీటీఆర్‌లో ఉచితంగా రెసిడెన్షియల్ శిక్షణ అందించడంతో పాటు జపాన్ భాషలో ప్రత్యేక శిక్షణ ఇవ్వనున్నట్లు కలెక్టర్ తెలిపారు. శిక్షణ పూర్తి చేసి ఎంపికైన వారికి జపాన్‌లో డ్రైవర్‌గా ఉద్యోగం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. జపాన్‌లో ఉద్యోగం పొందిన వారికి నెలకు సుమారు రూ.80 వేల నుంచి రూ.లక్ష వరకు వేతనం లభించే అవకాశం ఉందని కలెక్టర్ తెలిపారు. విదేశాల్లో ఉపాధి పొందేందుకు లభిస్తున్న ఈ అవకాశాన్ని అర్హులైన యువత వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాల కోసం తంగళ్లపల్లి మండలం మండేపల్లిలోని ఐడీటీఆర్ కార్యాలయాన్ని సంప్రదించాలని, ఐడీటీఆర్ ప్రిన్సిపాల్‌ను 94421 25075 నంబర్‌లో సంప్రదించవచ్చని అధికారులు తెలిపారు. ఈ సమావేశంలో జపాన్ సంస్థ ప్రతినిధులు ఓసీ బుచి, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఏపీ, తెలంగాణలో వానలు.. అప్రమత్తంగా ఉండాలని ఐఎండీ హెచ్చరిక

తెలుగు రాష్ట్రాల్లో రానున్న కొన్ని రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) వెల్లడించింది. మధ్యప్రదేశ్ పరిసర ప్రాంతాల్లో కొనసాగుతున్న అల్పపీడన ప్రభావంతో ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో వర్షాలు కురుస్తాయని పేర్కొంది. ఈ మేరకు వాతావరణ శాఖ అధికారులు 13 జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం, తెలంగాణలోని హైదరాబాద్, జగిత్యాల, కామారెడ్డి సహా పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉంది. మరోవైపు, ఆంధ్రప్రదేశ్‌లోని కోస్తాంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సెప్టెంబర్ 3 నుంచి 5వ తేదీ వరకు వర్షాలు కురుస్తాయని అధికారులు స్పష్టం చేశారు. ప్రస్తుతం ఈశాన్య మధ్యప్రదేశ్ పరిసరాల్లో అల్పపీడనం కొనసాగుతుండగా, దానికి అనుబంధంగా సముద్ర మట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉంది. దీనికి తోడు, మధ్యప్రదేశ్ నుంచి తూర్పు మధ్య బంగాళాఖాతం వరకు రుతుపవన ద్రోణి కూడా కొనసాగుతోందని, వీటి ప్రభావంతోనే వర్షాలు కురుస్తాయని అధికారులు వివరించారు. ఈ నేపథ్యంలో సెప్టెంబర్ 3, 4 తేదీల్లో మత్స్యకారులు చేపల వేట కోసం బంగాళాఖాతంలోకి వెళ్లవద్దని స్పష్టమైన హెచ్చరికలు జారీ చేశారు. ఈదురుగాలులు బలంగా వీచే అవకాశం ఉన్నందున, ప్రజలు విద్యుత్ స్తంభాలు, భారీ హోర్డింగ్‌ల కింద ఉండరాదని, అప్రమత్తంగా వ్యవహరించాలని అధికారులు సూచించారు.

# మహర్షి విద్యాలయలో అంబరాన్నంటిన కృష్ణాష్టమి సంబరాలు

## శ్రీకృష్ణుడి గోపిక వేషధారణలో దేదిప్యమానంగా చిన్నారులు

## పండుగ సందర్భంగా ఉట్టి కొట్టి సందడి చేసిన చిన్నారులు

అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్‌లోని మహర్షి విద్యాలయలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు పాఠశాల ప్రాంగణంలో గురువారం అత్యంత వైభవంగా, ఉత్సాహభరిత వాతావరణంలో జరిగాయి. ప్రీ-ప్రైమరీ చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఈ సంబరాలకు పాఠశాల కరస్పాండెంట్ శ్రీమతి సుధా అర్జున్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా చిన్నారులు శ్రీకృష్ణుడు, రాధ, గోపికల వేషధారణలతో అలరించారు. చేతిలో పిల్లనగ్రోవి, తలపై నెమలి పించాలతో వచ్చిన చిన్ని కృష్ణుల సందడితో పాఠశాల ప్రాంగణం గోకులమును తలపించింది. వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన "ఉట్టి కొట్టడం" కార్యక్రమం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. చిన్నారులు ఎంతో ఉత్సాహంతో ఉట్టిని కొట్టి విజయం సాధించగా, అక్కడి వారంతా చప్పట్లతో వారిని





ప్రోత్సహించారు. ఈ సంబరాలలో కరస్పాండెంట్ శ్రీమతి సుధా అర్జున్ రెడ్డి చిన్నారులతో కలిసి ఉత్సాహంగా నృత్యం (డాన్స్) చేసి అలరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. శ్రీకృష్ణుని జీవితం మనకు ప్రేమ, కరుణ, మరియు మంచి మార్గంలో నడవడాన్ని నేర్పుతుందని, చిన్నారులు చిన్నతనం నుంచే సద్గుణాలను అలవర్చుకోవాలని పిలుపునిచ్చారు. వేడుకల ముగింపులో చిన్నారులందరికీ ప్రత్యేక మిఠాయిలు మరియు ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు పాఠశాల యాజమాన్యం తెలిపింది

# ఢిల్లీలో తెలంగాణ ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై కాంగ్రెస్ నేతల కీలక చర్చ

## ప్రజా సమస్యల పరిష్కారం,

## పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చ.



న్యూఢిల్లీ:అరుణ ప్రభ.తెలంగాణ రాష్ట్ర ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, భవిష్యత్ రాజకీయ కార్యాచరణపై కాంగ్రెస్ పార్టీకి చెందిన ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు ఢిల్లీలో సమావేశమై విస్తృతంగా చర్చించారు. తెలంగాణ రాష్ట్ర ఎంపీల ఫోరం కన్వీనర్, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి గారి నివాసంలో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్రంలో నెలకొన్న తాజా రాజకీయ పరిణామాలతో పాటు పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రజా సమస్యలు, ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లే అంశాలపై నాయకులు తమ అభిప్రాయాలను పంచుకున్నారు. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు మరింత చేరువ చేయాలని నాయకులు పేర్కొన్నారు. పార్టీని గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు మరింత బలోపేతం చేయడంతో పాటు, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకుని పార్టీ అనుసరించాల్సిన వ్యూహాలు, ప్రభుత్వ కార్యక్రమాల అమలు, ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే దిశగా తీసుకోవాల్సిన చర్యలపై కూడా సమావేశంలో చర్చించారు. కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేస్తూ ప్రజల విశ్వాసాన్ని చూరగొనేలా సమష్టిగా ముందుకు సాగాలని నాయకులు నిర్ణయించారు. ఈ సమావేశంలో ఎంపీలు సురేష్ కుమార్ షెట్కర్, అనిల్ కుమార్ యాదవ్, బలరాం నాయక్, ఎమ్మెల్యేలు మల్‌రెడ్డి రంగారెడ్డి, రామ్మోహన్ రెడ్డి, దొంతి మాధవ రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దయాసాగర్, మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్, మాజీ కార్పొరేషన్ ఛైర్మన్లు మల్‌రెడ్డి రాంరెడ్డి, అనిల్ కుమార్, ౧+ాణూ చైర్మన్ చరణ్ కౌశిక్ యాదవ్, మాజీ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇబ్రహీంపట్నం నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ నేతల సంబురాలు

### 1000రోజుల ప్రజాపాలన పూర్తి సందర్భంగా వేడుకలు

### సీఎం, పీసీసీ చీఫ్, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం





రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 1,000 రోజులు పూర్తైన సందర్భంగా ఇబ్రహీం పట్నం నియోజకవర్గవ్యాప్తంగా కాంగ్రెస్ నేతలు సంబురాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం.... శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి నాయకత్వంలో ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో కీలక అభివృద్ధి కార్యక్రమాలు, ఊహించనిస్థాయిలో అమలవుతున్న సంక్షేమ పథకాల పట్ల పార్టీ నాయకులు, కార్యకర్తలు విజయోత్సవాలు జరుపుకున్నారు. ఇబ్రహీంపట్నం నియోజకర్గ కేంద్రంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేసి, ఉత్సవాలు జరిపారు. తుర్కయంజాల్ చెరువు కట్ట వద్ద, మున్సిపల్ కార్యాలయం ముందు, అంబేద్కర్ విగ్రహం వద్ద మున్సిపల్ మాజీ ఛైర్ పర్సన్ మల్ రెడ్డి అనురాధారాంరెడ్డి నేతృత్వంలో పార్టీ నేతలు వేడుకలు నిర్వహించారు. ఆదిభట్లలో సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. అటు, మంచాల మండల కేంద్రంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. పదేళ్ల కుటుంబ, నిర్బంధ బీఆర్ఎస్ హయాంలో తెలంగాణ ప్రజలు స్వేచ్ఛగా జీవించలేని గడీల పాలననకు విముక్తి లభించి వెయ్యి రోజులు గడిచిందని కాంగ్రెస్ నేతలు అన్నారు. పోలీసుల నిర్బంధాలు, ఆంక్షలు లేకుండా స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజాకాంక్షల మేరకు ప్రజాప్రభుత్వం ముందుకు సాగుతోందని చెప్పారు.

**మల్‌రెడ్డి సారథ్యంలో నియోజకవర్గానికి అగ్రతాంబూలం ...**

మల్‌రెడ్డి రంగారెడ్డి సారథ్యంలో ఇబ్రహీంట్నం నియోజకవర్గానికి నిధుల కేటాయింపులో ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యమిస్తోందని కాంగ్రెస్ నేతలు తెలిపారు. గత దశాబ్దానికి పైగా కాలంగా ఇక్కడి నుంచి గెలిచిన వారు తమ స్వార్థ ప్రయోజనాలపై మాత్రమే దృష్టి సారిం చారని ఆరోపించారు. రాష్ట్రంలో ఏ నియోజకవర్గానికి లేని విధంగా ఇబ్రహీంపట్నం ప్రాంతానికి నిధులు తెచ్చి అభివృద్ధికి కేరాఫ్ అడ్రస్‌గా మల్‌రెడ్డి రంగారెడ్డి మార్చుతున్నారని చెప్పారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ ఛైర్మన్ గురునాథ్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ భూపతిగల్ల మహిపాల్, సీనియర్ నేతలు ఈసీ శేఖర్‌గౌడ్, కొంగర విష్ణువర్ధన్‌రెడ్డి, రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ 'ఏ' బ్లాక్ ప్రెసిడెంట్ పాండురంగారెడ్డి, 'బి' బ్లాక్ ప్రెసిడెంట్ భాస్కరాచారి, మహిళా నేతలు కొత్తకుర్మ మంగమ్మ, గుండమోని జయమ్మ ఇబ్రహీంపట్నం, మంచాల మండలాల పార్టీ అధ్యక్షులు లింగం, నరేందర్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం టౌన్ పార్టీ అధ్యక్షులు గౌస్‌పాష, డివిజన్ల అధ్యక్షులు శ్రీనివాస్, ఐలయ్య, రజినీకాంత్, యూత్‌కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ అధ్యక్షులు సికిందర్‌రెడ్డి, అయన్‌పటేల్, కౌన్సిలర్లు, వివిధ గ్రామాలు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## అధర్మానికి వ్యతిరేకంగా ఆవిర్భవించిన వాడే శ్రీకృష్ణుడు

### శ్రీకృష్ణుడి జీవిత ఇతివృత్తాంతం అద్భుతం

### లండన్ కిడ్స్ స్కూల్ లో ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు



అరుణప్రభ 3 సెప్టెంబర్ మహబూబాబాద్ అర్బన్ : మహబూబాబాద్ లోని లండన్ కిడ్స్ పాఠశాలలో శ్రీ కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థిని విద్యార్థులు గోపిక కృష్ణా వేషధారణ లో అలరించారు. విద్యార్థులు మరియు ఉపాధ్యాయులు ఉట్లు కొట్టడం , నృత్యాలతో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ బూర పూర్ణ చందర్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ నేటితరం పిల్లలకు ఆధ్యాత్మికత ఎంతో అవసరమని ప్రతిరోజు సంప్రదాయాలను సంస్కృతిని కాపాడుకుంటూ క్రమశిక్షణతో కూడుకున్న విద్యాభ్యాసం కొనసాగితే భవిష్యత్తు బంగారు మయమని కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన అన్నారు మరియు బూర శరణ్య, ఏవో గాడిపెల్లి సుమన్, ప్రిన్సిపల్ లు భూక్యా హిమబిందు, కుసుమ మీనాక్షి మరియు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# సిర్గాపూర్ మండల సర్వ సభ్య సమావేశంలో పాల్గొన్న గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి



నారాయణఖేడ్ నియోజకవర్గం : సిర్గాపూర్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సిర్గాపూర్ మండల సర్వసభ్య సమావేశానికి గౌరవ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గారు హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలు, అభివృద్ధి పనులపై అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో ఎమ్మెల్యే సమీక్షించారు. సిర్గాపూర్ మండలంలో సుమారు రూ. 200 కోట్లతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటు కానుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ పాఠశాల ద్వారా గ్రామీణ ప్రాంతాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆధునిక వసతి, భోజనం, క్రీడా మరియు ఇతర మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఇలాంటి సమగ్ర నివాస పాఠశాలల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతున్నట్లు వార్తా నివేదికలు పేర్కొన్నాయి. సమావేశంలో మిషన్ భగీరథ, తాగునీరు, విద్యుత్, రహదారులు, విద్య, వైద్యం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, పెండింగ్ గృహాలు, పశుసంవర్ధక శాఖ, సీడీపీవో--ఐసీడీఎస్, ఈజీఎస్ తదితర శాఖల సమస్యలపై చర్చించారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ప్రజలు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత శాఖల అధికారులు వెంటనే పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు. తాగునీటి సరఫరాలో అంతరాయాలు, రహదారుల మరమ్మతులు, విద్యుత్ సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు, గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సర్పంచులు మరియు పంచాయతీ కార్యదర్శులే గ్రామాల అభివృద్ధికి ముందడుగు అని ఎమ్మెల్యే అన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పరస్పర సమన్వయంతో పనిచేస్తే గ్రామాల్లో అభివృద్ధి వేగవంతమవుతుందని తెలిపారు. గ్రామాల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని, ఈ ప్రక్రియలో తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఎమ్మెల్యే గారి చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేయడం జరిగింది ఈ సమావేశంలో ఆత్మ కమిటీ ఛైర్మన్ వినోద్ పాటిల్, మండల ప్రత్యేక అధికారి రోహిణి మరియు మండల స్థాయి అధికారులు, సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## పేకాట స్థావరంపై వన్‌టౌన్ పోలీసుల దాడి

### పది మంది అరెస్ట్.. రూ.11,550 నగదు స్వాధీనం



ధర్మవరం, సెప్టెంబర్ 3 (అరుణ ప్రభ న్యూస్): ధర్మవరం వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పట్టణ శివారు ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి నిర్వహించారు. ఈ సందర్భంగా పేకాట ఆడుతున్న 10 మందిని అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి రూ. 11,550 నగదును స్వాధీనం చేసుకున్నారు. పేకాట ఆడటం, ఆడించేందుకు సహకరించడం వంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. అదేవిధంగా గంజాయి, పేకాటతో పాటు ఇతర అక్రమ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. అక్రమ కార్యకలాపాలపై సమాచారం అందించే వారి వివరాలను గోప్యంగా ఉంచడంతో పాటు, సమాచారం ఆధారంగా చర్యలు చేపట్టిన సందర్భంలో పోలీసు శాఖ నిబంధనల మేరకు తగిన పారితోషికం అందజేస్తామని పోలీసులు తెలిపారు. సమాచారం ఉన్న వారు ధర్మవరం వన్‌టౌన్ సీఐను 94407 96831 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

# సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

### జేఏసీ చైర్మన్ ఊటు యశ్వంత్, కన్వీనర్ డా. రామారావు



సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ పోస్టర్ ను తెలంగాణ ఉద్యోగుల సంయుక్త కార్యాచరణ సమితి (TGEJAC), రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో IDOC, కొంగరకలాన్‌లో ఆవిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా TGEJAC రంగారెడ్డి జిల్లా చైర్మన్ యశ్వంత్ మాట్లాడుతూ రాష్ట్ర ఉద్యోగ జేఏసీ కార్యాచరణలో భాగంగా 10న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని రంగారెడ్డి జిల్లా ఉద్యోగస్తులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు పెద్ద ఎత్తున పాల్గొని చలో హైదరాబాద్ ను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో రంగారెడ్డి జిల్లా TGEJAC కన్వీనర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ ఇప్పుడున్న ప్రభుత్వం అధికారము లోకి వచ్చిన 6 మాసాలలో ఉద్యోగుల సమస్యలన్నీ పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. మేనిఫెస్టోలో పెట్టిన హామీలను అమలు చేయమని ప్రభుత్వాన్ని కోరారు. సెప్టెంబర్ 10న జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, ఉపాధ్యాయులు, నాలుగవ తరగతి ఉద్యోగులు, కార్మికులు మరియు పెన్షనర్లు అందరూ ఐక్యంగా ముందుకు వచ్చి, తమ నిరసనను బలంగా వినిపిద్దామని తెలియజేసి చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు,ఉపాధ్యాయులు మరియు పెన్షనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని సెప్టెంబర్ 10 లో జరిగే చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఉద్యోగ నాయకులు కోరారు. ఈ కార్యక్రమం లో జిల్లా కో కన్వీనర్ యమ్. శ్రీను, కో చైర్మన్లు గోపాల్, రమేష్, డేవిడ్, గోపాల్ జి, శాంతి శ్రీ, వైస్ చైర్మన్లు నూతనకంటి వెంకట్, సైదమ్మ, రాకేష్, జమ కుశాల్, మల్లారెడ్డి, రంగయ్య,గోపాల్, వెంకటస్వామి, పరమేష్ , మహేష్, సంతోష్, ప్రమీల, రాణి అరుణ తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 10న 'చలో హైదరాబాద్- మహా ధర్నా' విజయవంతం చేయాలి

హైదరాబాద్, సెప్టెంబర్ 3: తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్ల దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న న్యాయమైన డిమాండ్ల సాధన కోసం తెలంగాణ గవర్నమెంట్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్--మహా ధర్నా' కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చింది. ఈ పిలుపు మేరకు కార్యక్రమాన్ని విజ యవంతం చేసేందుకు హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్, కన్వీనర్ వెంకట్ గండూరి, ఆర్థిక కార్యదర్శి హరికృష్ణ పంతులు, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ ఎం.బి. కృష్ణా యాదవ్, ఆర్థిక కార్యదర్శి కుర్రాడి శ్రీను ఆధ్వర్యంలో వివిధ శాఖల్లో సన్నాహక సమావేశాలు నిర్వహించారు. ఉద్యానవన శాఖ, ఆబ్కారీ శాఖ, భూగర్భ జలాల శాఖ, ప్రజారోగ్య వైద్య విధాన పరిషత్ తదితర శాఖల్లో ఉద్యోగులతో సమావేశాలు నిర్వహి ంచి, గోడపత్రికలను ఆవిష్కరించారు. సెప్టెంబర్ 10న ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహా ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా హైదరాబాద్ సిటీ చైర్మన్ కట్కూరి శ్రీకాంత్ మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిర్వహిస్తున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో ఉద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఉద్యోగులంతా ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. వెంకట్ గండూరి, ఎం.బి. కృష్ణా యాదవ్, ఎస్. నిరంజన్‌రెడ్డి, పంతులు హరికృష్ణ, నాగిరెడ్డి, కుర్రాడి శ్రీను, రాజ్‌కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం అందరూ ఐక్యంగా పనిచేయాలని కోరారు. ప్రతి ఉద్యోగి సెప్టెంబర్ 10న జరిగే 'చలో హైదరాబాద్' కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో అర్మానీ రాజు, టి.ఎల్. స్వామి, వేదిక్, శ్రీధర్, ఖదీర్, కిరణ్, దాస్, హరి, క్రాంతి, ప్రభాకర్, సుజాత, అశోక్ యాదవ్ తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. అలాగే సెప్టెంబర్ 10న నిర్వహించనున్న 'చలో హైదరాబాద్' కార్యక్రమానికి సంబంధించిన 'ఉద్యోగ పోరుబాట' గీతాన్ని ఈ సందర్భంగా విడుదల చేశారు.

# బందగి అకాల మరణం తీరని లోటు: సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకటరెడ్డి





అరుణ ప్రభ.దిండి ,సెప్టెంబర్ 3,నల్లగొండ జిల్లా రైతు సంఘం అధ్యక్షులు ఎండి మైనుద్దీన్ కుమారుడు బందగి అకాల మరణం చెందడం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసినట్లు సిపిఐ జాతీయ కార్యదర్శి మాజీ ఎమ్మెల్యే కామ్రేడ్ పల్లా వెంకటరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.డిండి మండలంలోని కందుకూరు గ్రామంలో బందగి భౌతికకాయాన్ని సందర్శించి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు ఈ సందర్భంగా పల్లా వెంకటరెడ్డి మాట్లాడుతూ ఎంతో భవిష్యత్తు యువకుడు బందగి చిన్న వయసులోనే మరణించడం ఎంతో బాధాకరమని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు మైనుద్దీన్ కుటుంబానికి తీరని లోటు అని ఆయన అన్నారు .అమరుడు బందగి ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షిస్తూ, వారి కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర సిపిఐ కార్యవర్గ సభ్యులు పల్లా నరసింహారెడ్డి, ఎమ్మెల్సీ సిపిఐ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం జిల్లా సహాయ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్, కార్యవర్గ సభ్యులు తూము బుచ్చిరెడ్డి గురిజా రామచంద్రం బొడ్డుపల్లి వెంకటరమణ ,రవీందర్ శర్మ ,దిండి మండల కార్యదర్శి కనకాచారి, సహాయ కార్యదర్శి విజయేందర్ రెడ్డి ,శైలేష్, కుంభం జయరాములు ,దీప సుదర్శన్ రెడ్డి ,పోలే వెంకటయ్య నల్లమల ఆంజనేయులు, వినయ్, తదితర పార్టీ నాయకులు, రైతు సంఘం నాయకులు, మండలంలోని సిపిఐ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని బందగీ అంతిమయాత్రలో పాల్గొన్నారు.

# వేములవాడలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ప్రారంభం

## ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత సులభంగా, వేగంగా అందించడమే ప్రభుత్వ లక్ష్యం: ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

ఎల్లారెడ్డిపేట అరుణప్రభ న్యూస్ : ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత సులభంగా, వేగవంతంగా అందించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా ప్రభుత్వ కార్యాలయాల్లో మెరుగైన మౌలిక వసతులు కల్పిస్తూ సేవలను ప్రజలకు మరింత చేరువ చేస్తున్నామని తెలిపారు. వేములవాడ పట్టణంలోని మార్కెట్ యార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. అనంతరం కార్యాలయాన్ని పరిశీలించి అక్కడ అందుబాటులో ఉన్న సౌకర్యాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ సేవల కోసం ప్రజలు కార్యాలయాలకు వచ్చినప్పుడు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా సౌకర్యవంతమైన వాతావరణం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం అందుబాటులోకి రావడంతో వేములవాడ ప్రాంత ప్రజలకు రిజిస్ట్రేషన్ సేవలు మరింత సులభతరం కానున్నాయని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అవసరమైన ప్రభుత్వ సేవలను వారి సమీపంలోనే అందించేందుకు చర్యలు తీసుకుంటోందని ఆది శ్రీనివాస్ తెలిపారు. వేములవాడ నియోజకవర్గంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు



అవసరమైన మౌలిక వసతులు, సౌకర్యాలను కల్పించి ప్రజలకు ఇబ్బందులు లేకుండా సేవలు అందేలా కృషి చేస్తున్నామని చెప్పారు. ప్రజలకు మెరుగైన పాలన అందించడంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల పనితీరును మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజల అవసరాలను తీర్చడమే ప్రభుత్వ ధ్యేయం అని ప్రభుత్వ విప్ తెలిపారు.

# ఉత్తమ ఉపాధ్యాయులకు ఎమ్మెల్యే సంజీవరెడ్డి సన్మానం

సిర్గాపూర్, సెప్టెంబర్ 3: సిర్గాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన మండల స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమంలో నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధ్యాయుల సేవలు, బాధ్యతలు, సమాజ నిర్మాణంలో వారి కీలక పాత్రను కొనియాడారు. "ఉపాధ్యాయులు కేవలం పాఠాలు బోధించేవారు మాత్రమే కాదు.. భవిష్యత్తును రూపొందించే దేశ నిర్మాతలు. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపే గురువులకు మనం ఎంత కృతజ్ఞతలు తెలిపినా సరిపోదు" అని అన్నారు. విద్యార్థులకు నైపుణ్యాలు, విలువలు, దిశానిర్దేశం అందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అమూల్యమైనదని, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో విద్యా నాణ్యత పెంపొందించేందుకు ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమని పేర్కొన్నారు. అనంతరం మండల స్థాయిలో విద్యా రంగంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన ఉపాధ్యాయులను ఎమ్మెల్యే సన్మానించారు. శాలువా, స్మారక చిహ్నం, ప్రశంసా పత్రాలతో వారిని ఘనంగా సత్కరించి, హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. "మీరు చూపిన అంకితభావం, కృషి ఇతర ఉపాధ్యాయులకు స్ఫూర్తిదాయకంగా ఉండాలి. విద్యార్థులకు మంచి మార్గదర్శకులుగా, స్నేహితులుగా మారి వారి భవిష్యత్తును తీర్చిదిద్దాలి" అని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక ప్రక్రియ, విద్యా నాణ్యత పెంపొందించే దిశగా తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్ ప్రణాళికలపై చర్చించారు.




కార్యక్రమంలో సంగారెడ్డి జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి, ఆత్మ కమిటీ చైర్మన్ వినోద్ పాటిల్, మండల విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, సిర్గాపూర్ సర్పంచ్ శ్రీనివాస్‌రావు, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# భార్యను దారుణంగా హత్య చేసి అత్తపై కత్తితో దాడి చేసిన నిందితుడి అరెస్ట్.. రిమాండ్‌కు తరలింపు

## వివరాలు వెల్లడించిన ఎల్లారెడ్డిపేట సీఐ ఓ. వెంకటేష్



ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 03 (అరుణప్రభ ప్రతినిధి): ఎల్లారెడ్డిపేట సర్కిల్ పరిధిలోని పదిర గ్రామంలో చోటుచేసుకున్న దారుణ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎల్లారెడ్డిపేట సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఓ. వెంకటేష్ తెలిపారు. గురువారం రాత్రి 9 గంటలకు హత్యకు సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. చీకోడు గ్రామానికి చెందిన పల్లెపు సురేష్‌కు, అతని భార్య పల్లెపు జ్యోతికి కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో భార్యపై అనుమానం పెంచుకున్న సురేష్ ఆమెను హత్య చేయాలని పథకం వేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. ఈ క్రమంలో సెప్టెంబర్ 02న పదిర గ్రామానికి వచ్చిన సురేష్ తన వెంట తీసుకువచ్చిన కత్తితో భార్య పల్లెపు జ్యోతిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొంతుతో పాటు శరీరంలోని పలు భాగాలపై కత్తితో దాడి చేయడంతో జ్యోతి తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందింది. ఈ ఘటనను అడ్డుకునేందుకు ప్రయత్నించిన మృతురాలి తల్లి గండికోట ఎల్లవ్వపై కూడా సురేష్ అదే కత్తితో దాడి చేయడంతో ఆమె తీవ్రంగా గాయపడింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు ఎల్లవ్వను చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

### కేసు నమోదు.. నిందితుడి అరెస్ట్

ఈ ఘటనపై మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎల్లారెడ్డిపేట పోలీస్ స్టేషన్‌లో క్రైమ్ నంబర్ 229/2026, సెక్షన్ 103(1), 109(1) బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసినట్లు



సీఐ వెంకటేష్ తెలిపారు. కేసు దర్యాప్తులో భాగంగా నిందితుడు పల్లెపు సురేష్‌ను పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. అనంతరం చట్టపరమైన ప్రక్రియ పూర్తి చేసి కోర్టు ముందు హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు.

### చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దు

ఈ సందర్భంగా సీఐ ఓ. వెంకటేష్ మాట్లాడుతూ.. సమాజంలో చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై పోలీసు శాఖ ఆధ్వర్యంలో కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కుటుంబ కలహాలు, వ్యక్తిగత సమస్యలు లేదా ఇతర వివాదాలు ఎదురైనప్పుడు చట్టాన్ని చేతుల్లోకి తీసుకోకుండా పోలీసులను ఆశ్రయించి చట్టపరమైన మార్గాల్లో సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. భార్యను దారుణంగా హత్య చేసి, అడ్డువచ్చిన అత్తపై కత్తితో దాడి చేసిన నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించడంతో కేసు దర్యాప్తు కొనసాగుతోంది.





# పాత నగర అభివృద్ధికి కొత్త దిశ.. దక్షిణ విశాఖలో అభివృద్ధి పరుగులు

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌కు ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఘన సన్మానం

విశాఖపట్నం, అరుణ ప్రభ సెప్టెంబర్ 3: దక్షిణ నియోజకవర్గ అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తూ, ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపుతున్న జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్‌ను దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. నియోజకవర్గ అభివృద్ధి, మౌలిక వసతుల కల్పనలో కమిషనర్ చూపుతున్న ప్రత్యేక చొరవ అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వెలంపేట గ్రామ ప్రజలు దాదాపు 100 ఏళ్లుగా ఎదుర్కొంటున్న ఇళ్ల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా చర్యలు చేపట్టడం ప్రశంసనీయమన్నారు. ఆధునిక వసతులతో గృహ నిర్మాణం జరిగేలా అధికారులు కృషి చేస్తున్నారని తెలిపారు. దక్షిణ నియోజకవర్గంలోని మురికివాడల అభివృద్ధిపైనా ప్రత్యేక దృష్టి సారించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించడంతో పాటు, త్వరలో మూడు స్లమ్ ప్రాంతాల అభివృద్ధికి శ్రీకారం చుట్టనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలో మరో రెండు నూతన మార్కెట్లను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. శిథిలావస్థకు చేరుకున్న జనతా బజార్ మార్కెట్‌ను అత్యాధునిక వసతులతో అభివృద్ధి చేసే పనులు చేపడుతున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. అదేవిధంగా ఎస్ఎల్ కాలువ అభివృద్ధికి రూ.18 కోట్ల నిధుల కేటాయింపులో కమిషనర్ కేతన్ గార్గ్ కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఎన్నో ఏళ్లుగా పరిష్కారానికి నోచుకోని సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరిస్తూ అభివృద్ధి పనులకు వేగం తీసుకురావడంలో కమిషనర్ కృషి ప్రత్యేకమన్నారు. పాత నగరం నుంచి ప్రజలు ఇతర ప్రాంతాలకు తరలివెళ్లే పరిస్థితి గతంలో ఉండేదని, ప్రస్తుతం దక్షిణ విశాఖలో మౌలిక వసతుల అభివృద్ధి, ప్రజా సౌకర్యాల పెంపుతో కొత్త వాతావరణం ఏర్పడుతోందని వంశీకృష్ణ శ్రీనివాస్ అన్నారు. మురికివాడల అభివృద్ధి నుంచి ఆధునిక నివాసాలు, మార్కెట్లు, మౌలిక వసతుల వరకు దక్షిణ విశాఖ రూపురేఖలు మారుతున్నాయని తెలిపారు. ఈ మార్పులో అధికారులు, జీవీఎంసీ యంత్రాంగం చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, మౌలిక వసతులు, పట్టణాభివృద్ధికి అధిక ప్రాధాన్యత ఇస్తోందని ఎమ్మెల్యే తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, మంత్రులు నారా లోకేష్, నారాయణ నాయకత్వంలో ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. దక్షిణ నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చెందిన, ఆధునిక వసతులతో కూడిన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అధికారులతో సమన్వయంతో నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పష్టం చేశారు.కావాలంటే దీనికి ఇంకా ఆకర్షణీయమైన 5 పత్రికా హెడ్‌లైన్లు ం 2 సబ్‌హెడ్‌లైన్లు కూడా తయారు చేస్తాను.

# ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లాటరీలో ఎంపికైనవారి వివరాల పరిశీలన

**80 మంది అధికారులు క్షేత్ర స్థాయి పర్యటనలు**

**ప్రత్యేకంగా రూపొందించిన మొబైల్ యాప్ లో వివరాల నమోదు**

**స్వయంగా పాల్గొన్న హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం**

**ఆ నాలుగు నియోజకవర్గాల్లో గడువు పెంపు**

హైదరాబాద్, సెప్టెంబరు 3 : ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలన ప్రక్రియను అధికారులు చేపట్టారు. ఇందు కోసం ప్రత్యేకంగా యాప్ (మొబైల్ అప్లికేషన్) రూపొందించారు. క్యూర్ పరిధిలోని 16 నియోజకవర్గాల్లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ లో ఇండ్ల ను లాటరీ ద్వారా కేటాయించిన సంగతి తెలిసిందే. ప్రతి నియోజకవర్గంలోను (సికింద్రాబాద్ కంటోన్మెంట్ మినహా) నిర్మిస్తున్న 480 ఇండ్లతో పాటు, వెయిటింగ్ లిస్ట్ గా అదనంగా మరికొంత మందిని లాటరీ ద్వారా ఎంపిక చేసారు. ఈ విధంగా ఎంపికైన వారి వివరాలను క్షేత్ర స్థాయిలో 80 మంది అధికారుల బృందం పరిశీలిస్తున్నది. హౌసింగ్ బోర్డు తోపాటు, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ --మల్కాజిగిరి జిల్లాలకు చెందిన హౌసింగ్ కార్పొరేషన్ కు చెందిన ఇఇలు, ప్రాజెక్టు డైరక్టర్లు, అసిస్టెంట్ ఎస్టేట్ ఆఫీసర్లు, ఎఇ లు, జూనియర్ అసిస్టెంట్ లతో పాటు వివిధ స్థాయిల్లో ఉన్న సిబ్బంది ఈ ప్రక్రియను నిర్వహిస్తున్నారు.

### హౌసింగ్ బోర్డు విసి శ్రీ వి పి గౌతం పరిశీలన

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో లాటరీ లో ఎంపికైన దరఖాస్తుదారుల వివరాలను హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం క్షేత్ర స్థాయిలో స్వయంగా పరిశీలించారు. ఖైరతాబాద్ నియోజకవర్గంలో గురువారం నాడు జరిగిన పరిశీలన లో ఆయన పాల్గొన్నారు. లాటరీలో ఎంపికై ప్రస్తుతం బషీర్ బాగ్ లోని షేర్ గేట్ సమీపంలో నివసిస్తున్న వారి ఇంటికి ఆయన వెళ్లారు. ఆ ఇంటిలోని వారి వివరాలను తెలుసుకోవడమే కాకుండా , సేకరిస్తున్న సమాచారం యాప్ లో నమోదు అవుతున్న తీరును పరిశీలించి, అన్ని వివరాలను స్వయంగా తానే యాప్ లో అప్ లోడ్ కూడా చేశారు.

### పరిశీలన ఎందుకంటే....

ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకునే సమయంలో ఎటువంటి ధృవపత్రాలను స్వీకరించ లేదు. కేవలం వివరాలను మాత్రమే తీసుకున్నారు. ఈ నేపథ్యంలో ఇండ్ల కోసం దరఖాస్తు చేసుకున్న సమయంలో ఇచ్చిన వివరాల్లోని వాస్తవికతను నిర్ధారించుకోడానికి క్షేత్ర స్థాయి పరిశీలన చేపడుతున్నారు. ఇందిరమ్మ ఇండ్ల టవర్స్ పథకంలో అర్హులైన వారికే ఇండ్లు లభించేలా చూడాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పలు రకాలుగా చర్యలు చేపట్టింది. లాటరీ ద్వారా ఎంపికైన వారి వివరాలపై ఏమైనా అభ్యంతరాలను తెలియచేసే అవకాశం కూడా కల్పించింది. దరఖాస్తుదారుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించడానికి ప్రత్యేకంగా రూపొందించిన యాప్ ను వినియోగించుకుంటున్నారు. దరఖాస్తు సమయంలో అందించిన సమాచారాన్ని యాప్ కు అనుసంధాన పరచి, వాటిలోని వాస్తవికతను నిర్ధారించుకుంటున్నారు. వీరు అద్దె ఇంట్లో ఉంటున్నారా, ప్రస్తుతం నివసిస్తున్న ఇంటి స్థితి గతులు (ఆర్ సిసి, రేకుల షెడ్ వంటివి), ఇంటిలో ఉంటున్న వారు ఏం చేస్తున్నారు, వంటి వివరాలతో పాటు, ఎంతకాలంగా ఆ ఇంటిలో నివసిస్తున్నారు మొదలైన అంశాలను అడుగుతూ, యాప్ ద్వారా అక్కడికక్కడే అప్ లోడ్ చేస్తున్నారు. పదేళ్లుగా నివసిస్తున్నారా లేదా, ఒకవేళ 10 ఏళ్లు పూర్తి కాకపోతే, అంతకు ముందు ఎక్కడ నివసించారు తదితర అంశాలపై సమాచారాన్ని సేకరిస్తున్నారు. ఆయా అంశాలపై ధృవపత్రాలతోపాటు, వారు ప్రస్తుతముంటున్న ఇండ్ల ఫోటోలను కూడా యాప్ లో అప్ లోడ్ చేస్తున్నారు. లాటరీ ద్వారా ఎంపికైన అందరి దరఖాస్తుల పరిశీలనను వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్న సంకల్పంతో అధికారులు క్షేత్ర స్థాయిలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఈ ప్రక్రియకు దరఖాస్తుదారులు సహకరించాలని హౌసింగ్ బోర్డు అధికారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

### ఆ నాలుగు నియోజకవర్గాల్లో గడువు పెంపు

ఇందిరమ్మ ఇండ్లు టవర్స్ పథకంలో భాగంగా నాలుగు నియోజకవర్గాల్లో కొనసాగుతున్న డిమాండ్ సర్వే దరఖాస్తుల స్వీకరణ గడువును వారం రోజుల పాటు పొడిగించారు. ఈ పథకంలో భాగంగా తొలుత 16 నియోజకవర్గాల్లో దరఖాస్తులను ఆహ్వానించి, వాటి కేటాయింపు లాటరీ ప్రక్రియను కూడా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ నియోజకవర్గాలకు అదనంగా ముషీరాబాద్, గోషామహల్, ఎల్.బి.నగర్, చంద్రాయణ గుట్ట నియోజకవర్గాల ప్రజల నుంచి కూడా దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రత్యేకంగా మరో నోటిఫికేషన్ ఆగస్టు 16 వ తేదీన విడుదల చేశారు. దరఖాస్తులను సెప్టెంబరు 3 వ తేదీ వరకు సమర్పించవచ్చని ప్రకటించారు. అయితే గడువు పెంచాలంటూ వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణనలోనికి తీసుకున్న అనంతరం గురువారం నాటితో ముగియనున్న, ఈ గడువును సెప్టెంబర్ 10 వ తేదీ వరకు పొడిగించినట్లు హౌసింగ్ బోర్డు వైస్ ఛైర్మన్ శ్రీ విపి గౌతం తెలిపారు. అల్పాదాయ వర్గాల ప్రజల సొంత ఇంటి కలను నిజం చేయడానికి ప్రభుత్వం చేపట్టిన ఈ పథకంలో ఇండ్లు పొందేందుకు కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

CORPORATE OFFICE:SNEHALA MEDIA PUBLICATIONS LLP, PLOT NO. 267,HUDA SAI NAGAR COLONY, BESIDE COMMUNITY HALL, VANASTHALIPURAM, RR DIST, HYDERABAD 500070.TG. CELL. 9348313999/8885727777.

Edited, Printed, Published & Owned By GURRAM PAPI REDDY,# H.No.4-57, Thorrur Village, Abdullapurmet Mandal, Turkayamal Municipality, Ranga reddy District.501511. Telangana. Printedat:GARUDA PRINT- ERS,# H.No.2-86/1, PlotNo.23-SP, SyNo.417, Sagar Highway, Ranganaguda Village, Abdullapurmet Mandal, Turkayamjal Municipality, Ranga reddy District.501510.Telangana.Published at: # H.No.4-57, Thorrur Village,Abdullapurmet Mandal, TurkayamalMunicipality, Ranga reddy District. 501511. Telangana...www.arunaprabha.com..email.arunaprabhadaily@gmail.com, RNI NO. TELTEL/2023/89778, Cell No. 9700127889